# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 8 ఆగస్టు 2025 | సంపుటి: 9 | సంచిక: 221 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


అణుదాడిని గుర్తు చేసుకున్న జపాన్



2

ఎల్ఐసీకి రూ.10,987 కోట్ల లాభం




2



# అపాయింట్‌మెంట్ ఇయ్యలే

**బీసీ రిజర్వేషన్ బిల్లుపై తనతో కలిసేందుకు రేవంత్ బృందానికి అవకాశమివ్వని రాష్ట్రపతి**

2

## 10 రోజుల క్రితమే టైమివ్వాలని కోరినం

## మోడీ, అమిత్ షా అడ్డుకున్నరు..

## అయినా పోరాటం ఆపం

## ఢిల్లీలో మీడియా సమావేశంలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 07, (మనం బ్యూరో): బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని భావించిన సీఎం రేవంత్ రెడ్డి బృందం ప్రయత్నాలు ఫలించలేదు. ఇదే అంశంపై పీసీసీ పిలుపు మేరకు బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని కోరేందుకు 10 రోజుల క్రితమే సీఎంవో అధికారులు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరారు. మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోసం గురువారం మధ్యాహ్నం వరకూ ఎదురు చూశారు. అయినప్పటికీ రాష్ట్రపతి భవన్ నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో నిరాశకు గురయ్యారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన నివాసంలో మంత్రులతో కలిసి మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో కులగణన చేపట్టామని వివరించారు. ఈ నివేదిక ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించామనీ, ఇందుకు గాను

...మిగతా 2లో

## రిజర్వేషన్లపై ఎంత వరకైనా సరే..: మీడియాతో ముఖ్యమంత్రి చిట్‌చాట్

బీసీలపై ప్రేమ ఉంటే కేంద్రం బీసీ రిజర్వేషన్ల బిల్లును వెంటనే ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడిన సీఎం బీసీ రిజర్వేషన్ 42 శాతం ఇవ్వాలన్నది తమ కమిట్మెంట్ అని అన్నారు. రిజర్వేషన్ సాధన కోసం తాము చేయాల్సింది చేశామనీ, కుల గణన రిజర్వేషన్ల సాధనలో తమ చిత్తశుద్ధిని ఎవరూ

...మిగతా 2లో

## బీఆర్ఎస్‌ది శిఖండి పాత్ర

**కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికి**

**బీజేపీతో కుమ్మక్కైన్రు**

**మంత్రి కొండా సురేఖ**



హైదరాబాద్, ఆగస్టు 07, మనం బ్యూరో): బీసీలకు 43 శాతం

...మిగతా 2లో

# నేడు సిట్ విచారణకు బండి

**ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలు సమర్పించనున్న కేంద్ర మంత్రి**

**తాను ఇవ్వనున్న ఆధారాలపై కేంద్ర హోం శాఖ అధికారులతో చర్చ**

**సిట్‌కు వాంగ్మూలం ఇవ్వనున్న తొలి కేంద్ర మంత్రిగా సంజయ్**



హైదరాబాద్, ఆగస్టు 07, (మనం బ్యూరో): రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం సిట్ విచారణకు హాజరు కానున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంజయ్ డిమాండ్ చేశారు. దీంతో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి తన వద్ద ఉన్న ఆధారాలను సమర్పించాలని సిట్ అధికారులు బండి సంజయ్‌కు నోటీసులు జారీ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే పలువురు నేతలను విచారించిన సిట్ వారి నుంచి వాంగ్మూలాలను సేకరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం సంజయ్ సిట్ ఎదుట హాజరై ఇప్పటి వరకు తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సేకరించిన ఆధారాలను అందజేయనున్నారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోం శాఖ అధికారులు గురువారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు పోలీస్ ఉన్నతాధికారులు

...మిగతా 2లో

## ఒక్క నియోజకవర్గంలోనే లక్ష నకిలీ ఓట్లు

- మహారాష్ట్రలో ఐదు నెలల్లోనే 40 లక్షల మంది కొత్త ఓటర్లు
- ఓటర్ లిస్టు ఇచ్చేందుకు ఈసీ నిరాకరించింది
- తమ పరిశోధనలో తేలిన అంశాలను మీడియాకు వెల్లడించిన రాహుల్ గాంధీ

2

## చేనేత కార్మికుల సంక్షేమంలో మనమే టాప్



**జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా వస్త్ర ఎగ్జిబిషన్ ప్రారంభంలో మంత్రి తుమ్మల**

**కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డ్‌కు ఎన్నికైన వారికి సత్కారం**

**త్రిలింగ పట్టు చీరలను ఆవిష్కరించిన నాగేశ్వర రావు**

హైదరాబాద్, ఆగస్టు 7: దేశానికి అన్నం పెట్టే రైతన్నకు, వస్త్రాన్నిచ్చే నేతన్నకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కల్పించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు

...మిగతా 2లో

# వర్షబంధంలో హైదరాబాద్

## క్లౌడ్ బరస్ట్.. హై అలెర్ట్

- అర్ధ రాత్రి ఆకస్మిక వరదలు..?
- సైబర్ సిటీలో ట్రాఫిక్ కష్టాలు
- ఐటీ కారిడార్లో కిలోమీటర్ల మేర నిలిచిపోయిన ట్రాఫిక్
- అస్తవ్యస్తంగా మారిన నగర జనజీవనం

2

## ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలె

**భారీ వర్షం నేపథ్యంలో అధికారులతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్**



హైదరాబాద్, ఆగస్టు 7: రాష్ట్ర రాజధానిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాలతో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ..

...మిగతా 2లో

ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు తీసేస్తే..

## బీసీ బిల్లు ఆమోదింపజేసే బాధ్యత నేను తీసుకుంట

- మజ్లిస్ కనుసన్నల్లో కాంగ్రెస్ పనిచేస్తోంది
- ఒవైసీ, అజారుద్దీన్, షబ్బీర్ అలీ కూడా బీసీలేనా?
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



2

## కిషన్ రెడ్డి కుట్రలు సాగనివ్వం

ఢిల్లీలో మీడియా సమావేశంలో మంత్రి పొన్నం



2

## 2047 లక్ష్యాలకు దెబ్బ

**ట్రంప్ సుంకాల ప్రభావంపై దువ్వూరి సుబ్బారావు**

హైదరాబాద్, ఆగస్టు 7: ట్రంప్ సుంకాల ప్రభావం ఇప్పటికిప్పుడు ఉండకున్నా.. మధ్యస్థ, దీర్ఘకాలంలో మాత్రం అధిక ప్రభావం చూపుతుందని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్, ఆర్థిక వేత్త దువ్వూరి సుబ్బారావు తెలిపారు. భారత్‌పై మరో 25 శాతం సుంకాన్ని విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ అంశంపై ఆయన ఒక ఇంగ్లిషు మీడియాతో మాట్లాడారు. భారత జీడీపీలో ఎగుమతుల వాటా 22 శాతంగా ఉంది. మొత్తం ఎగుమతుల్లో అమెరికా

...మిగతా 2లో

## పెన్షన్ పెంచకపోతే ఆందోళన తప్పదు

పెద్ద ఎత్తున వికలాంగులతో కలసి ఉద్యమిస్తాం

కేంద్ర మంత్రి వీరేందర్ కుమార్‌ను కలిసిన మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య



3

**కోర్టుల్లో పెండింగ్ కేసుల తగ్గింపునకు కార్యాచరణ సిద్ధం చేయండి**

అధికారులను ఆదేశించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు

2

## భారత్‌కు రానున్న పుతిన్

**ఏడాది ఆఖర్లో వచ్చే అవకాశం**

మాస్కో, ఆగస్టు 7: రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. ఆయన పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్ వెల్లడించారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న డొభాల్.. రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షొయిగుతో సమావేశమైన అనంతరం ఈ ప్రకటన చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నేపథ్యంలో భారత్ పై అమెరికా అధ్యక్షుడు

...మిగతా 2లో

## 20వేల డాలర్లకో గ్రీన్ కార్డ్

**అమెరికాలో ఉండాలనుకునే ఆశావహులకు స్పెషల్ ఆఫర్**




న్యూయార్క్, ఆగస్టు 7: అమెరికాలో శాశ్వత నివాసం కోసం జారీ చేసే గ్రీన్ కార్డు కోసం భారత్ సహ చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ దేశస్థులు ఏళ్లతరబడి నిరీక్షించాల్సి వస్తుంది. దానికి చెక్ పెడుతూ సరికొత్త షార్ట్ కట్ రూట్ లభించబోతున్నది. గ్రీన్ కార్డ్ కోసం 10 ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్నవారు 20 వేల డాలర్లు (మన కరెన్సీలో దాదాపు రూ.17.5 లక్షలు) చెల్లిస్తే త్వరగా వారి దరఖాస్తును పరిశీలించే అవకాశాన్ని పరిశీలిస్తామన్న అంశంతో కూడిన ఒక బిల్లును అగ్రరాజ్య సర్కార్ ప్రతిపాదించింది.డిగ్నిటీ యాక్ట్ ఆఫ్ 2025 పేరిట ఆ బిల్లును తీసుకువచ్చారు. "దశాబ్దాలుగా

...మిగతా 2లో

## మా బ్యూరోక్రాట్లు విదేశాలకు పరారైతున్నరు

**ఇక్కడ అవినీతితో సంపాదించిన డబ్బుతో అక్కడ ఎంజాయ్ చేస్తున్నరు**

**వెల్లడించిన పాకిస్తాన్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్**



ఇస్లామాబాద్, ఆగస్టు 7: పాకిస్తాన్ ఉన్నతాధికారులపై ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశానికి చెందిన బ్యూరోక్రాట్లు భారీ అవినీతి, మనీలాండరింగ్ కు పాల్పడుతున్నారని ఆరోపించారు. సగం మంది బ్యూరోక్రాట్లు అక్రమంగా సంపాదించిన కోట్లాది రూపాయల నల్లధనాన్ని పాక్ నుంచి పోర్చుగల్‌కు తరలించి, అక్కడ ఆస్తులు కొనుగోలు చేశారని అన్నారు. 'మా దేశానికి చెందిన సగం మందికిపైగా బ్యూరోక్రాట్లు పోర్చుగల్ లో ఆస్తులు కొన్నారు. ఇప్పుడు పౌరసత్వం కోసం ప్రయత్నిస్తున్నారు. వీరంతా ఎంతో పేరున్న ఉన్నతాధికారులు. వందల కోట్ల రూపాయలను మింగేస్తూ, పదవీ విరమణ తర్వాత సుఖమయ జీవితాన్ని కొనసాగిస్తున్నారు' అని ఖవాజా చెప్పారు. ఓ మాజీ సీఎంకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న ఓ సీనియర్ అధికారి

...మిగతా 2లో

# అపాయింట్‌మెంట్ ఇయ్యలే

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీలో రెండు బీసీ బిల్లులకు ఏకగ్రీవ ఆమోదం తెలిపి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను నాలుగు నెలలుగా రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం కోటా దాటొద్దని 2018లో అప్పటి సీఎం కేసీఆర్ చట్టం చేశారనీ, కానీ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కోసం కేసీఆర్ తెచ్చిన చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్ గవర్నర్‌కు పంపించామనీ, అది కూడా కేంద్ర ప్రభుత్వం వద్దే పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. బీసీ బిల్లులకు ఆమోదం తెలపాలని డిమాండ్‌తో ఢిల్లీలో ధర్నా చేపట్టామని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లపై జాతీయ స్థాయిలో పోరాడాలనే ఉద్దేశ్యంతోనే ఢిల్లీకి వచ్చామని వెల్లడించారు. రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లుల గురించి చర్చించేందుకు 10 రోజుల క్రితమే ఆమె అపాయింట్‌మెంట్ కోరామనీ, కానీ, ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. మేం అపాయింట్‌మెంట్ అడిగిన తరువాతనే వీరిద్దరు రాష్ట్రపతిని కలిశారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ దొరకకపోవడం విచారకరమని పేర్కొన్నారు.

## రిజర్వేషన్లపై ఎంత వరకైనా సరే..: మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం

(మొదటి పేజీ తరువాయి)

శంకించలేరని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వపరంగా అన్ని విధాలా ప్రక్రియ పూర్తి చేశామనీ, ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల అంశం కేంద్రం పరిధిలో ఉందన్నారు. ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌజ్, హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు పెద్ద తేడా ఏమీ లేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను ఓడించి ఫామ్ హౌజ్‌కు పరిమితం చేయడమే ప్రజలు వేసిన పెద్ద శిక్ష అనీ, తాను కొత్తగా జైల్లో వేయాల్సిన అవసరం లేదన్నారు. తనకు విద్వేష పూరిత రాజకీయాలు చేయడం రాదనీ, బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న ఎవరికీ నైతిక విలువలు లేవని విమర్శించారు. బీహార్ ఎన్నికలతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరిగే అవకాశం ఉందనీ పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లను ఆపామని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తాత్కాలికంగా సంబురపడొచ్చు. కానీ, ఏ సమస్య అయినా దీర్ఘకాలికంగా సాగదీస్తే అది మిమ్మల్నే బలి తీసుకుంటుందని.. ఇప్పటికైనా తక్షణమే బీసీ రిజర్వేషన్ల బిల్లులను, ఆర్డినెన్స్‌ను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్‌ది శిఖండి పాత్ర

(మొదటి పేజీ తరువాయి)



రిజర్వేషన్ల అంశంలో బీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషిస్తున్నదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఎలాగైనా కాంగ్రెస్‌ను దెబ్బతీయాలన్న లక్ష్యంతో బీజేపీతో అంటకాగుతున్నారని పేర్కొన్నారు. ఢిల్లీలో గురువారం సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను బీసీ ద్రోహులుగా తెలంగాణ సమాజం భావిస్తోందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు నిర్ణయాలను ప్రశ్నించేలా కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణ తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఏ సమస్యనైనా దీర్ఘకాలికంగా సాగదీస్తే ది మిమ్మల్నే బలి తీసుకుంటుందన్న విషయం గ్రహించాలనీ, తక్షణమే బీసీ బిల్లును కేంద్రం ఆమోదించాలని డిమాండ్ చేశారు. బలహీనవర్గాల హక్కులను కాలరాయడానికి బీజేపీ మొదటి నుంచీ ఇప్పటి వరకు కుట్రలు చేస్తూ వస్తోందనీ, మండల కమిషన్ ద్వారా బీసీలకు న్యాయం చేయాలనుకుంటే కమండల్ కమిషన్‌ను తీసుకొచ్చిందని గుర్తు చేశారు. రథయాత్ర పేరుతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు సృష్టించి ఆనాటి మండల్ కమిషన్ అమలును బీజేపీ అడ్డుకుందని ఆరోపించారు. ఆ తరువాత మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఐఐటీ, ఐఐఎం, సెంట్రల్ యూనివర్సిటీలో బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయం తీసుకుంటే యూత్ ఫర్ ఈక్వాలిటీ పేరుతో బీజేపీ వాటిని కూడా అడ్డుకుందని విమర్శించారు. కానీ, మన్మోహన్‌సింగ్, సోనియా గాంధీ ఆ రిజర్వేషన్ల అమలు చేశారని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారంటూ బీజేపీ వితండవాదం చేస్తోందనీ, మేం పంపించిన బిల్లుల్లో ఏదైనా మతానికో, కులానికో రిజర్వేషన్ ఉందా అని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు.

# అణు దాడిని స్మరించుకున్న జపాన్

**టోక్యో, ఆగస్టు 7:** హిరోషిమా నగరంపై అమెరికా అణుదాడి చేసి 8 దశాబ్దాలు అయిన సందర్భంగా జపాన్ ఆ విషాదాన్ని స్మరించుకుంది. ఆ దేశ ప్రధాని షిగేరు ఇషిబా అణు విధ్వంస స్మారకం వద్ద పుష్పమాల ఉంచి, ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. 1945, ఆగస్టు 6న జపాన్ లోని హిరోషిమా నగరంపై అమెరికా తొలి అణ్వాయుధాన్ని ప్రయోగించి 1.4 లక్షల మందిని హతమార్చింది. ఆగస్టు 8న నాగసాకి నగరంపై జరిగిన అణుబాంబు దాడిలో మరో 70 వేల మంది మరణించారు. ఈ దాడుల పర్యవసానంగా జపాన్ 1945 ఆగస్టు 15న అమెరికా కూటమికి లొంగిపోవడంతో రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది.

# మా బ్యూరోక్రాట్లు విదేశాలకు పరారైతున్నరు

(మొదటి పేజీ తరువాయి)

అవినీతిని రక్షణ మంత్రి ఉదహరించారు. ఆ అధికారి కుమార్తె వివాహ రిసెప్షన్లో రూ.4 బిలియన్ల విలువైన బహుమతులు అందుకున్నాడని, అదంతా అవినీతి డబ్బేనని ఆరోపించారు. ఇలాంటి అధికారులు చర్యలు తీవ్ర అవమానకరమని, దేశాన్ని కలుషితం చేస్తున్నారని వాపోయారు. బ్యూరోక్రాట్లు చేసిన పనులకు నాయకులు నిందలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకమంది నేతలకు ఇళ్లు లేదా విదేశీ పౌరసత్వం లేదన్నారు. వాళ్లు ప్రజలను ఎదుర్కొని, ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉంటుందన్నారు. బ్యూరోక్రసీ దేశాన్ని కలుషితం చేస్తోందన్నారు.

# ఎల్ఐసీ లాభం రూ.10,987 కోట్లు

**ఢిల్లీ, ఆగస్టు 7:** భారత ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 5 శాతం వృద్ధితో రూ.10,987 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. సమీక్షా త్రైమాసికంలో నికర ప్రీమియంల ఆదాయం 5 శాతం వృద్ధితో రూ.1.19 లక్షల కోట్లుగా నమోదైంది. వ్యక్తిగత, బిజినెస్ ప్రీమియంల పెరుగుదల కారణంగా ప్రీమియం వసూళ్లు పెరిగాయి.

ఐఆర్డీఏఐ డేటా ప్రకారం.. తొలి ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసీ 63.51 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. సమీక్షా త్రైమాసికంలో వ్యక్తిగత ప్రీమియం ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.71,474 కోట్లుగా నమోదైంది. గ్రూప్ ప్రీమియం ఆదాయం 2.46 శాతం పెరిగి రూ.47,726 కోట్లుగా నమోదైనట్లు ఎల్ఐసీ తన రెగ్యులేటరీ ఫైలింగ్లో పేర్కొంది. క్యూ1లో కొత్త పాలసీల విక్రయాలు గతేడాదితో పోలిస్తే 14.75 శాతం క్షీణించాయి. ఈసారి 30.39 లక్షల పాలసీలను విక్రయించింది.

# ఒక్క నియోజకవర్గంలోనే లక్ష నకిలీ ఓట్లు

**ఢిల్లీ, ఆగస్టు 7:** భారత ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అనేక రాష్ట్రాల ఓటర్ల జాబితాలో నకిలీ వ్యక్తుల పేర్లున్నాయని ఆరోపించారు. ఎగ్జిట్ పోల్స్, ఒపీనియన్ పోల్స్ కు వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలొస్తున్నాయని, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఫలితాలు తమ అనుమానాలకు బలం చేకూర్చాయని చెప్పారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపించిన ఆయన.. ఇందుకు సంబంధించి మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. 'మహారాష్ట్రలో ఐదు నెలల్లోనే 40 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారు. ఐదేళ్లలో నమోదైన వారి కంటే.. ఐదు నెలల్లో నమోదైన ఓటర్లే




ఎక్కువ. మహారాష్ట్రలో లోక్ సభ, విధానసభ ఎన్నికల మధ్య సమయంలో కోటి మంది ఓటర్లు నమోదయ్యారు. ఓటర్ల జాబితా మాకు ఇచ్చేందుకు ఈసీ నిరాకరించింది. అది దేశ సంపద.. దానిని ఎందుకు చూపించట్లేదు'' అని రాహుల్ ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న తమ అనుమానం మహారాష్ట్ర ఫలితాలతో నిజమైందన్నారు. మెషిన్ రీడ్ చేయగల ఓటరు లిస్టును ఎన్నికల సంఘం ఇవ్వకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందన్నారు. అటు కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 6.5లక్షల ఓట్లకు గాను లక్ష ఓట్లు నకిలీవి, తప్పుడు చిరునామావేనని తమ పరిశోధనలో తేలిందని చెప్పారు. బెంగళూరు సెంట్రల్ లోక్సభ, మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ల జాబితాను విశ్లేషించామని రాహుల్ గాంధీ వెల్లడించారు. ''ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో 11,965 డూప్లికేట్ ఓటర్లు, 40,009 నకిలీ, తప్పుడు చిరునామా, 10,452 బల్క్ లేదా సింగిల్ అడ్రస్, 4132 తప్పుడు ఫొటోలు ఉన్న ఓటర్లు, మరో 33,692 ఓటర్లు ఫారం-6 దుర్వినియోగం చేశారు'' అని రాహుల్ గాంధీ ఆరోపించారు.



## తెలంగాణకు విద్యా సేవలందిస్తం

### సీఎం రేవంత్ రెడ్డితో అమిటి యూనివర్సిటీ ఛాన్స్‌లర్ భేటీ

### స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగస్వాములవుతామని వెల్లడి

**ఢిల్లీ, ఆగస్టు 7:** తెలంగాణ విద్యా రంగాభివృద్ధికి తమ వంతుగా సేవలందిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి అమిటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ అతుల్ చౌహాన్ తెలిపారు. ఢిల్లీలోని గురువారం సీఎంను కలిసిన ఆయన తెలంగాణలో తమ యూనివర్సిటీ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో తాము ఒప్పందం చేసుకుంటామని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని చౌహాన్ సీఎంకు తెలియజేశారు. కార్యక్రమంలో అమిటీ యూనివర్సిటీ ప్రతినిధి రామచంద్రం పాల్గొన్నారు.

# 20వేల డాలర్లకో గ్రీన్ కార్డ్

(మొదటి పేజీ తరువాయి)

నలుగుతోన్న సమస్యకు పరిష్కారం చూపేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టాం'' అని చట్టసభ సభ్యురాలు మారియా ఎల్విరా సలజార్ పేర్కొన్నారు.ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం అమెరికా ఏటా.. 2,26,000 ఫ్యామిలీ ప్రిఫరెన్స్, 1,40,000 ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డులను జారీ చేసేందుకు వీలుంటుంది. ఈ 20వేల డాలర్ల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీ ద్వారా గ్రీన్ కార్డ్ బ్యాక్లాగ్లను క్లియర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపాధి కోసం అగ్రరాజ్యానికి వెళ్లి అక్కడే శాశ్వతంగా స్థిరపడాలనుకునే వలసదారులకు అమెరికా పర్మినెంట్ రెసిడెంట్ కార్డ్ (గ్రీన్ కార్డు)లను ఇస్తుంటుంది. అయితే, ఒక్కో దేశానికి నిర్ణీత సంఖ్య (కోటా)లో మాత్రమే వీటిని జారీ చేస్తుంటారు. మొత్తం దరఖాస్తుల్లో ఒక్కో దేశానికి కేవలం 7% మాత్రమే కేటాయించాలన్నది ప్రస్తుత విధానం. అయితే ఈ బిల్లులో దానిని 15 శాతానికి పెంచారు. అలాగే అమెరికాకు వర్క్ పర్మిట్ పై వచ్చిన దంపతుల పిల్లలు (డ్రీమర్ల)కు శాశ్వత నివాస హోదా పొందడానికి ఈ ప్రతిపాదిత బిల్లు వీలు కల్పిస్తుంది.

# కోర్టుల్లో పెండింగ్ కేసుల తగ్గింపునకు కార్యాచరణను సిద్ధం చేయండి

**హైదరాబాద్, ఆగస్టు 7:** అత్యధునాతన సాంకేతికతను ఉపయోగించి రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను తగ్గించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో సమీక్షా సమావేశంలో సీఎస్ మాట్లాడుతూ.. కోర్టులలో కేసుల పెండింగ్ తగ్గించడంతో పాటు డిజిటల్ రికార్డుల నిర్వహణ, సీసీఎంఎస్ ద్వారా కోర్టు కేసుల పురోగతిని నిరంతరం మానిటరింగ్ చేయడం, సమాచార వ్యవస్థలో పారదర్శకతను పాటించడం, కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవడంతో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆస్కారముంటుందని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టుతో పాటు బీహార్, తమిళనాడు, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాలో అమల్లో ఉన్న మానిటరింగ్ వ్యవస్థను అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేసేందుకు తగు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కూడా ఆయన ఆదేశించారు.

# 2047 లక్ష్యాలకు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

వాటా 17 శాతం. భారత్ ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్ వల్ల జీడీపీపై 50 బేసిస్ పాయింట్ల ప్రభావం పడే అవకాశం ఉంది. జీడీపీ వృద్ధి రేటు 50 బేసిస్ పాయింట్ల మేర నెమ్మదించి 6 లేదా 6.1 శాతంగా నమోదు కావొచ్చు. అయితే, వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ కావడం వల్ల 50 బేసిస్ పాయింట్లను కోల్పోవడం అనేది పెద్ద లెక్క కాదు. ఏడాది పాటు ఈ భారాన్ని భారత్ మోయగలదు. ఏడాదికి మించితే మాత్రం 50 బేసిస్ పాయింట్ల భారం అనేది భారత లక్ష్యాలపై ప్రభావం చూపుతుంది. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలవాలన్న వికసిత భారత్ లక్ష్యాలకు ఇది ఆటంకంగా మారొచ్చు'' అని వివరించారు. ఈ సుంకాల వల్ల చిన్న ఆదాయ వర్గాలపై ఎక్కువ ప్రభావం ఉంటుందన్నారు. అదే సమయంలో రష్యా నుంచి కాకుండా సౌదీ అరేబియా వంటి దేశాల నుంచి చమురు కొనుగోళ్లు జరిపితే ద్రవ్యోల్బణం పెరుగుతుందని, దీనివల్ల తక్కువ ఆదాయం గల కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. తద్వారా మొత్తం ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందన్నారు. మరోవైపు అమెరికాతో వాణిజ్యం విషయంలో మున్ముందు ఏం జరుగుతుందనే దానితో సంబంధం లేకుండా వివిధ దేశాలకు మన ఎగుమతులను పెంచుకోవాల్సిన అవసరం ఉందని దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. మరిన్ని దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాల్సి ఉందని, దేశంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

# నేడు సిట్ విచారణకు బండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ భేటీకి హాజరు కావడం గమనార్హం. ఈ అధికారులలో ఎస్ఐబీ, సిట్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలలో పని చేసిన అధికారులతో సంజయ్ ప్రత్యేకంగా చర్చించారు. కేసీఆర్ ప్రభుత్వం బండి సంజయ్ ఫోన్‌ను ఎక్కువ సార్లు ట్యాప్ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. వాటికి సంబంధించి సేకరించిన ఆధారాలను కేంద్ర నిఘా వర్గాలు సంజయ్ ముందుంచాయి. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని బీజేపీ జాతీయ అంశంగా పరిగణిస్తున్న నేపథ్యంలో సిట్ అధికారుల ఎదుట హాజరవుతున్న తొలి కేంద్ర మంత్రి బండి సంజయ్ కావడం విశేషం. ఈ క్రమంలో బండి సంజయ్ శుక్రవారం సిట్‌కు సమర్పించే ఆధారాలలో ఎవరిని టార్గెట్‌గా చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

**ఖైరతాబాద్ ఆంజనేయ స్వామికి పూజలు.. అక్కడ్నుంచే సిట్ వద్దకు..**

శుక్రవారం సిట్ విచారణకు హాజరు కానున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఉదయం 10 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరి 10-30 గంటలకు ఖైరతాబాద్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం 11 గంటలకు అక్కడి నుంచి రాజ్‌భవన్ సమీపంలోని దిల్‌కుశ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు సిట్ విచారణకు హాజరవుతారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడే అవకాశం ఉందని బీజేపీ వర్గాల సమాచారం.

## జస్టిస్ వర్మకు చుక్కెదురు

**ఢిల్లీ, ఆగస్టు 7:** 'నోట్ల కట్టల' న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనపై నిర్వహించిన అంతర్గత దర్యాప్తు నివేదికను సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ను అత్యున్నత న్యాయస్థానం కొట్టేసింది. భారీ మొత్తంలో నగదు బయటపడటంతో ఆయన్ను తొలగించాలని సదరు నివేదిక సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఈ నిర్ణయంతో పార్లమెంట్లో ఆయనపై అభిశంసన చేపట్టేందుకు మార్గం సుగమమైంది. జస్టిస్ వర్మను విధుల నుంచి తొలగించాలని నాటి సీజేఐ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి, ప్రధానికి సిఫార్స్ చేసిన విషయం తెలిసిందే. ఆయన రిట్ పిటిషనే విచారణకు అనర్హమని తేల్చింది.

# కిషన్ రెడ్డి కుట్రలు సాగనివ్వం

**ఢిల్లీ, ఆగస్టు 7:** బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధేయ పద్ధతిలో పోరాడి అనుకున్నది సాధిస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వబోమన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా గెలిచిందని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లో బీసీలు ఆ పార్టీని తిరస్కరించారని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే వచ్చే ఎన్నికల్లో దాని ఓటమి ఖాయమని పేర్కొన్నారు. 'శాసనసభలో బీసీ బిల్లుపై తీర్మానం సందర్భంలో కిషన్ రెడ్డి దానికి వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పిఉంటే ఆరోజే చర్చ జరిగేది. కానీ, ఆ బిల్లు చట్టం రూపంలో మారి గవర్నర్ ఆమోదంతో



ఢిల్లీకి వచ్చిన తర్వాత ముస్లింల పేరుతో అడ్డుకోవడం సరికాదు. మిమ్మల్ని బహిరంగ చర్చకు కూడా ఆహ్వానించదల్చుకున్నా. మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. కామారెడ్డి డిక్లరేషన్ నుంచి జంతర్ మంతర్ ధర్నా వరకు మేం బాధ్యతగా ఉన్నాం'' అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# బీసీ బిల్లు ఆమోదింపజేసే బాధ్యత నేను తీసుకుంట

**హైదరాబాద్,ఆగస్టు 07, (మనం బ్యూరో):** గతంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. మజ్లిస్ కనుసైగలతో కేసీఆర్ ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చారు అలాంటప్పుడు ఇప్పుడెలా 10 శాతం రిజర్వేషన్లు ఇస్తారని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. అసలు ముస్లింలకు రిజర్వేషన్లు ఎలా ఇస్తారు ? వారికి పది శాతం రిజర్వేషన్లు తీసేస్తే బీసీల రిజర్వేషన్ల బిల్లును కేంద్రంతో ఆమోదింపజేసే బాధ్యత నేను తీసుకుంటానని స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు వెన్నుపోటు పొడవడంలో తెలంగాణ రోల్ మోడల్. బీసీలను మోసం చేయడంలో, అక్రమాలు చేయడంలో మేము నిరక్షరాస్యులం. కేసీఆర్ వల్ల జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నాన్ బీసీలు మాత్రమే గెలిచారు. కాంగ్రెస్ తెచ్చిన బిల్లుతో బీసీలకు కేవలం 32 శాతం రిజర్వేషన్లు మాత్రమే దక్కుతాయి. ఇది బీసీలను మోసం చేయడమే. రాజ్యాంగ సమస్యల వల్లే గవర్నర్ రాష్ట్రపతికి బీసీ బిల్లు పంపారని వ్యాఖ్యానించారు. రాష్ట్రపతి ముర్ముపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ మంత్రి వ్యాఖ్యలు సిగ్గుచేటు. దీనిపై సోనియా గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన స్థాయికి మించి మాట్లాడుతున్నారు. ప్రధాన మంత్రిని లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అంటారా? రేపు లంబాడాలను కన్వర్టెడ్ ఎస్టీ అంటారా? మజ్లిస్ కనుసన్నల్లో కాంగ్రెస్ పని చేస్తోంది. ఇదిలాగే, కొనసాగితే ఒవైసీ కుటుంబానికే ముఖ్యమంత్రి పదవి ఇస్తారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్ ఓటమి ఖాయమని వ్యాఖ్యానించారు. బీసీ కోటాలో ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఎలా అంటారు ? ఒవైసీ, అజారుద్దీన్, షబ్బీర్ అలీ కూడా బీసీలేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్లలో నుంచి ముస్లింలను తొలగిస్తే బిల్లును ఆమోదించేలా ప్రధాని మోడీ, హోం శాఖ మంత్రి అమిత్ షాతో మాట్లాడతానని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## భారత్‌కు రానున్న పుతిన్

(మొదటి పేజీ తరువాయి)

డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన వేళ ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది చివర్లో పుతిన్ భారత్‌కు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దండయాత్ర అనంతరం ఆయన భారత్ కు రావడం ఇదే మొదటిసారి అవుతుంది.

# చేనేత కార్మికుల సంక్షేమంలో మనమే టాప్

(మొదటి పేజీ తరువాయి)

చేసిన వస్త్ర ఎగ్జిబిషన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమం, అభివద్ధిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని, అదేవిధంగా జియో ట్యాగింగ్ లో కూడా మనమే ముందున్నామన్నారు. చేనేత అనేది కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదు అని, భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. ఇది తరతరాలుగా వారసత్వంగా అందిన హస్తకళ. ఈ కళను పరిరక్షించడం మనందరి బాధ్యత అన్నారు. చేనేత ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారానే వస్త్రాలను కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తూ చేనేత కళను కొత్త తరం వరకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా త్రిలింగ పట్టు చీరలను, లోగోను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీమతి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వం చేనేత కార్మికుల అభివద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. అందులో భాగంగా రెండు సంవత్సరాల కాల వ్యవధితో నేతన్న పొదుపు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. నేతన్నకు భద్రత పథకం ద్వారా మరణించిన కుటుంబ నామినికి 5 లక్షలు అందజేస్తున్నామన్నారు. మార్చి నెలలో ముఖ్యమంత్రి ప్రకటించిన చేనేత రుణమాఫీ కోసం 33 కోట్లు విడుదల చేశామన్నారు. చేనేత కార్మికులకు సంవత్సరానికి 18 వేలు, అనుబంధ కార్మికులకు 6 వేలు వచ్చేలా నేతన్న భరోసా పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.

# వర్షబంధంలో హైదరాబాద్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** హైదరాబాద్‌లో ఇవాళ ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఎక్కడికక్కడ వాహనాలు ఆగిన క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, ఎల్బీనగర్, నాగోల్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్ మెట్ వంటి ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది. ఇక పంజాగుట్ట, ఐకియా, దిల్ సుఖ్ నగర్, మలక్ పేట్, అత్తాపూర్ ప్రాంతాల్లో వర్ష బీభత్సం కారణంగా ట్రాఫిక్ చాలా నెమ్మదిగా సాగింది. పాతబస్తీలోని సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, సికింద్రాబాద్, కంటోన్మెంట్ లోని లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే తెలంగాణలోని హైదరాబాద్‌లో 'క్లౌడ్ బరస్ట్' ఏర్పడినట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో మరో గంటలో 80 నుంచి 100 ఎంఎం ల భారీ వర్షంతో పాటు వరదలు నమోదు అవుతాయని పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన భీకర వర్షం నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆకస్మిక వర్షాలకు హైదరాబాద్ చుట్టుపక్కల చెరువులు పూర్తిగా నిండిపోయిన నేపథ్యంలో వరదలు వ్యాపించే ప్రమాదం ఉందని అంచనా వేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు.మరోవైపు సీఎస్, డీజీపీ, హైడ్రా కమిషనర్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ చేశారు. భారీ వర్ష సూచనపై ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు సీఎం రేవంత్.

# ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలె

(మొదటి పేజీ తరువాయి)

ఆకస్మికంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల అప్రమత్తంగా ఉండి ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాలలో 12 సెంటిమీటర్ల వరకు వర్ష పాతం రికార్డ్ అయిందని.. వర్షం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, నీటి నిలిచే ప్రాంతాల (వాటర్ లాగింగ్ పాయింట్స్)పై ప్రత్యేక దష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాటర్ లాగింగ్ రిపోర్ట్ అవుతున్న ఐటీ కారిడార్, టీవీ-9, టైమ్స్ ఆఫ్ ఇండియా, రాజ్ భవన్, షేక్ పేట్ ఏరియాలలో నీటి నిలువ సమస్య వస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల వల్ల ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజలు డ్రైనేజ్ నాలాలు మూతలు ఎట్టి పరిస్థితుల్లో తొలగించవద్దని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని తెలిపారు. క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని సూచించారు. దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు, విద్యుత్ లైన్లనుయుద్ధ ప్రాతిపదికగా పునరుద్ధరించాలని ఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ కు చెందిన బందాలన్నీ తగు ఎక్విప్మెంట్ తో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అత్యవసర పరిస్థితుల్లో జీహెచ్ఎంసీ, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టరేట్ కంట్రోల్ రూంలకు, హైడ్రా కంట్రోల్ రూమ్ లతోపాటు, డయల్ 100 ,116 లకు ఫోన్ చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి దంపతుల కూతురు వివాహం గురువారం రాత్రి సంగారెడ్డిలో అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రులు సీతక్క, ఉత్తమ్, తుమ్మల, పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులు జయారెడ్డి, గుణ చైతన్యరెడ్డిలను ఆశీర్వదించారు.



# విజయ డైరీ రైతులను ప్రోత్సహిస్తాం

- విజయ డైరీ జిల్లా డిప్యూటీ డైరక్టర్ మోహన్ మురళి

**కడ్తాల్, ఆగస్టు 7(మనం, న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరిచినట్లుగానే దానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమ అభివృద్ధి పట్ల కూడా ప్రత్యేక చొరవ చూపుతుందని, వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందించే లక్ష్యంతో విజయ డెయిరీ ముందుకు సాగుతున్నదని విజయ డైరీ డిప్యూటీ డైరక్టర్ మోహన్ మురళి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్, మక్తమాధారం, చల్లంపల్లి, అమనగల్ లో అయన పాలసేకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాడి రైతుల సమస్యలు, తదితర విషయాలను మాట్లాడారు. పాల నాణ్యతను బట్టి గిట్టుబాటు ధర అందిస్తామని తెలిపారు. గేదెల పెంపకం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చేందుకు చిన్న, సన్నకారు రైతులు ఎక్కువ ఆసక్తి చూపలన్నారు. పాడి రైతులు బిల్లులు ఆలస్యం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# కూలిన నాలా.. నివాసితులకు ఇబ్బందులు

- పట్టించుకోని అధికారులు



**రంగారెడ్డి, ఆగస్టు 7(మనం న్యూస్):** కూలిన నాలా తో నివాసులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. సమస్య పరిష్కరించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సమాచారం ఇస్తే దురుసుగా వ్యవహ రిస్తున్నారని ఇంటి యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. గత 15 రోజులుగా ఇంట్లోకి వెళ్లలేని దుర్భర పరిస్థితి నెలకొంది. కొత్తపేట డివిజన్ బృందావన కాలనీ రోడ్ నం.1లో నివాసం ఉంటు న్న ఎన్.తులసీరామ్ నివాసం ముందు ఉన్న నాలా స్లాబ్ భారీగా కురిసిన వర్షాలతో పూర్తిగా కూలిపో యింది. అదృష్టవశాత్తు ఇంటి వద్ద ఎవరు లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్లాబ్ కూలిన సమయంలో ఎవరైనా అక్కడ ఉంటే నాలా లో కొట్టుకుపోయే ప్రమాదం ఉండేది. నాలాపై ఉన్న ర్యాంపు పూర్తిగా కూలిపోవడంతో తులసీరా మ్ కుటుంబ సభ్యులు ఇంట్లోకి వెళ్లలేని దుర్భర పరిస్థితిలో నెలకొన్నాయి. గత 15 రోజులుగా నిర్మా ణం పనులు చేపట్టకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు బయటనే ఉంటున్నారు. గృహప్రవేశం చేసిన మూడు నెలలకే ఈ సంఘటన జరిగింది. నాలాపై ర్యాంపు కూలిపోయిన విషయం స్థానిక కార్పొరేటర్, అధికారులకు సమాచారం ఇవ్వగా వారు పరిశీలించి కొద్ది రోజులకు పనులు ప్రారంభించారు. అయితే నాణ్యత ప్రమాణాలు పాటించకుండా అసంపూర్తిగా పనులు చేపడుతున్నడంతో భవిష్యత్తులో మళ్లీ నాలాపై ర్యాంపు కూలిపోయే ప్రమాదం ఉందని ఇంటి యజమాని ఆందోళన చెందుతున్నాడు. నాలాపై నిర్మించిన స్లాబ్ కు స్టీల్ (ఇనుప సువ్వలు) వాడకపోవడం వల్ల అది పూర్తిగా కూలిపోయింది. ఇంజనీరింగ్ విభాగం అధికారు లు అసంపూర్తిగా నిర్మాణం పనులు చేపడుతుండ టంతో పనులు పూర్తయిన అనంతరం ఇంట్లోకి వెళ్లడానికి కూడా భయంగా ఉందని యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం పనులు పటి ష్టంగా చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగానికి చెందిన వెంకటేశ్వర్లకు చెబితే ఎలా నిర్మించాలో మాకు తెలుసని నీ సలహాలు అవసరం లేదంటూ దురుసు గా మాట్లాడుతున్నాడని అధికారుల తీరుపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. స్లాబ్ కూలి పెను ప్రమాదం తప్పితే ఆ స్థానంలో పటిష్ట నిర్మాణం జరపాల్సిన ఇంజనీరింగ్ విభాగం అధికారులు మొక్కుబడిగా పనులు చేపట్టి చేతులు దులుపుకునే విధంగా వ్యవహరించడం పలు విమర్శలకు దారి తీస్తోంది. స్లాబ్ కోసం నిర్మించే గోడ నిర్మాణం విస్తీర్ణం తగ్గించడం వల్ల మళ్లీ కూలిపోయే ప్రమాదం ఉందని నిర్మాణం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పటిష్టంగా నిర్మించే విధంగా ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై జీహెచ్ ఎంసీ అధికారులు స్పందించి అసంపూర్తిగా జరుగుతున్న నిర్మాణాన్ని పరిశీలించి భవిష్యత్తులో ఇబ్బంది జరగకుండా పటిష్టంగా నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# అనిల్ శాస్త్రికి ఉప్పల సన్మానం



**రంగారెడ్డి ఆగస్టు 7 (మనం న్యూస్)** మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి తనయుడు ఏఐసిసి మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్రమంత్రి అనిల్ శాస్త్రిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి , మాజీ పర్యాటకశాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఢిల్లీలో ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి, కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండ్రి బాటలో నడుస్తూ అనిల్ శాస్త్రి కూడా దేశానికి కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవలు అందించారని తెలిపారు.

# సీఐటీయూ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం



- కార్మికులందరికీ రూ.6000/-ల పెన్షన్ అమలు చేయాలి

**సిరిసిల్ల టౌన్, ఆగస్టు 07(మనం న్యూస్):** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పాత బస్టాండులోని నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి వర్కర్ టూ ఓనర్, త్రిఫ్ట్, ఇతర డిమాండ్లను పరిష్కరించాలని ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం , అధికారులు చేనేత దినోత్సవం రోజున సంబరాలు జరుపుకోవడానికి పరిమితం కాకుండా చేనేత , పవర్లూమ్ కార్మికుల సంక్షేమానికి వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వర్కర్ టూ ఓనర్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే పూర్తి చేసి కార్మికులకు అందించాలని , త్రిఫ్ట్ నేతన్న పొదుపు పథకానికి సంబంధించిన డబ్బులను వెంటనే కార్మికుల ఖాతాలలో జమ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ , వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సిరిమల్ల సత్యం , ఉడుత రవి, సూరం పద్మ , దాసరి రూప , జిందం కమలాకర్, బెజుగం సురేష్ , బాస శ్రీధర్ , స్వర్గం శేఖర్, బింగి సంపత్ , కారంపురి మహేష్ , చింత కింది సుధన్ , దోమల రాము , సందుపట్ల పోచమల్లు , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ సిద్ధం




- క్యాడర్‌లో జోష్ నింపుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల
- ప్రజలే నా బలం నా బలగం

**సైదాపూర్, ఆగస్టు 7(మనం న్యూస్):** ఏ సమస్య వచ్చినా నాకు ఒక ఫోన్ కాల్ చేయండి, మీకు అండగా వుంటాను సైదాపూర్ మండలం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమీక్షా సమావేశం. హుస్నాబాద్ నియోజకవర్గం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమీక్షా సమావేషానికి ముఖ్య అతిథిగా హాజరైన హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మన పార్టీ విజయం దిశగా అందరు పని చేయాలి.గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరవేయాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది. ఈ మోసపూరిత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చుకోలేక మొత్తం ఫెయిల్ అయ్యింది. మనం చేసిన అభివృద్ధిని ప్రజల వద్దకి తీసుకెళ్లి వారికీ నిజాలు తెలియజేసే బాధ్యత ప్రతీ ఒక్కరు తీసుకోవాలి కష్టపడే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుంది. రైతులకు సాగునీరు అందించి వారి కుటుంబాల్లో సంతోషాన్ని నింపింది కేసీఆర్, అయితే, కనీసం రైతులకు సాగునీరందియ్యక పంట పోలాలు ఎండి పోతున్నా పంటించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారాబుడ్ల ప్రభాకర్ రెడ్డి, పాక్స్ చైర్మన్ బిల్లా వెంకట్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, సర్పంచులు మాజీ ఎంపీటీసీలు మాజీ వార్డ్ మెంబర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీపీఐ రాష్ట్ర 4వ మహా సభలను

# విజయవంతం చేయాలి

- సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి



**చేవెళ్ల, ఆగస్టు 7(మనం న్యూస్):** భారత కమ్యూనిటీ పార్టీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ఈ నెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో జరుగుతున్న ఈ మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. సీపీఐ పార్టీ రాష్ట్ర మహాసభలలో ప్రజా సమస్యలు, రాజకీయ సమస్యలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలపై సమగ్రంగా చర్చ చేసి విధి విధానాలను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఆపరేషన్ ఖగార్ తో మావోయిస్టులను మొత్తం తుద ముట్టించడానికి కుట్ర చేస్తుందని , 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేని భారతదేశాన్ని చూస్తారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటనలు చేయడం బాధాకరమని ఆయన విమర్శించారు. ఈ మహా సభలకు రంగారెడ్డి నుండి పార్టీ శ్రేణులు కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. ప్రభు లింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎం.సుధాకర్ గౌడ్, గీత పనివాళ్ల సంఘం మండల కార్యదర్శి కృష్ణా గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల తదితరులు పాల్గొన్నారు.

# దళారీ వ్యవస్థను కట్టడి చేసి రేషన్ కార్డులను పంపిణీ చేయాలి



**రంగారెడ్డి ఆగస్టు 7(మనం న్యూస్):** సరూర్ నగర్ డివిజన్లో అసలైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు వచ్చేంతవరకు తాను మౌనంగా ఉండనని దళారీ వ్యవస్థను కట్టడి చేసి రేషన్ కార్డులను పంపిణీ చేయాలని సరూర్నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ అన్నారు. అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ పుల్లయ్యను గురువారం కలిసి డివిజన్ ఎన్ని మంజూరయ్యాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీ ప్రజలకు ఒక ప్రయాసగా మారిందని, పైస లేనిది పనిచేస్తలేరన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రేషన్ కార్డుల మంజూరు పూర్తిగా దళార్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ యంత్రాంగం చేతులెత్తేసినట్లే కనిపిస్తోంది. ప్రత్యేకించి ఒక వర్గానికి మాత్రమే రెడ్ కార్పెట్ వేసినట్టు, మరొక వర్గం అసలైన లబ్ధిదారులు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతటి సంక్షేమ పథకాన్ని కూడా ఓటు బ్యాంక్ రాజకీయానికి తాకట్టు పెట్టడం దురదృష్టకరం. అదనంగా కనీసం ఫుడ్ సప్లై ఆఫీసర్ల వద్ద ఒక డివిజన్ నుంచి ఎంతమంది అప్లై చేశారు? ఎన్ని మంజూరయ్యాయి? తిరస్కరించబడ్డాయి? వాటి కారణాలేంటి? అనే సమాచారం ప్రజలకు అందుబాటులో లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది.

# వడ్డెర కులస్తుల హామీలను అమలు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి
- తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు వరికుప్పల శ్రీశైలం



**తుర్క యంజాల్, ఆగస్టు 7(మనం న్యూస్):** తెలంగాణ వడ్డెర సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దండుగుల వెంకటరమణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల శ్రీశైలం, మరియు రాష్ట్ర కార్మిక శాఖ ఉపాధ్యక్షుడు బోదాస్ నరసింహ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ, తుర్క యంజాల్ మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన సమావేశం వర్షాకాలంలో బడ్జెట్ సమావేశనికి వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరికుప్పల శ్రీశైలం అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నేటికీ 77 ఏళ్లు గడిచిన వడ్డెర సంఘం కులస్తుల బతుకులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల హామీలలో భాగంగా వివిధ సభలో మరియు సమావేశంలో రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డెరలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అదే విధంగా క్వారీలు, గుట్టలపై వడ్డెర సంఘం కులాలకు పూర్తి హక్కులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వడ్డెర కులాలకు 15 శాతం కాంట్రాక్టు పనులలో రిజర్వేషన్లు ఉండేది 2014లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేసీఆర్ మూడు శాతానికి పరిమితం చేశాడని గత సాధారణ ఎన్నికల్లో వడ్డెరలకు కాంట్రాక్టు పనులలో రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం వెంటనే వడ్డెరలకు 50 శాతం కాంట్రాక్టు పనులలో రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ వడ్డెర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభుత్వాన్ని కోరారు. వడ్డెరలకు క్వారీలపై, గుట్టలపై హక్కులు పూర్తిగా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్ళిపోయాయని, దీంతో వడ్డెరల జీవితాలు నాశనమై పోతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఈ దిశగా అలోచించి నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే 50 ఏళ్లు నిండిన ప్రతి వడ్డెర సంఘం కులస్తులకు పెన్షన్ ప్రభుత్వం ఇవ్వాలని తెలియజేశారు. వీలైనంత త్వరగా వడ్డెర ఫెడరేషన్‌కు చైర్మన్ నియమించి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వడ్డెర సొసైటీలకు లోన్లు ఇవ్వాలన్నారు. కాంట్రాక్టుల్లోనూ 30 శాతం పనులు ఇచ్చి కేటాయించి, రూ. 5 కోట్ల వరకు ఎలాంటి ఈఎండీ లేకుండా పనులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పని చేస్తున్న సమయంలో అనేక మంది ప్రమాదా లకు గురై కాళ్లు, చేతులు కోల్పోయి వికలాంగులుగా మారుతున్నారని, కొంత మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ప్రభుత్వం ఈ కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. చనిపోయిన వడ్డెర కులాలకు రూ.20 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వడ్డెర కులాలకు బీమా సౌకర్యం కల్పించాలని, తెలంగాణ రాష్ట్రంలో వడ్డెర కార్మికులు దాదాపు ఆరు లక్షల మంది ఉన్నారని తెలియజేశారు. వడ్డెర కులస్తులు పని చేస్తున్న వృత్తిలో ప్రాణాలు కోల్పోతున్న వారికి ప్రభుత్వం వెంటనే 10 లక్షల ప్రమాద బీమాను అమలు చేయాలని కోరారు. వడ్డెర కుల వృత్తి ఉపాధి కొరకై ఆధునిక పనిముట్లును 90 శాంతం సబ్సిడీతో ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దండుగుల వెంకటరమణ, గండికోట రాజు, గండికోట శ్రీనివాస్, పందిరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ స్వామి ఆలయంలో సంప్రోక్షణ



**రంగారెడ్డి ఆగస్టు 7(మనం న్యూస్):** గడ్డి అన్నవర క్షేత్రంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణస్వామి వారి దేవాలయంలో గురువారం సంప్రోక్షణ పవిత్రోత్సవ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం చైర్మన్ లింగారెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కోశాధికారి వక్కలంక శ్రీనివాస్ రావు, దాతలు వసంత్ మనోహర్, ఉమా దేవి, మహేందర్ రెడ్డి, పాల్థి శ్రీనివాస్, బి.సంతోష్, రమేష్ భక్తులు పాల్గొన్నారు.

## గీతలు చెరపిన సీతలు

సునామీలా చెలరేగిన కోరికలు
తాళి తెంపి చేస్తున్న వేడుకలు
నిప్పులు కక్కుతూ ఉబికి వచ్చే

లావాలా ప్రవహించే వాంఛలు
బంధాలను రక్త సంబంధాలను
సజీవ దహనం చేసే నిప్పు కణికలు

ఆస్తి పై ఆసక్తి కన్న వారినే
కడతేర్చే మానవ మృగాలకు
దయా దాక్షిణ్యాలు నాస్తి

వావి వరుసలు లేని కాంక్షలు
వయసుతో సంబంధంలేని తృష్ణలు
విహంగాలై విహరించి బరి
తెగించి తీర్చు కునే శారీరక ఆకాంక్షలు

ప్రియురాలు చేసే హత్యలతో
ప్రియుని ఘాతుకాలతో
జీవితాలు అల్లకల్లోలం

గీతలు దాటిన
సీతలు కొందరు
నుదుటి గీత గీసుకున్న
వనితలు మరికొందరు

**- పూసాల సత్యనారాయణ**
9000792400

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# అమెరికా సుంకాలు-భారత్‌ను దెబ్బతీస్తాయా?



ఒకసారి ఓడి నాలుగేళ్ళ తర్వాత తిరిగి అధికారం లోకి వచ్చి, అమెరికా శ్వేత సౌధంలోకి అడుగు పెట్టడం చాలా అరుదైన అంశం. అలాంటి అరుదైన అవకాశం దక్కిన అమెరికా అధ్యక్షుల్లో గ్రోవర్ క్లీవ్ లాండ్ ఒకరు కాగా, ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరొకరు. ట్రంప్ రెండవ సారి అధికారంలోకి రావడానికి అమెరికాలో స్థిరపడ్డ భారతీయులు కూడా తమ వంతు కృషి చేసారు. ఎన్నికల వరకు భారత్ తన మిత్ర దేశం, మోడీ తన మిత్రుడంటూ పొగిడిన ట్రంప్‌కు అధికారం రాగానే అహం నెత్తికెక్కింది. అక్రమ వలస దారులంటూ అత్యంత చులకన చేసి, కొంతమంది భారతీయులకు సంకెళ్ళు వేసి, యుద్ధ విమానాల్లో భారత్‌కు పంపించి, అత్యంత అవమానకరంగా ప్రవర్తించిన ట్రంప్ భారత్ పై ఇంకా తన అక్కసును వెళ్ళగక్కుతూ, భారత్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలని ప్రయత్నించడాన్ని ప్రపంచ దేశాలన్నీ గుర్తించాలి. అధ్యక్ష ఎన్నికల ముందు వరకు రష్యా కు అనుకూలంగా,పుతిన్‌కు రహస్య మిత్రుడిగా పేరొందిన ట్రంప్ తన అవసరం తీరగానే రష్యా పైన, రష్యాకు చిరకాల మిత్రదేశమైన భారత్ పైన అసూయతో రగిలిపోతూ,టారిఫ్‌ల రూపంలో అర్ధరహితమైన ఆంక్షలు విధించడం అనైతికం. ఏఏ దేశాలు ఎవరితో స్నేహం చేయాలో, ఎవరి వద్ద ఆయుధాలు కొనాలో నిర్ణయించడానికి అమెరికా కున్న హక్కేమిటి? అర్హతలేమిటి? ప్రపంచాన్ని శాసించమని ట్రంప్ కు ఎవరు అధికారమిచ్చారు? ఇతర దేశాలపై అమెరికా క్రర పెత్తనమేమిటి? ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాలకు అమెరికా ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయం కారణం కాదా? రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి అమెరికా నాయకత్వంలోని నాటో దేశాల నిర్వాకమే మూల కారణం. జెలెన్స్కీని రెచ్చగొట్టి, ఉక్రెయిన్ కు ఆయుధ, ఆర్థిక సహాయ మందించి, రష్యా- ఉక్రెయిన్ల మధ్య మూడున్నర సంవత్సరాలుగా యుద్ధం జరగడానికి అమెరికా అండదండలే కారణమన్న సత్యం విస్మరించగలమా?

రష్యాతో చమురు ఒప్పందం కుదుర్చుకోవడమే భారత్ చేసిన తప్పిదంగా అమెరికా భావించడం, భారత్ రష్యాతో ఆయుధ, ఇతర వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం మానుకోకపోతే అధిక టారిఫ్‌లు విధిస్తానని ప్రకటించి, అనుకున్న విధంగానే భారత్ పై రెండు విడతలుగా 50 శాతం వరకు ఆర్థిక సుంకాలు విధించడం,ఇదే సందర్భంలో తాను చిరకాల ప్రత్యర్థిగా భావించే చైనా పై కేవలం 30శాతం టారిఫ్ విధించి, టారిఫ్ అమలుకు ఎక్కువ గడువును ప్రకటించడం ట్రంప్ ద్వంద్వ ప్రమాణాలకు దర్పణం పడుతున్నది.

మిత్ర దేశమంటూనే భారత్ కు వెన్ను పోటు పొడవడం ద్వారా ప్రపంచానికి ట్రంప్ ఇచ్చే సంకేతమే మిటి? భారత్ ఆర్థికంగా బలపడకూడదనే ఏకైక లక్ష్యమే ట్రంప్ లో అగుపిస్తున్నది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ కు సంబంధం ఏమిటి? భారత్ రష్యాతో వాణిజ్య సంబంధాలు కలిగి ఉండడం వలన రష్యా ఆర్థికంగా బలపడి ఉక్రెయిన్ పై యుద్ధం చేయగలుగుతుందనే ట్రంప్ వాదన సత్య దూరం. ఉక్రెయిన్ కు అమెరికా, నాటో దేశాలు ఆయుధ సహకారం అందించకపోతే ఇన్ని సంవత్సరాలుగా ఉక్రెయిన్ రష్యాతో యుద్ధం చేయగలిగి ఉండేదా? నాటో లో చేరాలనే జెలెన్ స్కీ నిర్ణయమే పుతిన్ ఆగ్రహానికి, ఉక్రెయిన్‌తో యుద్ధానికి మూలకారణం. ఇప్పటికైనా ఉక్రెయిన్ అధ్యక్షుడు తమ దేశం నాటోలో చేరబోదనే హామీ ఇవ్వగలడా? అమెరికా అందుకు ఉక్రెయిన్ ను ఒప్పించగలదా? ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి చరమగీతం పలుకుతానని ప్రగల్భాలు పలికిన డోనాల్డ్ ట్రంప్, యుద్ధం ఆపలేక చివరికి ఉరుము రిమి మంగళం మీద పడినట్లు నెపమంతా భారత్‌పై నెట్టి, ప్రతీకార సుంకాలతో భారత్‌ను బెదిరించడం శతాబ్దాల ప్రజాస్వామ్య అమెరికా చరిత్రకు మాయని మచ్చ. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుని ట్రంప్‌కు మద్దతు నిచ్చిన రిపబ్లికన్ పార్టీ నాయకురాలు నిక్కీ హేలీ భారత్‌పై ట్రంప్ విధిస్తున్న వాణిజ్య సుంకాలను తప్పుబడుతూ, భారత్ వంటి బలమైన దేశంతో సంబంధాలను తెంపుకోరాదని సూచించడం గమనార్హం. అమెరికాలో ఇప్పటి వరకు ఎంతో మంది అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. కాని ట్రంప్ వంటి నాయకుడొస్తే ఏం జరుగుతుందో బహుశా అమెరికా ప్రజలు కూడా ఊహించి ఉండరు. ఇప్పటి వరకు తాను ఆరు యుద్ధాలను ఆపానని, తాను లేకపోతే అణ్వాయుధ యుద్ధం జరిగి ఉండేదని, భారత్- పాక్ ల మధ్య కూడా తానే మధ్యవర్తిత్వం వహించి, యుద్ధాన్ని నివారించానని ట్రంప్ పదే పదే పేర్కొనడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. నోబెల్ శాంతి బహుమతి కోసం ట్రంప్ ఇంతగా దిగజారిపోవడం సిగ్గుచేటు. ఉగ్రవాద దేశమైన పాక్ కు మద్దతు నీయడమే కాకుండా ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాక్ సైనికాధిపతి మునీర్ తో కలిసి శ్వేతసౌధంలో విందారగించడం ట్రంప్ దిగజారుడు తనానికి నిదర్శనం. అన్ని రంగాల్లోను అభివృద్ధి సాధించానని చెబుతున్న అమెరికా నేడు ఆర్థికంగా పతనమై పోయింది.ఇతర దేశాల బలహీనతలపై దెబ్బకొట్టి,కొర్రీలుపెట్టి, పరాన్న జీవిలా మనుగడ సాగించే దుస్థితి అగ్రరాజ్యానికి ఏర్పడడం దౌర్భాగ్యం. తమ వద్దే ఆయుధాలు కొనాలని అమెరికా వాంఛించడం మూర్ఖత్వం. శాంతి వచనాలు వల్లించే అగ్రరాజ్యాధినేత ట్రంప్‌కు ఆయుధాలతో సంబంధమేమిటి? ఒక యుద్ధ పిపాసికి నోబెల్ శాంతి పొందాలన్న ఆశ,ఆరాటం ఎందుకు? అమెరికా పట్ల భారత్ జాగరూకత వహించాలి. భారత్ పై కక్షతో అమెరికా అధ్యక్షుడు పాక్‌కు ఆయుధ,ఆర్థిక సహాయం చేసే అవకాశ ముంది. ఆర్థికంగా పతనమై, ప్రజల తిరుగుబాటుతో చిన్నాభిన్నమౌతున్న పాక్ కు అమెరికా వత్తాసు పలకడమేమిటి ? భారత్ ఆర్థిక వ్యవస్థను మృత ఆర్థిక వ్యవస్థ గా పేర్కొనడమే కాకుండా భారత్ లో అమెరికా కంపెనీలు పెట్టుబడులు పెట్టవద్దని, భారతీయులకు ఉద్యోగాలివ్వ రాదని ట్రంప్ బెదిరించడం హాస్యాస్పదం. అమెరికా ఆర్థిక వ్యవస్థలో భారతీయుల స్థానం కీలకమైనది. ఈ విషయాన్ని విస్మరించడం ట్రంప్ హ్రస్వ దృష్టికి నిదర్శనం. అమెరికా ఆంక్షలకు తలొగ్గకుండా,భారత్ ఎప్పటి మాదిరిగానే రష్యాకు మిత్రదేశంగా మెలగాలి. అమెరికా దురహంకారానికి లొంగకుండా భారత్ అన్నిరంగాల్లో స్వయం స్వావలంభన సాధించాలి.

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463




# వరదాయిని వరలక్ష్మీ దేవి

'నమస్తేస్తు మహామాయే, శ్రీపీఠే సుర పూజితే; శంఖ చక్రగదా హస్తే, మహాలక్ష్మీ క నమో స్తుతే. శంఖ చక్ర గద ధారిణియైన మహా లక్ష్మీ దేవి సంపద,భూమి,శిక్షణ,ప్రేమ,కీర్తి,శాంతి, సంతోషం, శక్తి లాంటి అష్టైశ్వర్య ప్రదాయిని. అష్టసంపదలు ఒసంగే జగన్మంగళ దాయిని. అష్టైశ్వర్యాలు కలుగజేసే రూపం వరలక్ష్మిగా ఆరాధనీయం. కొలిచిన వారికి కొంగు బంగారమై వరాలనిచ్చే జగజ్జనని వరలక్ష్మి. అన్ని లక్ష్మీ పూజల కన్నా, వరలక్ష్మీ పూజ ఉన్నతమైనదని శాస్త్ర వచనం. వరలక్ష్మీ దేవత విష్ణు మూర్తి భార్య. వైకుంఠ నాథుని జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రంతో కూడిన పౌర్ణమి కల శ్రావణ మాసంలో వరలక్ష్మిని ఆరాధిస్తే, విశేష ఫలమని భావన. ఆయురారోగ్య ఐశ్వర్య సంతోషాదులు లక్ష్మీదేవిని అత్యంత ప్రియమైన శుక్రవారం పూజిస్తేనే కలుగుతాయని శ్రీ సూక్తం వివరిస్తున్నది. వరలక్ష్మిని షోడ శోపచార పూజలతో సేవిస్తే, అష్ట ఐశ్వర్యాలు, అయిదవతనం, సత్సంతానం, సంతానాభివృద్ధి కలకాలం ఉండగలవని శాస్త్ర వచనాలు. సకల కోరికెలు ఈడేరాలని, సర్వమంగళ సంప్రాప్తి కలగాలని, నిత్య సుమంగళిగా వర్ధిల్లాలని ఈ వ్రతాన్ని వివాహితులు వ్రతాన్ని ఆచరిస్తారు. వరాలు యిచ్చే దేవతగా వరలక్ష్మీ దేవిని కొలుస్తారు. ఈ పూజలు ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అధికంగా స్త్రీలు కొలుస్తారు. ఈ పండగను ముఖ్యంగా వివాహమైన మహిళలు నిర్వహిస్తారు. శ్రావణ శుక్ల పక్షంలో పౌర్ణమికి ముందు అరు దెంచే శుక్రవారం సువాసినులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం హిందూ సంప్రదాయం మంచి భర్త, సత్సంతానం కలుగాలని అమ్మాయిలు పూజిస్తారు. ఈ రోజున దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలు పంచు కుంటారు. దేవతను పూజిస్తే అష్ట ఐశ్వర్యాలు... సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. కైలాస నాథుడు, పార్వతీదేవికి వరలక్ష్మీ వ్రతాచరణ గురించి వివరించినట్లు స్కంద పురాణంలో ఉంది. లోకంలో స్త్రీలు సకలైశ్వర్యాలు, పుత్రపౌత్రాదులను కలిగేందుకు ఏదైనా వ్రతం గురించి తెలపాలని పార్వతీ దేవి, పరమ శివుని కోరగా, వరలక్ష్మీ వ్రతాన్ని అభయంకరుడుడైన శంకరుడు వివరించారు. ఈ సందర్భంలోనే భర్తపట్ల ఆదరాన్ని అత్తమామల పట్ల గౌరవాన్ని ప్రదర్శించిన మగధ రాజ్య అంతర్గత కుండిన నగర వాసియైన పరమ సాధ్వి చారుమతి ఉత్తమ ఇల్లాలిగా ప్రవర్తించిన నేపథ్యాన్ని వివరించారు.



మహాలక్ష్మిని చారుమతి చిత్తశుద్ధితో పూజించిన క్రమంలో వర లక్ష్మి ఆమెకు స్వప్న సాక్షాత్కారమై, శ్రావణ పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం తనను ఆరాధిస్తే, కోరిన వరాల్ని ఒసంగెదనని వరమిచ్చినట్లు కథనం. ముందుగా గణపతిని పూజించి కలశం లోనికి అమ్మవారిని ఆవాహన గురించి షోడశోపచార పూజ, అథాంగ పూజ చేయాలి.

**'సర్వమాంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే'!!** అంటూ పూజ చేయాలి. అష్టోత్తర శత నామాల యుక్త దూప, దీప, నివేదన, తాంబూలాలను సమర్పించి, కర్పూర నీరాజనం, మంత్ర పుష్పం, మంగళ హారతి సమ ర్పణ గావించి, తొమ్మిది దారపు పోగులతో తొమ్మిది ముడులను వేసి, మధ్యన పంచ పుష్పాలు కట్టి తోర గ్రంథి చేసి తోర గ్రంధి పూజ, తోర గ్రంధి మంత్ర పఠనం చేయాలి. **'లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం, శ్రీరంగ ధామేశ్వరీం, దాసీభూత సమస్త దేవ వనితాం లోకైక దీపాంకురాం, శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ, బ్రహేంద్ర గంగాధరాం, త్వాం త్రిలోక్య కుటుంబినీం సరసిజాం, వందే ముకుంద ప్రియాం'** అని స్తుతించాలి.

నవ సూత్ర ధారణను కుడి చేతికి చేయాలి. ఫలభక్ష్య పానీయ పాయసాదులను అమ్మవారికి సమర్పించి, చివరగా వాయన దాన మంత్రంతో ముత్తయిదువను మహాలక్ష్మిగా భావించి, తాంబూలం అందించాలి. భక్తితో వేడుకొంటే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. వరలక్ష్మీ వ్రతం చేసినను, ఈ వ్రతం చేసినప్పుడు చూసినా కూడా సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యాలు కలిగుతాయని సూత మహాముని శౌనకాది మహర్షులకు వివరించినట్లు పురాణ కథనం. ఈ వ్రతాన్నిఆచరించడానికి ఏ నిష్ఠలు, నియమాలు, మడులు అవసరం లేదు. నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తం ఉంటే చాలు. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది.

ఈ వ్రతాచరణ వల్ల లక్ష్మీదేవి కృప కలిగి సకల శుభాలు కలుగుతాయి. సంపదలంటే కేవలం ధనం మాత్రమేకాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, జ్ఞాన సంపద మొదలైనవి ఎన్నో ఉన్నాయి. 'వర' అంటే శ్రేష్ఠమైన అర్థం కూడా ఉంది.

**- రామకిష్టయ్య సంగనభట్ల**
9440595494

# యుద్ధం ఇప్పట్లో ఆగేలా కన్పించడం లేదు...

రష్యా, ఉక్రెయన్ యుద్ధం కొత్త దిశలో పయనిస్తోంది. రష్యా భీకర దాడులు చేస్తూ,ఉక్రెయన్‌ని వణికిస్తోంది. యుద్ధం ఆపుతానని అగ్ర దేశ నేత సైతం మౌనం వహించి, ఉక్రెయన్ వంకే ఉండటం రష్యాకు ఆగ్రహం కలిగించింది. దానికి తోడు జెలెన్స్కి ప్రకటనలు మాస్కోకు ఆగ్రహం తెప్పించింది. ఆ ప్రకటనల సారాంశం ఏమిటంటే రష్యాకు, చైనా, పాక్ సైనికుల అండ ఉంది అనే మాట. వాస్తవానికి రష్యాకు ఒక్క ఉత్తరకొరియానే బాహాటంగా మద్దతు ఇస్తోంది.పాక్ కూడా రష్యా కు అండగా ఉంది అనే మాట పాక్ గట్టిగా ఖండించింది. కీవ్ అధికారులు ఎవ్వరూ తనను సంప్రదించలేదని పాక్ పేర్కొంది. మేము ఎవరికీ మద్దతు ఇవ్వడం లేదు అని పాక్ చెప్పడం, ఆ దిశలోనే చైనా కూడా మాకు సహాయం అందించింది అని ఉక్రెయన్ చెప్పడంతో చైనా, ఉక్రె యన్ ఆరోపణలను ఖండించింది. ఇది ఇలా ఉండగా ఉక్రెయన్‌లోని వోవ్ ఛాన్స్కీ ప్రాంతంలో తమ సైనికులతో జెలెన్స్కి భేటీ కావడం సైనికులలో కొత్త ఉత్సహాన్ని నింపినట్లు అయింది. ఉక్రెయన్‌కు మద్దతుగా చైనా,తజకిస్తాన్, ఉజ్బె కిస్తాన్, పాకిస్తాన్‌తో సహా ఆఫ్రికా దేశాలు కూడా ఉన్నాయి. వీరందరికి జెలెన్స్కి ధన్యవాదాలు చెప్పడం, పాక్, చైనా దేశాలు మేము ఉక్రెయన్‌కు అసలు మద్దతే ఇవ్వలేదు అని చెప్పడం, ఉత్తర కొరియా మాత్రం మేము రష్యాకు మద్దతు ఇస్తాం. ఆయుధాలు ఆ దేశానికి సమాకూరుస్తాం, ఇప్పటికే ఉత్తర కొరియా వెయ్యికి పైగా బలగాలను పంపింది. ఆయుధాలు కూడా రష్యాకు అందిస్తామని ప్రకటించింది. ఉత్తర కొరియా, రష్యా ప్రక్కన దిగితే మాత్రం ఉక్రెయన్ కు గడ్డు కాలమే. అందుకనే ఉక్రైన్ ఎక్కువగా అమెరికాపై ఆధారపడుతూ, యుద్ధాన్ని ఆపాలనే ఆలోచన లేకుండా, పౌరుల సంక్షేమం, దేశ అభివృద్ధి పట్టక ఇతర దేశాలపై ఎక్కువగా ఆధార పడుతోంది. పరస్పర దాడులు రెండు దేశాలు చేసుకుంటూ యుద్ధాన్ని మరో కోణం లోకి తీసుకు వెళ్ళారు. దీనికి తోడు అగ్రనేత ఆ దేశాలపై సుంకాలు పెంచుతామనే ప్రకటన కూడా మంచిది కాదు. యుద్ధం ఆపే ప్రయత్నం అమెరికా నేత చేయాలి. అమెరికా మాట ఉక్రెయన్ వింటుంది. ఉక్రెయన్ కు తగిన విధంగా చెబితే యుద్ధం ఆగుతుంది. రెండూ దేశాల మధ్య రాజీనే విశ్వానికి కావాల్సింది. శాంతిదూత నేనే అని చెప్పుకునే నేతకు రష్యా, ఉక్రెయన్ యుద్ధం ఆగిపోతే నిజంగా దానికి అర్హుడు అవుతాడు. నేను అధికారంలోకి ఉంటే కేవలం ఒక్క రోజులోనే యుద్ధం పరిసమాప్తి చేస్తా అనే మాట నిలబెట్టుకోవాలి కాని ఇలా ఉక్రెయన్‌కు సహాయ, సహకారాలు ఇవ్వ కూడదు. రష్యా, అమెరికా రెండూ బలమైన దేశాలు, ఐక్యరాజ్య సమితి, భద్రతా సమితిలో శాశ్వత సభ్య దేశాలు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకోవాల్సిందే. అమెరికా, రష్యాకు బదులు ఉక్రైన్ బుజ్జగించాలి. అమెరికా మాట ఉక్రెయన్ తప్పక వింటుంది. వినకపోతే దాని పర్యావసానం ఏమిటో ఉక్రైన్ కు బాగా తెలుసు. యుద్ధం ఆగకపోవటానికి అగ్ర దేశం లోపాయకారిగా ఉక్రెయన్ వంక ఉండటమే. అందుకే యుద్ధం ఆగే సూచనలు ఇప్పట్లో కనిపించటం లేదు.




**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

# ఎఫ్.ఏ -1 పరీక్షలు ఆగస్టు 15 తర్వాత నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి ఫార్మెటివ్ అసెస్మెంట్ పరీక్షలను ఆగస్టు 11 నుంచి 13 వరకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఆగస్టు 11 నుంచి 14 వరకు ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించాలని పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. కానీ ఆగస్టు నెలలో 15వ తేదీన ప్రతీ పాఠశాలలో విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. దీనికోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పాఠశాలల్లో నిర్వహించుకునేందుకు సంసిద్ధతా కార్యక్రమాల్లో ఉంటారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు పోటీలు లాంటివి నిర్వహించడంలో నిమగ్నమై ఉంటారు. ఈ సమయంలో పరీక్షలు నిర్వహించడం సరైనది కాదు. కావున ప్రభుత్వం ఎఫ్ ఏ-1 పరీక్షలను ఆగస్టు 15 తర్వాత నిర్వహించాలి. ఆగస్టు 15 తర్వాత పరీక్షలు నిర్వహించే విధంగా విద్యాశాఖ అధికారులు వెసులుబాటు కల్పించాలి.

**- వాసిలి సురేష్**
9494615360

# భారతీయ సమాజంలో ఎవరు ఓసిలు..ఎవరు బీసీలు..?

చారిత్రకంగా భారతీయ సమాజం కుల వ్యవస్థ ఆధారంగా శతాబ్దాలుగా నిర్మితమై ఉంది, ఇది సామా జిక, ఆర్థిక, రాజకీయ గతిశీలతలను ప్రభా వితం చేస్తున్నది. ఈ వ్యవస్థను ప్రస్తుతం ఓపెన్ కేటగిరీ (ఓసీ), వెనుకబడిన కులాలు (బీసీ లేదా ఓబీసీ), షెడ్యూల్ కులాలు (ఎస్సీ), మరియు షెడ్యూల్ తెగలు (ఎస్టీ) అనే వర్గాలుగా విభజించారు. బ్రిటిష్ పాలనా కాలంలో 1881 నుండి 1931 వరకు నిర్వహించిన జనగణనలు కుల ఆధారిత జనాభా వివరాల్ని సేకరించాయి. కానీ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కల్లో కులాల వివరాల్ని నమోదు చేయలేదు, కాబట్టి ఆయా సామాజిక వర్గాల వారీగా ఖచ్చితమైన జనాభా శాతాలపై స్పష్టత లేదు. స్వాతంత్ర్య అనంతరం భారత ప్రభుత్వం కుల గణనను నిలిపివేసి, పదేళ్ళకోసారి చేసే జనగణనలో ఎస్సీ మరియు ఎస్టీ గణనపై దృష్టి సారించింది, దీనివల్ల ఓసి, ఓబీసీ జనాభా డేటా లభ్యత పరిమితమైందని చెప్పవచ్చు.

ఓసీ మరియు బీసీల గుర్తింపు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ఆధారపడి ఉంటుంది. ఓసీ కేటగిరి సాధారణంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులతో పాటు రిజర్వేషన్ ప్రయోజనాలు పొందని ఇతర కులాల్నికూడా సూచిస్తుంది.

బీసీ లేదా ఓబీసీలు సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగ తులుగా రాజ్యాంగం ఆర్టికల్ 15(4) కింద నిర్వ చించబడ్డాయి. కానీ, కుల వర్గీకరణలో కొంత సంక్లిష్టత నెలకొని ఉంది, కేంద్ర జాబితాలో ఓబీసీ లుగా గుర్తించబడిన కొన్ని కులాలు వివిధ రాష్ట్రాలలో ఓసీ, ఎస్సీ, లేదా ఎస్టీలుగా వర్గీకరించ చడ్డాయి. ఉదాహరణకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1970 వ దశకం వరకు బీసీ జాబితాలో లంబాడా సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చడం జరిగింది. ఓబీసీలను ఏ, బీ, సీ, డీ, ఈ గ్రూపులుగా విభజించారు, తెలంగాణలో మున్నూరు కాపులు బీసీ జాబితాలో ఉంటే ఆంధ్ర ప్రదేశ్‌లో కాపులు ఓసీ జాబితాలో ఉన్నారు. కర్ణాటకలో రెడ్లు బీసీ జాబితాలో ఉంటే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఓసీలుగా ఉన్నారు. ఇలా వివిధ కులాలు కేంద్ర, రాష్ట్రాల జాబితాలు వేర్వే రుగా ఉండటం వల్ల ఒక రాష్ట్రంలో ఓసీలుగా ఉన్న వారు, మరొక రాష్ట్రంలో బీసీలు జాబితాలో ఉన్నా రు. అదే విధంగా బీసీలుగా ఉన్నవారు మరికొన్ని రాష్ట్రాల్లో మరొక వర్గంలో ఉన్నారు.

ఇక్కడే అసలు దేశంలో ఓసీలు ఎవరు..? బీసీలెవరు అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. జన్మ ద్వారా వచ్చిన కులాన్ని మార్చడం సాధ్యం కాదు కానీ, వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనక బాటు ఆధారంగా వారికి రిజర్వేషన్ కల్పించి వారి పురోభివృద్ధికి చర్యలు తీసుకోవడం అనివార్యం. అందుకే ప్రభుత్వం కుల, మత, వర్గాలకు అతీతంగా బీసీ, ఎస్సీ ఎస్టీ వర్గాలతో పాటు వారి రిజర్వేషన్ ప్రయోజనాలకి భంగం కలగకుండా ఓసీల్లో ఉన్న పేదలకు కూడా ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించింది. రిజర్వేషన్ మినహాయించిన తర్వాత మిగిలిన ఓపెన్ కేటగిరీలో అన్ని సామాజిక వర్గాల వారు సమానంగా పోటీ పడే అవకాశం ఉంటుంది.



ఈ అంశంపై సుప్రీం కోర్టులో వాదనలు జరిగినపుడు ఈ చట్టానికి అనుకూలంగా తీర్పు రావడం గమనార్హం.

1953లో ఏర్పాటైన కాకా కలేల్కర్ కమిషన్ దాదాపు రెండు వేలకు పైగా వెనుకబడిన కులాలను గుర్తించింది, కానీ దాని సిఫార్సులు అమలు కాలేదు.

1979లో ఏర్పాటైన మండల్ కమిషన్ దాదాపు మూడు వేల కులాలను ఓబీసీలుగా వర్గీకరించి, 27% రిజర్వేషన్ను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థలలో సిఫారసు చేసింది. 1990లో వి.పి. సింగ్ ప్రభుత్వం ఈ సిఫారసును అమలు చేసింది, ఇది దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా మారింది. 1992లో ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు 27% రిజర్వేషన్‌ను సమర్థించి, క్రీమీలేయర్‌ను మినహాయించాలని ఆదేశించింది. తదనంతరం, ఈ రిజర్వేషన్ ప్రభుత్వ విద్య, ఉద్యోగ అవకా శాలకు విస్తరించబడింది.

రిజర్వేషన్ విధానం ఓబీసీలకు విద్య, ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించింది. అయితే, రాజకీయ రిజర్వేషన్ల విషయంలో ఎస్సీ, ఎస్టీలకు ఉన్నట్లు ఓబీసీలకు చట్ట సభల్లో ప్రత్యేక కోటా లేదు, భారతీయ సమాజంలో ఎస్సీ, ఎస్టీలతో పోల్చితే కొంతవరకు సామాజికంగా, ఆర్థికంగా బీసీలు పురోభివృద్ధి సాధించినందున ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దాదాపు జనాభా శాతానికి సమానంగా రిజర్వేషన్ కల్పించినప్పటికి, బీసీ జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్ కల్పించి ఉండక పోవచ్చు. సమకాలీన సందర్భంలో, కుల గణన అనేది ఒక కీలక అంశంగా మారింది. ఈసారి జరగనున్న జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గణన ఆయా సామాజిక వర్గాల జనాభా, ఆర్థిక స్థితిగతులపై స్పష్టతనిచ్చే అవకాశం ఉంటుంది.

ఆయా సామాజిక వర్గాలకి పూర్తి స్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందాలంటే క్రీమీ లేయర్ని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంటుంది. ఆర్థికంగా స్థిరపడిన సామాజిక వర్గాలు తర తరాలుగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం వల్ల, నిజంగా వెనుకబడిన సమూహాలకు అవకాశాలు తగ్గుతున్నాయనే విమర్శలు కూడా ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం క్రీమీ లేయర్ ఆదాయ పరిమితిని సమీక్షించడం ద్వారా రిజర్వేషన్ ఫలాల్ని అట్టడుగు వర్గాలకు అందించే ప్రయత్నం చేయవచ్చు.

రాష్ట్రాలకు ఓబీసీ జాబితాలను నిర్వహించే అధికారం 2021లో 105వ రాజ్యాంగ సవరణ ద్వారా పునరుద్ధరించబడింది, కానీ రాజ్యాంగం ప్రకారం జనగణన చేసే అధికారం కేంద్ర ప్రభుత్వం వద్దనే ఉంది.

ఓసీ మరియు బీసీల గుర్తింపు భారతీయ సమాజంలో సామాజిక న్యాయం, అవకాశాల కల్పనలో కీలకమైన అంశం. 1931 జనగణన ఆధారంగా అంచనా వేయబడిన జనాభా శాతాలు దాదాపు వందేళ్ళ క్రితం సేకరించబడినవి. ప్రతి జనగణన లో ఎస్సీ,ఎస్టీల జనాభా వివరాల్ని సేకరిస్తున్నప్పటికీ రాబోయే జనగణనతో పాటు చేసే కుల గణన ఈ అంతరాన్ని పూరించి, ఖచ్చితమైన గణాంకాల్ని(డేటా)తో, రిజర్వేషన్ విధానాలను మరింత సమర్థవంతం చేయగలదు. వివిధ రాష్ట్రాలలో కుల వర్గీకరణల సంక్లిష్టత, ఓటు బ్యాంకు రాజకీయాలు, మరియు క్రీమీలేయర్ వంటి సవాళ్లు సామాజిక న్యాయ సాధనలో అడ్డంకులుగా ఉన్నాయి.

వచ్చే జనగణన ఫలితాలు ఈ సవాళ్లను అధిగమించి, సమానత్వం, సామాజిక న్యాయ సాధనకు దోహదపడాలి.ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారుతున్నాయి.

ఈ రోజుల్లో కూడా దేశ వ్యాప్తంగా ఓసి వర్గంలో కొన్ని కులాలు, బీసీ హోదాను, బీసీ వర్గంలో ఉన్న కులాలు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గంలో చేర్చమని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మీద ఒత్తిడి చేస్తున్న సంఘటనలు నిత్యకృత్యం అయ్యాయి. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 ఏండ్లు అయినా అట్టడుగు ప్రజలకు ఇంకా పూర్తిస్థాయిలో రిజర్వేషన్ ఫలాలు అందట్లేదు అంటే చట్టాలను పున సమీక్షించుకోవడం కన్నా ముందు క్షేత్ర స్థాయిలో వాటి అమలు తీరు పైన ప్రభుత్వాలు, పౌర సమాజం దృష్టి సారిస్తే సామాజిక న్యాయంతో పాటు సమసమాజం నిర్మితం అయ్యే అవకాశం ఉంటుంది.

**- యం. అర్జున్**

# మరింత అభివృద్ధికి అవకాశం



- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్

**గోదావరిఖని, ఆగస్ట్ 07(మనం న్యూస్):** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలో విమానాశ్రయం నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేయాలని రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్, పెద్దపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే విజయరమణ రావుతో కలిసి కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రిని న్యూఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు పెద్దపల్లి జిల్లా భౌగోళికం, పరిశ్రమలు, జనాభా వృద్ధి, రవాణా అవసరాలు తదితర అంశాలను మంత్రికి వివరించి విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లాలో వాణిజ్య, పారిశ్రామిక, పర్యాటక అభివృద్ధికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందని వివరించారు. కేంద్ర మంత్రి ఈ అంశాన్ని సానుకూలంగా పరిగణించారని, అవసరమైన సాంకేతిక పరిశీలనల అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ చర్యలతో పెద్దపల్లి జిల్లా మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యేలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు

- టాస్క్ సెంటర్ ద్వారా అందించే కోర్సులో గురించి విస్తృత ప్రచారం కల్పించాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 07(మనం ప్రతినిధి):** రాబోయే 6 నెలల కాలంలో పెద్దపల్లి జిల్లాకు 1000 మంది యువతకు నాణ్యమైన ఉపాధి కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష యువతకు ఉపాధి కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాబోయే 6 నెలల కాలంలో మన పెద్దపల్లి జిల్లాలో 1000 మంది యువతకు నాణ్యమైన ఉపాధి కల్పించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పరిశ్రమల శాఖ, బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, వివిధ శాఖల పరిధిలో సమన్వయంతో వివిధ కార్యక్రమాలను అమలు చేసి ఉపాధి కల్పించాలన్నారు. యువతకు నాణ్యమైన ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ కోసం నిధులు, లాజిస్టిక్స్ ఇతర సౌకర్యాల కల్పనకు జిల్లా కలెక్టరేట్ నుంచి సంపూర్ణ సహకారం అందించడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి టాస్క్ సెంటర్ లో వివిధ కోర్సులు నేర్చుకున్న యువతకు 7 లక్షల ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. టాస్క్ కేంద్రంలో చేపట్టిన వివిధ కోర్సుల గురించి ప్రజలకు సమాచారం లేనందున, వీటిలో నమోదు చేసుకునే యువత స్పందన తక్కువగా ఉందని అన్నారు. టాస్క్ సెంటర్‌లో అందించే వివిధ కోర్సులు, వాటి రిజిస్ట్రేషన్, ఉపాధి అవకాశాలపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. యువతకు వివిధ నైపుణ్యాలలో శిక్షణ అందించి నాణ్యమైన ఉపాధి అవకాశాలు చూపించే వివిధ శిక్షణ సంస్థలకు సంపూర్ణ సహకారం కూడా పెద్దపల్లి జిల్లా యంత్రాంగం తరపున అందిస్తామని, మన జిల్లాకు మాత్రమే పరిమితం కాకుండా హైదరాబాదులో ఉన్న శిక్షణ సంస్థలను కూడా పరిశీలించి అక్కడ మన జిల్లా యువతకు శిక్షణ ఇప్పించి ఉద్యోగ అవకాశాల కల్పన సాధ్యసాధ్యాలపై నివేదిక అందించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ శాఖ పరిధిలోని ఎరువులు, విత్తనాల షాపు ఏర్పాటుకు అవకాశం ఉన్నచోట కల్పించాలని అన్నారు. డ్రోన్ వంటి ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సాగు ఉత్పత్తి పెంపు అవకాశాలు పరిశీలించాలని, దీనిలో యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై స్టడీ చేయాలని అన్నారు. న్యాక్ ఆధ్వర్యంలో శశి ప్రీతం అకాడమీ ద్వారా అందించే సినిమాటోగ్రఫీ, సౌండింగ్, వీడియో ఎడిటింగ్, డబ్బింగ్ వంటి వివిధ కోర్సులలో ఆసక్తిగల యువతకు శిక్షణ అందించి ఉపాధి కల్పించే అవకాశం పరిశీలించి నివేదిక తయారు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, జిల్లా వ్యవసాయ అధికారి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి

- అదనపు కలెక్టర్ డి.వేణు





**పెద్దపల్లి, ఆగస్టు 07(మనం ప్రతినిధి):** చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ బి.వేణు తెలిపారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకలలో అదనపు కలెక్టర్ బి.వేణు పాల్గొన్నారు. కలెక్టరేట్ కాంప్లెక్స్ మెయిన్ గేట్ నుంచి సమావేశం మందిరం వరకు చేనేత కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు గ్రహీతలైన చేనేత కార్మికులకు, సీనియర్ నేతన్నలను అదనపు కలెక్టర్ డి.వేణు శాలువాలతో సత్కరించి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.వేణు మాట్లాడుతూ, చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వ రంగంలో వాడే వివిధ యూనిఫామ్, స్కూల్ పిల్లల బట్టలు, మహిళా సంఘాలకు అందించే చీరలను చేనేత కార్మికుల వద్ద ఆర్డర్ చేయడం జరిగిందన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం చేనేత రంగంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, పిడి హౌసింగ్ రాజేశ్వర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, నేత కార్మికులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సిరుల నొసగే.. శ్రీ మహాలక్ష్మీ వేడుక నేడు

- నేటి శుక్రవారం.. వరలక్ష్మీ వ్రతం
- ముస్తాబైన మహాలక్ష్మి ఆలయాలు



**గంగాధర, ఆగస్టు 07(మనం న్యూస్):** వరలక్ష్మీ, శుక్రవారం అంటే అమ్మవారికి ఎంతో ప్రత్యేకం. ముత్తైదువులు, మహిళలకు ఈరోజు పండగరోజు. వరలక్ష్మీ శుక్రవారం రోజున మహిళలు అమ్మవారిని దర్శించుకుంటే సకల సంపదలు పొందుతారని ప్రగాఢ విశ్వాసం. సత్చింతన, సత్యవాక్కు, సత్ప్రవర్తన ఎక్కడైతే వుంటాయో అక్కడికి శ్రీమహాలక్ష్మీ తానుగానే వేంచేసి నిరంతరం నివసిస్తుందని, మహాలక్ష్మి దేవి సదా మన ఇంట నివసించాలని మనసా, వాచా, కర్మణా ధర్మనిరతితో ప్రవర్తిస్తూ దేవిని పూజిస్తారు. సహస్రదళ కమలంలో నివసించే దేవి, కోటి చంద్రుల కాంతి కలిగిన చల్లటి దేవి, దయార్ద్ర హృదయంతో తనను నమ్మిన భక్తులకు శుభాలనొసగే దేవీ మహాలక్ష్మిని పూజిస్తే ఆ కరుణాంతరంగ అష్టైశ్వర్యాలను అనుగ్రహిస్తుందని, మహాలక్ష్మిని స్తుతిస్తూ ఆ దేవి కొలువై వున్న ఆలయాలకి వెళ్ళి దర్శించి భక్తితో పూజిస్తారు. వరలక్ష్మి శుక్రవారం సందర్భంగా మహిళలు ఉదయాన్నే తలస్నానం చేసి, నూతన వస్త్రాలు ధరించి, ఇంట్లో పూజాది కార్యక్రమాలు పూర్తి చేసుకుని అమ్మవారి ఆలయం దర్శించుకుంటారు. అక్కడ నేతితో దీపం వెలిగించడం ద్వారా సుమంగళి ప్రాప్తిస్తుందని, అనుకున్న కార్యాలు పూర్తవడంతో పాటు శుభ ఫలితాలు ప్రాప్తిస్తాయని, జీవితం శుభకరంగా, మంగళకరంగా ఉంటుందని, సంతోషంగా సాగాలంటే లక్ష్మీ కటాక్షం ఉండాలని, కుటుంబమంతా సుఖ సంతోషాలతో, ప్రశాంతతతో ఉంటుందని నమ్ముతారు. వరలక్ష్మి శుక్రవారం సందర్భంగా శ్రీ మహాలక్ష్మి ఆలయాలు కిటకిటలాడనున్నాయి. ఈ సందర్భంగా మండలంలోని ఉప్పర మల్యాల గ్రామంలోని శ్రీ మహాలక్ష్మి ఆలయం, న్యాలకొండ పల్లి సహస్ర లింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో కొలువైన త్రిశక్తి అమ్మవారి ఉపాలయాలు, సర్వాంగ సుందరముగా ముస్తాబైనాయి. మండలంలో రెండే శ్రీ మహాలక్ష్మి ఆలయాలు ఉండడంతో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకోనున్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- నిబంధనలు పాటించిన మహిళలకు బహుమతులు పంపిణీ
- వాహనానికి సంబంధించిన పత్రాలు ఉండాలి
- రామగుండం ట్రాఫిక్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్



**గోదావరిఖని, ఆగస్ట్ 07(మనం న్యూస్):** రామగుండం ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధరించిన మహిళలకు బహుమతులు అందజేసే వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ జంక్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో రామగుండం ట్రాఫిక్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్, ట్రాఫిక్ సిఐ బి రాజేశ్వరరావు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపిన మహిళలకు బహుమతులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు ఉండాలని, త్రిబుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగులు చేయరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనం నడిపిన మహిళలు మరికొందరికి ఆదర్శంగా ఉండాలని, ట్రాఫిక్ పోలీసులు ఫైన్ విధించడమే కాకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించిన వారికి బహుమతుల పంపిణి కార్యక్రమం నిర్వహిస్తామని, వాహనదారులలో మార్పు తీసుకురావడానికే ఇలాంటి కార్యక్రమాలు చేపడతామని ఏసీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి హరిశేఖర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నుల్లి పురుగుల నిర్మూలనకు సర్వం సిద్ధం



**జమ్మికుంట, ఆగస్టు 7(మనం న్యూస్):** మూడు జాతీయ నుల్లి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ చందు తెలిపారు. జమ్మికుంట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులకు ఎన్‌డీడీ మీద కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించి ఎన్‌డీడీ కార్యక్రమం విజయవంతం కావడం కోసం సలహాలు సూచనలు చేశారు. మున్సిపల్, మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయుటకు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈనెల 11న సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు వేసుకొని పిల్లలకు 18వ తేదీ నాడు వేయడం జరుగుతుందని అన్నాడు. సోమవారం నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రజా ప్రతి నిధులు, అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంఈఓ హేమలత, డాక్టర్ చందన, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి, మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్, హెల్త్ అసిస్టెంట్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పసుపు పంటలో ఆధునిక పద్ధతులపై అవగాహన

- సూచనలు సలహాలు అందించిన ఉద్యాన శాఖ




**జగిత్యాల, ఆగస్టు 07(మనం ప్రతినిధి):** శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మరియు ఉద్యాన శాఖ జగిత్యాల జిల్లా వారి సహకారంతో మల్లాపూర్ మండలంలోని కొత్త దామ రాజ్ పల్లి గ్రామం రైతు వేదికలో పసుపు పంటలో సాగు పద్ధతి లో అధునాతన పద్ధతులను మరియు సూచనలను సలహాలతో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పసుపు బోర్డ్ చైర్మన్ పల్లా గంగారెడ్డి హాజరై మాట్లాడుతూ పసుపు సాగు చేసే పద్ధతిలో యాంత్రికరణ పెంచాలని, పసుపును కొత్త పద్ధతుల ద్వారా వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చని వాటి మీద రైతులు దృష్టి సారించాలని మరియు రైతు సహకార సంఘం ఏర్పాటు చేసుకొని అందులో సభ్యులుగా మారి సంఘటితంగా అధునాతన పద్ధతులను అనుసరించుకుంటూ పసుపు సాగు సాగును రైతులకు మరింత లాభదాయకంగా చేసుకోవాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు సబ్సిడీ అందుబాటులో ఉందని పసుపులో యాంత్రికరణను ప్రోత్సహించడానికి రైతులు ముందుకు రావాలని ఇట్టి సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం సైంటిస్ట్ బి.మహేందర్ పాల్గొని రైతు పసుపు పంటలో చీడ పీడల నివారణ కొరకు మరియు సలహాలు సూచనలను అందించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి కె.శ్రీనివాస్, ఏఈఓ వైష్ణవి, ఏవో లావణ్య పాల్గొన్నారు.

# సహకార సంఘాల యూరియా విక్రయాలపై సమీక్ష




**జగిత్యాల, ఆగస్టు 07(మనం ప్రతినిధి):** జిల్లాలోని వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యం లో యూరియా విక్రయాలపై గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా సహకార అధికారి సీహెచ్. మనోజ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వి. భాస్కర్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లాలోని సహకార సంఘాల లో యూరియా నిల్వలు, విక్రయాలను సంఘాల కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో యూరియా నిల్వల ను ప్రదర్శించాలని, యూరియా ను గరిష్ట చిల్లర ధరకు మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. రైతుల పంట విస్తీర్ణం ఆధారంగా యూరియా ను విక్రయించాలన్నారు. యూరియా విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ యూరియా విక్రయాల విషయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. సమావేశంలో ఇఫ్కో జిల్లా మేనేజర్ శ్రీధర్. సహకార శాఖ ఆడిట్ అధికారి ఏం. సత్య నారాయణ ఇతర అధికారులు, తదితులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష







**పెద్దపల్లి, ఆగస్టు 07(మనం ప్రతినిధి):** బాల సదనం పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. పెద్దపల్లి మండలం చందంపల్లి బస్తి దావాఖానా, బాల సదనం, రంగంపల్లి లోని సఖి సెంటర్, ఓదెల మండలంలోని కొలునూరు పి.హెచ్.సి. ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, బస్తీ దావాఖానాలో ఔట్ పేషెంట్ సేవలు బాగా జరగాలని అన్నారు. డెంగ్యూ, మల్లేరియా ఇలాంటి వ్యాధి లక్షణాలు గలవారికి తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. బాల సదనంలోని పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి పిల్లవాడు పాఠశాలలకు వెళ్లేలా చూడాలని, పిల్లల విద్యా ప్రమాణాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, చదువులో ముందు ఉండేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సఖి కేంద్రంను ఆశ్రయించిన గృహహింస, ఫోక్సో కేసు, వివిధ సమస్యల్లో ఉన్న బాధితులను రెగ్యులర్‌గా ఫాలో అప్ చేయాలని అన్నారు. పోలీసు అధికారులతో సహకరించుకుంటూ ప్రతి కేసు సత్వరంగా పరిష్కారం అయ్యేలా చూడాలని అన్నారు. అనంతరం ఓదెల మండలం కొలనూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రసవాల సంఖ్య పెరగాలని, గర్భిణీ మహిళలకు ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ 100 శాతం చేయాలని, పి.హెచ్.సి లో పైకప్పు మరమ్మత్తు పనులు చేపట్టాలని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, పీ.హెచ్.సి. డాక్టర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్య రహిత వాహనాల వినియోగంపై దృష్టి సారిద్దాం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘ సభ్యురాలుకు ఎలక్ట్రిక్ ఆటో పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, ఆగస్టు 07(మనం ప్రతినిధి):** కాలుష్య రహిత వాహనాల వినియోగంపై మనమంతా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.

గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘ సభ్యురాలుకు ఎలక్ట్రిక్ ఆటో పంపిణి చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద స్త్రీ నిధి ద్వారా సెర్ప్ ఆధ్వర్యంలో పెద్దపల్లి మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన గంగభవాని గ్రామాఖ్య సంఘంలోని ధనలక్ష్మి స్వశక్తి సంఘ సభ్యురాలు ఏడెల్లి రజిత₹ భర్త: తిరుపతి కు 3 లక్షల రూపాయల రుణం మంజూరు చేసి ఎలక్ట్రికల్ ఆటో కొనుగోలు చేయించడం జరిగిందని అన్నారు. పర్యావరణానికి దోహద పడేలా కాలుష్య రహిత వాహనాలను ఇక ముందు అందరూ కొనుగోలు చేసేలా చూడాలని, అలాగే స్వశక్తి సంఘాల సభ్యులను మైక్రో ఫైనాన్స్ సంస్థల బారిన పడకుండా స్త్రీ నిధి రుణాలను ఎక్కువ మొత్తంలో వినియోగించుకోవాలని సూచించారు. స్త్రీ నిధిలో బకాయి లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి 100% రికవరీ ఉండేలా చూడాలని సంస్థ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభి వృద్ధి సంస్థ అధికారి కాళిందిని, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్, స్త్రీ నిధి ప్రాంతీయ మేనేజర్ దుర్గాప్రసాద్, సెర్ప్, స్త్రీ నిధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ చేనేత దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన అదనపు కలెక్టర్

**చేనేత కార్మికులు తమ వృత్తిలో అధునాతన పద్ధతులు అవలంబించాలి**

**ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేనేత వృత్తి మరింత అభివృద్ధి**

**చేనేత మహిళలు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వ పథకాలలో లబ్ధి పొందాలి**



**సంగారెడ్డి, ఆగస్టు 7 (మనం ప్రతినిధి):** చేనేత కళాకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అదనపు కలెక్టర్ ( స్థానికసంస్థలు ) చంద్రశేఖర్ అన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత జౌళీ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి ఐటిఐ కళాశాల నుండి కలెక్టరేట్ వరకు చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ వృత్తిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడం ద్వారా చేనేత కల అంతరించిపోకుండా ఉంటుందన్నారు. చదువుకున్న యువకులు చేనేత వృత్తిలోకి వస్తే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పని సులువు అవడంతోపాటు అనేక నూతన రకాల ఉత్పత్తులు తీసుకువచ్చే అవకాశం ఉంటుందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక రకాల పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 4 చేనేత సహకార సంఘాలలో 74 చేనేత మగ్గాలు జియో ట్యాగింగ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని నాణ్యమైన లుంగీలు, తువ్వాలలు, చేతి రుమాలు , మెరినో ఉన్ని బ్లాంకెట్ లు, మగ్గాలపై ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నేతన్న అభయహస్తం కార్యక్రమంలో భాగంగా రూ.168 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో చేనేత సహకార సంఘాలజుం పావుల వడ్డీ రుణాలు కామన్ వర్క్ షెడ్ ఏర్పాటు , 40% రాయితీపై నూలు, క్యాష్ క్రెడిట్, లాంటి పథకాల ద్వారా చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం నేతన్న పొదుపు పథకం లో చేనేత కార్మికులు ఎనిమిది శాతం డబ్బులు చెల్లిస్తే ప్రభుత్వం ఎనిమిది శాతం డబ్బులు జమ చేస్తుందన్నారు జిల్లాలో అర్హత కలిగిన 31 మంది చేనేత కార్మికులు ఈ పథకానికి అర్హత పొందినట్లు తెలిపారు. నేతన్న భద్రతా పథకం ద్వారా 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల మధ్య వల్ల చేనేత కార్మికులు మరియు మరమగాల కార్మికులు మరణించితే వారి నామినీకి జీవిత బీమా సంస్థ ద్వారా ఐదు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఈ పథకం లో 54 మంది చేనేత కార్మికులు అర్హత పొందినట్లు తెలిపారు. నేతన్న భరోసా పథకం లో జియో ట్యాగింగ్ నెంబర్ కలిగిన చేనేత కార్మికులకు వారి నిలవారి ఉత్పత్తి సామర్థ్యమును బట్టి సంవత్సరానికి 18000 మరియు అనుబంధ కార్మికులకు 6000 కార్మికుల ఖాతాలు జమ చేస్తున్నట్లు తెలిపారు ఈ పథకంలో జిల్లాలో 31 మంది చేనేత కార్మికులు నమోదైనట్లు తెలిపారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన పథకాలను సద్వినియోగం చేసుకొని చేనేత కార్మికులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సూచించారు. ఈ పథకాలతో పాటు చేనేత సహకార సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళలు డ్వాక్రా స్వయం సహాయక సంఘాల వలె సంఘాలుగా ఏర్పడి ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఉపాధి పొందవచ్చు అని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని తాము వృత్తిలో ఇంకా మెరుగైన పద్ధతులు ఏమేమి చేస్తే చేనేత రంగం అభివృద్ధి చెందుతుందో సమగ్రంగా నివేదిక సమర్పిస్తే జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆయా కార్యక్రమాలు అమలు చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు చేనేత మరియు జౌళి శాఖ అధికారి వెంకట్రావు . హెచ్ డబ్ల్యు సి ఎస్ ప్రెసిడెంట్ వర్కల అశోక్, కృష్ణయ్య హెచ్ డబ్ల్యు సి ఎస్ డైరెక్టర్ వరలక్ష్మి, గిపేట నారాయణఖేడ్ చేనేత సహకార సంఘాల సభ్యులు సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

# నేతన్నల ఆర్థిక సంక్షేమానికి కృషి

- **నాగరికతకు ఆనవాళ్ళు మన వస్త్రాలు**
- **చేనేత వస్త్రాలను ఆదరిద్దాం**
- **సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**
- **సిద్దిపేటలో జాతీయ చేనేత దినోత్సవం**




**సిద్దిపేట, ఆగస్టు 07, మనంప్రతినిధి:** నేత కార్మికులు, మహిళల ఆర్థిక సంక్షేమానికి పూర్తి సహకారం అందిస్తానని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. గురువారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నాగరికతకు ఆనవాళ్ళు మనం వేసుకునే వస్త్రాలేనని, చీరను తయారు చేయడం వెనుక ఎంతోమంది కృషి, కష్టం దాగుంటుందని అన్నారు. ఒక చీరను తయారు చేయడంలో నేతన్నల సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అభివర్ణించారు. నేతన్నల సంక్షేమం, అభివృద్ధి కొరకు అందరూ కలిసి సొసైటీలను ఏర్పాటు చేసుకొని కమిటీలు వేసుకోవాలన్నారు. ఈ సొసైటీలు కొందరి కోసం కాకుండా నేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి సంక్షేమం కోసం పనిచేయాలని కోరారు. జిల్లాను గొల్లభామ ఉత్పత్తులకు బ్రాండ్ గా నిలపడంలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నేత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే విధంగా, ప్రస్తుత మార్కెట్ ట్రెండ్ కు అనుగుణంగా ఉత్పత్తులు రావాలని, ఇందు కోసం జాతీయ ఉత్పత్తి సంస్థల సహకారంతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నూతన వస్త్రాలను ఉత్పత్తి చేయాలన్నారు. ఇందుకు ప్రభుత్వం తరపున తమ పూర్తి సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. చేనేత వస్త్రాల తయారీలో మహిళలు సంఘంగా ఏర్పడితే వారందరికీ స్థలం ఇవ్వడంతో పాటు ఆర్థిక తోడ్పాటు కొరకు బ్యాంకర్ల ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. వారంలో ఒకరోజు చేనేత వస్త్రాలను ధరించాలని, అప్పుడే సమాజంలో నేత వస్త్రాలపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. అనంతరం 40 నుండి 50 సంవత్సరాలుగా చేనేత వృత్తిలో కొనసాగుతున్న పలువురు నేత కార్మికులను సన్మానించారు. తదనంతరం నేతన్న పొదుపు పథకం కింద 550 మంది లబ్ధిదారులకు 15,84,000 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో చేనేత, జౌళి శాఖ అధికారి సాగర్, జిల్లా పంచాయితీ అధికారి దేవకీదేవి, ఉద్యానవన శాఖ అధికారి, జడ్పీ సిఈఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తి పనులను పూర్తి చేయండి

## సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్



**చిన్నకోడూరు, ఆగస్టు 07, మనం న్యూస్:** వైద్యశాలలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి నాణ్యమైన వైద్యాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. మండల కేంద్రమైన చిన్నకోడూరులో గురువారం ఆకస్మిక పర్యటన చేశారు. ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించి ఆవరణలో ఎక్కడా చెత్తాచెదారం కనపడొద్దని, వారం రోజుల్లో శుభ్రం చేయాలని ఆదేశించారు. బిల్డింగ్ పనులు ఇంకా ఎందుకు పూర్తి కాలేదని, పది రోజుల్లో పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ల్యాబును పరిశీలించి శాంపిల్స్ సేకరణతోపాటు అటెండెన్స్, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు.

అనంతరం రామంచ గ్రామాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇండ్ల పనుల తీరును అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని, ఇండ్ల నిర్మా ణాలకు అవసరమైన ఇసుక, మట్టిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నాణ్యతతో కూడిన ఇండ్లను నిర్మించుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జనార్ధన్, ఎంపిఓ సోమిరెడ్డి, వంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు ఉన్నారు.

# రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి




- **జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య**

**సంగారెడ్డి, ఆగస్టు 7 (మనం ప్రతినిధి):** సంగారెడ్డి జిల్లా పరిధిలో నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్ భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య గురువారం అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వరకు. మొత్తం ఐదు ప్యాకేజీలుగా ఈ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం సంగారెడ్డి జిల్లా పరిధిలో భూమిని సేకరించాలని నిర్ణయించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా అధికారుల నుండి రీజినల్ రింగ్ రోడ్డు భూ సకరణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ మాధురి, ఆందోల్ ఆర్డీవో పాండు, గజ్వేల్ మేనేజర్ నేషనల్ హైవే అథారిటీ మేనేజర్ శ్రీహరి, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో వైద్య సిబ్బందికి అలసత్వం తగదు

- **జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అమర్ సింగ్**



**ములుగు, ఆగస్టు 7 మనం ప్రతినిధి:** ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సమయ పాలన పాటించాలని జాయింట్ డైరెక్టర్ కీటక జనిత నియంత్రణ అధికారి డాక్టర్ అమర్ సింగ్ అన్నారు. వర్షాకాలంలో వచ్చే కీటక జీనిత వ్యాధులైన మలేరియా డెంగ్యూ నియంత్రణ కార్యక్రమాలు జిల్లాలో అమలుతీరును పరిశీలించడానికి జాయింట్ డైరెక్టర్ కీటక జనిత నియంత్రణ అధికారి డాక్టర్ అమర్ సింగ్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ను గురువారం సందర్శించి హాస్పటలోఉన్న అన్ని వార్డులను పరిశీలించి, వైద్య సేవలు పొందుతున్న రోగులకు అందుతున్న వైద్య సేవలతీరుని అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ బ్యాంకులో అన్ని గ్రూపుల రక్త నిల్వలను నిల్వ ఉంచుకోవాలని, డ్రగ్ స్టోర్ లో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకుని మలేరియా డెంగ్యూ టైఫాయిడ్ లాంటి వర్షాకాల వ్యాధులకు ఇచ్చే చికిత్స మందులను సమకూర్చుకోవాలని, జ్వరం ఉన్న ప్రతి రోగికి మలేరియా డెంగ్యూ ఆర్డిటి పరీక్షలు తప్పనిసరిగా చేయాలని, టీ హబ్బులో అన్ని రకాల రక్త పరీక్షలను చేసి వాటి రిపోర్టులను సరి అయిన టైంలో అన్ని హాస్పిటలకు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ చంద్రశేఖర్, హాస్పిటల్ అడిషనల్ డైరెక్టర్ గఫర్‌టీ హబ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ మొదలగు వారు పాల్గొన్నారు.

# అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..



- **కొండారెడ్డిపల్లిలో ప్రత్యేక గ్రామసభ**
- **గ్రామాభివృద్ధి పై సమీక్షనిర్వహించిన కలెక్టర్**
- **సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలి**
- **నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్ కర్నూల్ (వంగూరు), ఆగస్టు 07(మనం ప్రతినిధి) :**సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలని నాగర్కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం ప్రత్యేకంగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, గ్రామ ప్రజలతో మమేకమై గ్రామ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై అదనపు కలెక్టర్, కొండారెడ్డిపల్లి ప్రత్యేక అధికారి దేవ సహాయంతో కలిసి నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కొండారెడ్డిపల్లిలో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా రోడ్ల విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, మిషన్ భగీరథ పైప్లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వంటి కీలకమైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా కృషి చేస్తుందన్నారు. గ్రామస్థుల అవసరాలను పరిగణలోకి తీసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపైనా సమీక్ష చేశారు. అర్హులైన లబ్ధిదారులకు అన్ని పథకాల లబ్ధి కలగాలని, ఎవ్వరూ మిగిలిపోకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులకు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వంటి ముఖ్యమైన పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.గ్రామ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టర్ వెంటనే సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఏ చిన్న ఓబులేసు, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, డిపిఓ శ్రీరాములు, పంచాయతీరాజ్ ఈఈ విజయ్, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, జిల్లా స్థాయి అధికారులు, గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రుద్రారం గ్రామంలో అర్ధరాత్రి పూజలు

- **రాత్రిపూట పూజలెందుకని ప్రశ్నించిన పొరుగువారు**
- **గొడవ జరిగి ఇద్దరికి తీవ్ర గాయాలు**
- **దర్యాప్తు చేపట్టిన పటాన్ చెరు పోలీసులు**



**రామచంద్రపురం, ఆగస్టు 7 (మనం న్యూస్):**సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రారం గ్రామంలో ఒక నిర్మాణంలో ఉన్న ఇంట్లో బీహార్కు చెందిన కుటుంబం బుధవారం అర్ధరాత్రి పూజలు చేసింది. వారి ఇంటి పక్కనే నివసించే దుర్గయ్య ఈ పూజల గురించి ప్రశ్నించాడు. ఇంట్లో చిన్న పిల్లలు ఉన్నారని, అర్ధరాత్రి పూజలు ఎందుకు చేస్తున్నారని వారిని అడగడంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహించిన బీహార్ కుటుంబం దుర్గయ్యపై ఇనుప రాడ్లతో దాడి చేశారు. దుర్గయ్యకు మద్దతుగా వచ్చిన హేమంత్, ఉమా లపైన దాడి చేశారు. ఈ దాడిలో దుర్గయ్య, హేమంత్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఉమా స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. హేమంత్ పరిస్థితి విషమంగా ఉందని, ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సంఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. అర్ధరాత్రి పూజలు, క్షుద్ర పూజలు కావచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై పటాన్చెరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థులు లక్ష్యాలపై దృష్టి పెట్టాలి

- **చెడు ఆలోచనలకు తావివ్వకుండా ఏకాగ్రతతో చదవాలి**
- **చట్టాలపై అవగాహన పెంచుకోవాలి**
- **హుస్నాబాద్ ఏసీపీ సొడరాపు సదానందం**




**హుస్నాబాద్, ఆగస్టు 7,(మనం న్యూస్):** విద్యార్థులు చెడు ఆలోచనలకు తావివ్వకుండా ఏకాగ్రతతో చదివి, లక్ష్యం పై దృష్టి పెట్టాలని హుస్నాబాద్ ఏసీపీ సొడరాపు సదానందం అన్నారు. హుస్నాబాద్ తెలంగాణ మోడల్ స్కూల్ లో మహిళల,బాలికల రక్షణ, సైబర్ నేరాల నివారణ, గుడ్ టచ్ - బాడ్ టచ్, డ్రగ్స్ (గంజాయి ఇతర మత్తు పదార్థాలు), సీ సీ కెమెరాలు, ఈవిటీజింగ్, నూతన చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. .

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుస్నాబాద్ ఏసిపి ఎస్.సదానందం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ, కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. బాల్య వివాహాలు మరియు దాని ప్రభావాలు, గుడ్ టచ్ - బాడ్ టచ్, ఈవిటీజింగ్, సోషల్ మీడియా వాడకం - లాభనష్టాలు, సైబర్ క్రైమ్స్ సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, డ్రగ్స్, గంజాయి వాడకం పరిణామాలు, డయల్ 100 ప్రాముఖ్యత, మహిళలు గృహహింస, వరకట్న హింస, శారీరక-మానసిక హింస, ఫోక్సో చట్టం, భరోసా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు, షీటీమ్ విధులు, అవగాహన, హ్యూమన్ ట్రాఫికింగ్ - నివారణ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ సెల్ఫ్ డిఫెన్స్, నేరాలపై అవగాహన జాగ్రత్తలు, అపరిచితుల నుండి రక్షణ, న్యూడ్ వీడియో కాల్స్, ఆన్లైన్ లోన్ మోసాల పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, షీటీమ్ వాట్సప్ నెంబర్: 8712667434, మహిళా పోలీస్ స్టేషన్, సిద్దిపేట: 8712667435 లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథం, ఉపాధ్యాయులు, షీటీమ్ మహిళా కానిస్టేబుల్ స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి





**నాగారం, ఆగస్టు 07(మనం న్యూస్):** ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను దైవచింతనను పెంపొందించు కోవాలి అని నాగారం మండల ఎస్సై అయిలయ్య అని అన్నారు. గురువారం నాగారం మండల లోని నరసింహులగూడెంలోని గ్రామస్తు లంతా ఐకమత్యంగా నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో పండుగ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. మండలంలో అన్ని గ్రామాలలో మహిళలు అమ్మవారికి సమర్పించే బోనం ఎత్తుకొని గుడి వద్దకు చేరుకొని మొక్కలను చెల్లించుకుని, సుఖసంతోషా లతో,పాడి పంటలతో అష్ట ఐశ్వర్యాలతో బాగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో తరాల ఆంజనేయులు,ఎల్లయ్య ప్రభాకర్,నరసయ్య,వెంకన్న, మల్లేష్,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు మహిళా సోదరీమణుల తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బహుళార్థ సాధక మార్కెటింగ్ కేంద్రాలతో ప్రయోజనమేంటి?

**తెలంగాణలో దీర్ఘకాలింగా పనిచేసేందుకు తీసుకుంటున్న చర్యలు**
**లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి**
**లిఖితపూర్వక సమాధానమిచ్చిన కేంద్ర మంత్రి దుర్గాదాస్ ఉయికె**



**ఖమ్మం, ఆగస్టు 7(మనం న్యూస్):** నూతనంగా 100 గిరిజన బహుళార్థ సాధక మార్కెటింగ్ కేంద్రాల స్థాపన ద్వారా గిరిజన వర్గాలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి గురువారం లోక్ సభలో ప్రశ్నించారు. తెలంగాణలో ఈ కేంద్రాలు దీర్ఘకాలికంగా పనిచేసేందుకు అనుసరిస్తున్న ప్రణాళిక ఏంటని అడిగారు. దీనికి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఊయికె లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గిరిజన వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం..గిరిజన బహుళార్థ సాధక మార్కెటింగ్ కేంద్రా( టిఎంఎంసీ)లు ఆచరణలోకి తెచ్చినట్లు మంత్రి తెలిపారు. గిరిజనుల ఉత్పత్తుల విక్రయానికి, మంచి మార్కెటింగ్ కేంద్రంగా ఉండాలని యోచిస్తున్నట్లు తెలిపారు. పంట కోత తర్వాత ఉత్పత్తి నష్టాలను తగ్గించడం, స్థానికంగా లభించే ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించడం, గిరిజన ఉత్పత్తిదారులకు సమిష్టి మార్కెటింగ్, రైతుల మధ్య మంచి సంబంధాలను ప్రోత్సహిస్తూ నూతన అవకాశాలను కల్పించడం లక్ష్యమని తెలిపారు. మార్కెట్ లింకేజీల ఏర్పాటు ద్వారా తెలంగాణతో సహా ఇలా ముందుకు..గిరిజన ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించేలా చూస్తామని కేంద్ర సహాయ మంత్రి తెలిపారు. తెలంగాణతో సహా అన్ని రాష్ట్రాల్లో.. అక్కడి ప్రభుత్వాల సహకారం తీసుకుంటూ దీర్ఘకాలికంగా ప్రభావవంతంగా పనిచేసేలా.. ప్రణాళికతో గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ముందుకు వెళుతున్నట్లు వివరించారు.

## జల్ జీవన్ మిషన్ స్కీం పర్యవేక్షణ పట్ల శ్రద్ధ వహించాలి



- **కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి, కమల్ కిషోర్ సోన్**
- **దిశ సమావేశాలు రెగ్యులర్‌గా నిర్వహించాలి**
- **వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**ఖమ్మం, ఆగస్టు 07(మనం బ్యూరో):** జల్ జీవన్ మిషన్ పథకం కింద సృష్టించిన మౌళిక వసతుల కల్పన పనుల పురోగతి నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ పై తెలంగాణ, ఝార్ఖండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల కలెక్టర్లతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర జల్ జీవన్ మిషన్ అదనపు కార్యదర్శి కమల్ కిషోర్ సోన్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్ పథకాలను పర్యవేక్షించేందుకు డాష్ బోర్డు ఏర్పాటు చేశారని, దీనికి సంబంధించిన లాగిన్ వివరాలను జిల్లా కలెక్టర్లు తీసుకుని వారి పరిధిలోని పనులను పకడ్బందీగా పర్యవేక్షించాలని అన్నారు. దిశ సమావేశాలు రెగ్యులర్ గా నిర్వహించి జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్‌పై సమీక్షలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశాల మినిట్స్ కాపీలను ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. తాగునీటి సరఫరా సోర్స్ బలోపేతం, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు తాగు నీటి సరఫరా వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్, జెడ్పీ సీఈఓ, ఈఈ మిషన్ భగీరథ లాగిన్ క్రియేట్ చేయడం జరిగిందని, గతి శక్తి కింద 2,571 కి.మీ. పనులు పూర్తి చేశామని అన్నారు. దిశ సమావేశాలు రెగ్యులర్ గా జరుగుతున్నాయని అన్నారు. తాగు నీటి బల్క్ సరఫరా పనులు పూర్తి అయ్యాయని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో తాగు నీటి సరఫరా పనులు కాకపోతే కొత్తగా మంజూరు చేసేందుకు అవకాశం పరిశీలించాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రాల్లో త్రాగునీటికి సంబంధించి ఎటువంటి పెండింగ్ పనులు ఉన్నా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు.ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఇ శేఖర్ రెడ్డి, ఇఇ పుష్పలత, వాణిశ్రీ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ సంఘీభావ ర్యాలీ

## పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు • వేలాది మంది విద్యార్థులు








**ఖమ్మం, ఆగస్టు 7(మనం బ్యూరో):** గాజాలో ఇజ్రాయేల్ చేస్తున్న జాతి హనన చర్యలకు వ్యతిరేకంగా పాలస్తీనా సంఘీభావ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రైవేట్ స్కూళ్ళు, కాలేజీల పిలుపు మేరకు వేలాది మంది విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు, సిపిఎం, సిపిఐ, మాస్ లైన్, న్యూ డెమోక్రసీ, కాంగ్రెస్, బి.ఆర్.ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనలో అగ్రభాగాన నడిచారు. వివిధ మైనారిటీ సంస్థలకు చెందిన మహిళలు, యువకులు జాతీయ జెండాలు, పాలస్తీనా జెండాలతో సంఘీభావం ప్రదర్శిస్తూ 'సేవ్ గాజా' అనే నినాదంతో హోరెత్తించారు. వివిధ ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు పెద్ద ఎత్తున ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ ర్యాలీలో నడిచారు. మార్చ్ ఫర్ హ్యూమానిటీ పేరుతో గాజాలో పాలస్తీనా జాతి హననానికి ఇజ్రాయెల్ చేస్తున్న దుశ్చర్యలను ఖండించారు. నెతన్యాహుని యునైటెడ్ నేషన్స్ యుద్ధ నేరస్తునిగా ప్రకటించిందనీ, ఇజ్రాయెల్ సైన్యాలు గాజాలో మానవతా సాయాన్ని కూడా అందకుండా చేస్తుందనీ, ఆహార పదార్థాలు, మందులు అందకుండా చేసి ఆకలి చావులకు గురిచేస్తుందనీ వివరించారు. ఆసుపత్రులు, స్కూళ్ళు నివాస స్థలాలపై బాంబులు కురిపించి వందలాది మంది డాక్టర్లను, వేలాది మంది పసిపిల్లలను చంపిన ఇజ్రాయెల్ చర్యలను ర్యాలీలో ఖండించారు. తక్షణమే యుద్ధాన్ని ఆపివేయాలనీ, గాజాలో ఆహార పదార్థాలు, మందులు, మానవతా సాయాన్ని పునరుద్ధరించాలనీ డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో ప్రైవేట్ స్కూళ్ళు, కాలేజీల నాయకులు మువ్వా శ్రీనివాసరావు, కాంతారావు, వీరారెడ్డి, శేషగిరి, మతీన్, రవిమారుత్, రమణారావు, ప్రసాద్, వెంకటేశ్వర రావు, ఐఎంఏ అధ్యక్షులు కంబంపాటి నారాయణ రావు, జి.వి.జగదీష్, రవీందర్, నాగమణి, గోపీనాథ్, రహానా, కృష్ణరావు, భారవి, న్యాయవాదులు జక్కంపూడి నాగేశ్వర రావు, తిరుమల రావు, శేషగిరి, విప్లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సిపిఐ కేంద్ర నాయకులు అజీజ్ పాషా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, కాంగ్రెస్ నాయకులు మొక్కా శేఖర్ గౌడ్, బి.ఆర్.ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి పి.నాగరాజు, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్రనాయకులు ఆవునూరి మధు, జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, జమాతే ఇస్లాం జిల్లా అధ్యక్షులు జైనుల్ పాష, మహ్మద్ ఇలియాస్, కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్ ప్రసంగించారు. ఈ ర్యాలీ నిర్వహణలో విద్యార్థి సంఘ నాయకులు రామకృష్ణ, వెంకటేష్, ప్రవీణ్, మస్తాన్లు యువజన సంఘాల నాయకులు బషీర్, శివరామ కృష్ణ, పుల్లయ్య, రాకేష్ మహిళా సంఘాల నాయకులు బండి పద్మ, పోటు కళావతి, ఝాన్సీ, లక్ష్మి పౌర హక్కుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, జర్నలిస్ట్ నాయకులు ఏనుగు వెంకటేశ్వర్లు, ఆది నారాయణ, చిర్రా రవి సంఘీభావ కమిటీ సభ్యులు కాకి భాస్కర్, విజయ్, బండారు రమేష్, ప్రసేన్, సీతారాం పాల్గొన్నారు.

# చేనేత రంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి

## అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, ఆగస్టు 7(మనం బ్యూరో):** చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన వేడుకలలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ చేనేత కార్మికులు ఉన్న ప్రాంతంలో తాను చిన్నతనంలో ఉన్నానని, మగ్గం వేయాలంటే చాలా ఓపిక ఉండాలని అన్నారు. రాష్ట్రంలో గద్వాల, నారాయణ పేట, సిరిసిల్ల వంటి ప్రాంతాల్లో మంచి నైపుణ్యత కలిగిన చేనేత కార్మికులు ఉన్నారన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో అగ్గిపెట్టెలో పట్టే చీర తయారు చేసే నాణ్యత గల చేనేత కార్మికులు కూడా ఉన్నారని అన్నారు. మన ముందుతరాలకు కూడా చేనేత వృత్తి పట్ల ఆకర్షితులయ్యేలా చూడాలని, మారుతున్న కాలాన్ని బట్టి సాంకేతికతను అంది పుచ్చుకోవాలని అన్నారు. చేనేత రంగాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. చేనేత రంగం కార్మికులకు సహాయం చేసేందుకు ప్రభుత్వం తెలంగాణ నేతన్న పొదుపు పథకం, తెలంగాణ నేతన్న భద్రత పథకం, తెలంగాణ నేతన్న భరోసా పథకం, తెలంగాణ నేతన్న రుణమాఫీ పథకం వంటి వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. చేనేత రంగం చెందిన వారికి శిక్షణ అందించి మరింత మెరుగైన ఆదాయం సంపాదించుకునేలా ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చేనేత రంగం ఉందని, ఇది ఒక రకమైన కళ అని అన్నారు. చేనేత చీరలకు మంచి డిమాండ్ ఉంటుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగాలని అదనపు కలెక్టర్ సూచించారు. అనంతరం చేనేత కార్మికులకు, నేతన్నలను, చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు యం .విజయలక్ష్మీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో ఐదు పతకాలు




**పాల్వంచ, ఆగస్టు 7(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో జనగామలో బుధవారం ముగిసిన రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటిలలో భద్రాద్రి కొత్తగుడెం జిల్లా అథ్లెట్లు 15 మంది పాల్గొని ఐదు పతకాలు సాధించారని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మహీధర్ తెలిపారు. ఇందులో 2 బంగారు పతకాలు, 1 రజిత పతకం, 2 కాంశ్య పతకాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరి సారంగపాణి, జాతీయ చీఫ్ కోచ్, ద్రోణాచార్య అవార్డు గ్రహిత నాగపురి రమేశ్ విజేతలు, కోచ్ లు నాగేందర్, ప్రసాద్, శ్వేత, మల్లికార్జున్, వీరభద్రం లను అభినందించారు.

# సహజ సిద్ధమైన రాఖీలతో రక్షాబంధన్ నిర్వహించుకోవాలి

- **జిల్లా కలెక్టర్ పమెల సత్పతి**



**కరీంనగర్ ఆగస్టు 7(మనంప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ తొ తయారు చేసినవి కాకుండా సహజ సిద్ధమైన రాఖీలను కట్టి రక్షాబంధన్ వే డుకలు నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేల సత్పతి తెలిపారు. రక్షాబంధన్ పండుగను పురస్కరించుకొని యువ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ఆవరణలో (ఎకో ఫ్రెండ్లీ రాఖీ ) పర్యావరణహిత రాఖీ కలెక్టర్ పమేలా సత్పతి కీ రాఖీ కట్టి అందించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమెల సత్పతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చిగ్రామీణ ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి వినాయకులను ప్రతిష్టించి రసాయనలతో తయారైన ప్రతిమలతొ ఎంతో ప్రమాదకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు రాష్ట్ర ఉత్తమ యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జక్కని సాయిరాం3, సభ్యులు గొట్టే ముక్కుల సుష్మిత రెడ్డి,గోపు కిరణ్మయి రెడ్డి, సాహితి, సాత్విక పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలి

### కేంద్ర బృందం సభ్యులు



**పాల్వంచ, ఆగస్టు 7(మనం న్యూస్):** పాయకారి యానంబైలు గ్రామపంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కేంద్ర బృందం గురువారం పర్యటించింది. కేంద్ర బృందం సభ్యులు కె. జయంత్, ఎస్.రవిచంద్ర (రీసెర్చ్ ఇన్వెస్ట్ గేటర్స్) పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ప్రభుత్వ కార్యాలయాలు, గుడి/ చర్చి, గ్రామంలో పారిశుద్ధ్యం, చెత్త సేకరణ మరియు నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం, చేతుల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యల లో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి, ఎస్ బి ఎం కన్సల్టెంట్ రేవతి, ఎంపీఓ చెన్నకేశవరావు, ఏపీవో పోరండ్ల రంగా, టెక్నికల్ అసిస్టెంట్ సైదులు, కార్యదర్శులు మధు, శ్రీనివాస్, బాబురావు, దేవ్ సింగ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

# చేనేత వస్త్రాల గౌరవం ఎప్పటికీ తగ్గదు




- **నేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తాం**
- **చేనేత కార్మికులకు హెల్త్ క్యాంపులు**
- **కార్మికులందరికీ హెల్త్ కార్డులు, బీమా**
- **జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, ఆగస్టు 7(మనంప్రతినిధి):** చేనేత వస్త్రాల గౌరవం ఎప్పటికీ తగ్గేది కాదని, నేత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ వరకు నేత కార్మికులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే ఈ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చేనేత కార్మికులకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఉచిత పరీక్షలు చేయిస్తామని అన్నారు. ప్రతి కార్మికునికి ఆరోగ్య కార్డు అందించి సంవత్సరంలో నాలుగు సార్లు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్యశ్రీ ద్వారా పది లక్షల రూపాయల ఉచిత వైద్య సహాయాన్ని కూడా పొందవచ్చని తెలిపారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో చేనేత మహిళా కార్మికులు ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా లభించే బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి మాత్రలు తీసుకోవాలని అన్నారు. నేత కార్మికులు కోరిన రుణాలు, గురుకులాల్లో వారి పిల్లలకు సీట్లు కేటాయింపు వంటి అంశాలను ప్రభుత్వానికి విన్నవిస్తామని అన్నారు. నేత కార్మికుల్లో అర్హులు ఉంటే కచ్చితంగా ఇందిరమ్మ మంజూరు చేస్తామని అన్నారు.

అనంతరం జిల్లా నుండి చేనేత పురస్కారాలు అందుకున్న పలువురు నేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. చేనేత కార్మిక సంఘాలకు రుణాల మంజూరు చెక్కులు అందజేశారు. కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శనను కలెక్టర్ సందర్శించి నేత వస్త్రాలను పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన సాంప్రదాయ చేనేత మగ్గాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు విద్యాసాగర్, పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు వాసాల రమేష్, వివిధ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పద్మశాలి సంఘం నాయకులు, నేత కార్మికులు పాల్గొన్నారు

## స్వాతంత్ర్య దిన వేడుకల ఏర్పాట్లపై సమీక్ష




**రామగిరి, ఆగస్టు 07 (మనం న్యూస్):** 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలఏర్పాట్లపైరామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు సంబంధిత అధికారులతో గురువారం జీ.యం కార్యాలయం నందు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆగస్టు 15న నిర్వహించే 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జి.ఎం కార్యాలయాల ఆవరణలో ఘనంగా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మొదట జాతీయ జండా ఆవిష్కరణ, సెక్యూరిటీ సిబ్బంది చే గౌరవ వందనం అనంతరం ఏరియా నుండి ఎంపికైన ఉత్తమ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమము, తదుపరి పాఠశాల విద్యార్థిని విద్యార్థులచే సాంస్క ృతిక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు తెలిపారు. వేడుకలకు వచ్చే వారికి కావలసిన ఏర్పాట్లు చేయాలని ఏరియా అధికారులకు సూచించారు. అలాగే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతమయ్యేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర బాబు, ఎస్వోటుజియంలు బండి సత్య నారాయణ, యం.రామ్మోహన్, ప్రాజెక్ట్ అధికారులు సి.హెచ్. వెంకటరమణ, జె.రాజశేఖర్, ప్రవీణ్ వి పాంటింగ్, విభాగాధిపతులు భాను ప్రసాద్ రావు, డి.జనార్దన రెడ్డి, రాజేంద్ర కుమార్, బి.వి.సత్యనారాయణ, కాశీ విశ్వేశ్వర రావు, బి.సుదర్శనం, కళ్యాణ్ చక్రవర్తి, ఉదయ్ భాస్కర్, చంద్రశేఖర్ లతో పాటు వివిధ విభాగాల అధిపతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాల నెపంతో గ్రామస్తుల దాడి

### యువకుడి మృతి

**ఆళ్లపల్లి, ఆగస్టు 7(మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలోని బూసరాయి గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. మంత్రాల నెపంతో మడకం బీడ(35)పై గ్రామస్తులు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్ర గాయాల పాలై యువకుడు మృతిచెందాడు. ఇది పూర్తిగా గొత్తికోయల గ్రామం. మంగళవారం ఓ మహిళ మృతిచెందింది. రాజు మంత్రాలు చేస్తుండడంతోనే మహిళ మృతిచెందిందని కొంతమంది గ్రామస్తులు భావించారు. యువకుడిపై దాడి చేయడంతో మృతిచెందాడు. సమాచారం అందుకున్న సిఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ సోమేశ్వర్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం

- జిల్లా కలెక్టర్ విజయేందిర
- పాత పాలమూరు అర్బన్ హెల్త్ సెంటర్ లో తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అవగాహన



మహబూబ్ నగర్, 07ఆగస్టు, (మనం బ్యూరో): తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం తల్లిపాల వారోత్సవాల లో బాగంగా పాత పాలమూరు అర్బన్ హెల్త్ సెంటర్ లో నవోదయ నర్సింగ్ కాలేజి విద్యార్థినిలు నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిశువు ఆరోగ్యానికి తల్లి పాలు ఎంతో శ్రేష్ఠమని అన్నారు.ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం అప్పుడే పుట్టిన శిశువు కు కేవలం 40 శాతం తల్లులు మాత్రమే తల్లి పాలు ఇవ్వడం జరుగుతుందని,ఇది తీవ్రమైన విషయంగా భావించాలి అన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టాలి. తల్లి పాలే శిశువులకు మొదటి ఆరు నెలల వరకు ఉత్తమమైన ఆహారం. 50 శాతం మంది తల్లులు మొదటి ఆరు నెలలు తల్లి పాలు ఇవ్వడం లేదని తెలిపారు. తల్లి - బిడ్డ ఆరోగ్యానికి కానీసం 6 నెలల వరకు కేవలం తల్లి పాలు పట్టాలి. తల్లి పాలల్లో శిశువు ఎదుగుదలకు అవసరమైన అన్ని పోషకాలు ఉంటాయి. తల్లి పాల వల్ల శిశువులకు రోగనిరోధక శక్తి పెరుగుతుంది, అంటువ్యాధుల నుండి రక్షణ లభిస్తుంది. తల్లులు కూడా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తల్లి పాలు ఎంతో అవసరం. ప్రభుత్వాలు , ఆరోగ్య సంస్థలు తల్లి పాల ప్రాముఖ్యతను తెలియజేయడానికి, తల్లి పాల సంస్క ృతిని ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో నర్సింగ్ విద్యార్థినిలు,తల్లులు పాల్గొన్నారు. అనంతరం పాత పాలమూరు లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ముగ్గు పోసుకున్న లబ్ధిదారు చిత్ర తో మాట్లాడి ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమం లో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

- చేనేత కార్మికులతో ర్యాలీ నిర్వహణ
- మారుతున్న కాలానికనుగుణంగా చేనేత డిజైన్‌లు రూపొందించాలి: జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



మహబూబ్ నగర్, 07ఆగస్టు, (మనం బ్యూరో): మారుతున్న కాలాని కనుగుణంగా చేనేత కార్మికులు చేనేత ఉత్పత్తులు డిజైన్ లు రూపొందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు.గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరం లో ఏర్పాటు చేసిన సమావేశం లో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా గద్వాల,నారాయణ పేట,అమరచింత,కొత్తకోట లు చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి గాంచినట్లు ఆమె తెలిపారు.మహబూబ్ నగర్ జిల్లా నుండి కంబళ్ల ను, షాల్స్ ను తయారు చేస్తున్నారని,జిల్లాను కూడా చేనేత ఉత్పత్తులలో ప్రముఖంగా నిలిపేలా కొత్త డిజైన్ లతో చేనేత వస్త్రాలు తయారు చేయాలని సూచించారున ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని తెలిపారు.చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ధరించాలని,కనీసం వారం కు ఒక రోజు చేనేత వస్త్రాలను ధరించాలని కోరారు. మహిళలు మాత్రమే కాకుండా పురుషులు కూడా చేవేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ధరించాలని అన్నారుచేనేత వస్త్రాలను ఎక్కువగా కొనడం వలన అందుబాటులో ధరలు వస్తాయని, చేనేత కార్మికులకు ప్రోత్సాహం ఉపాధి లభిస్తుందని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహ రెడ్డి మాట్లాడుతూ చేనేత వృత్తి కాదు ఒక గొప్ప కళ అన్నారు.గొప్ప కళ అయిన చేనేత వృత్తిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని,చేనేత వస్త్రాలను ధరించి చేనేత కార్మికులకు అండగా నిలువాలని ఆయన అన్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనితా రెడ్డి మాట్లాడుతూ రెడ్డి చెవేత వస్త్రాలను ధరించాలని,నేత కార్మికులకు ప్రోత్సాహం అందించాలని అన్నారు.వారం లో ఒక రోజు అధికారులు,ఉద్యోగులు చేనేత వస్త్రాలు దరించేలా ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.16 మంది సీనియర్ చేనేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన,వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్ లు అంద చేశారుసమావేశం లో నేతన్న పొదుపు,భద్రత కింద 11,48,800 రూ.లు చెక్కును చేనేత సంఘాలకు అంద చేశారు.కార్యక్రమం లో జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, డి. ఈ. ఓ ప్రవీణ్ కుమార్,డి.పి.అర్. ఓ శ్రీనివాస్,జిల్లా గిరిజన అభివృద్ది అధికారి జనార్ధన్,జిల్లా క్రీడలు,యువజన అధికారి శ్రీనివాస్ ,ఎస్.సి.కార్పొరేషన్ ఈ. ఓ సంతోష్,చేనేత జౌళి శాఖ డి. ఓ రాజేష్ బాబు, ఏ.డి. ఓ లావణ్య,సిబ్బందితదితరులు పాల్గొన్నారు

### చేనేత ర్యాలీ నిర్వహణ

తొలుత జిల్లా కలెక్టరేట్ గేటు నుండి చేనేత కార్మికులు ప్లా కార్డులు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయం లో చేనేత స్టాల్ ను ఏర్పాటు చేశారు.

# కొండారెడ్డిపల్లి అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి
- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై స్పష్టమైన దృష్టి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ
- అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు



కల్వకుర్తి ఆగస్టు 07(మనం న్యూస్): కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి పనుల పట్ల అధికారులు వేగం పెంచి ప్రత్యేక శ్రద్ధ వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. గురువారం కల్వకుర్తి డివిజన్ పరిధిలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామ గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు, గ్రామ ప్రజలతో మమేకమైయి గ్రామ అభివృద్ధి,ప్రభుత్వ సంక్షేమ పథకాలపైన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ కొండారెడ్డిపల్లి ప్రత్యేక అధికారి దేవ సహాయంతో కలిసి ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి పనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించిగ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ముఖ్యంగా అధికారులు గ్రామంలో రోడ్ల విస్తరణ,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,సెంట్రల్ లైటింగ్, మిషన్ భగీరథ పైప్లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో అర్హులైన ప్రతిఒక్కరికి కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇల్లు వంటి కీలకమైన సంక్షేమ పథకాలను అందించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థుల అవసరాలను పరిగణలోకి తీసుకొని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇల్లు వంటి ముఖ్యమైన పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్డిఏ చిన్న ఓబులేసు, కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి, డిపిఓ శ్రీరాములు, పంచాయతీరాజ్ ఈఈ విజయ్,మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్,జిల్లా స్థాయి అధికారులు,గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాకు విఫల యత్నాలు

## బాధిత రైతులపై తప్పుడు కేసులు నమోదు



- జిల్లా ఎస్పీకి బాధితుల ఫిర్యాదు



మహబూబ్నగర్, ఆగస్టు 7 (మనం న్యూస్): మహబూబ్నగర్ జిల్లా నవాబ్పేట మండలం చౌడూర్ గ్రామానికి చెందిన రైతులు కొంతకాలంగా తమ భూములను కాపాడుకునేందుకు న్యాయ పోరాటం చేస్తున్నారు. వీరంతా సుమారు 50 ఏళ్లుగా సాగు చేస్తున్న భూములపై స్థానికంగా ప్రభుశాలి వ్యక్తుల ఆధ్వర్యంలో అక్రమ కబ్జా యత్నాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా తమపై తప్పుడు కేసులు నమోదు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిజ్జల శ్రీనివాసులు, భామిని శ్రీనివాస్, తదితరులు కలిపి 8 మంది రైతులు వివరించిన ప్రకారం - సర్వే నెం. 340, 341 లో ఉన్న భూములను వారు 1975, 1978 సంవత్సరాల్లో ధ్రువమైన డాక్యుమెంట్ల ఆధారంగా కొనుగోలు చేసి అప్పటి నుండి కాస్తూ వస్తున్నారు. అయితే ఇటీవల కొంతమంది వ్యక్తులు - సుంకరి చంద్రశేఖర్, చౌడూర్ గోపాల్, ఆకుల అమరేష్, ఇతరులతో కలిసి - వారి భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి, కడీలు విరగొట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇంతటితో ఆగకుండా, నవాబ్పేట పోలీస్ స్టేషన్లో తప్పుడు ఎఫ్ఐఆర్ (నెం. 205/2025) నమోదు చేయించినట్లు పేర్కొన్నారు. ఇదంతా జడ్చర్ల ఎమ్మెల్యే సోదరుడు జనంపల్లి దుశ్యంత్రెడ్డి మద్దతుతో జరుగుతోందని బాధితుల ఆరోపణ. గ్లోబ్లెన్ హాస్పిటాలిటీ ఎల్ఎల్పి అనే కంపెనీ పేర మీద ఇటీవలే కొంత భూమిని రికార్డు ఆధారంగా కొనుగోలు చేసినప్పటికీ, దానికి భౌతికంగా కబ్జా లేదని చెప్పారు. దుశ్యంత్ రెడ్డి, పంజం సంజీవరెడ్డి, పూతలపట్టు విష్ణుకాంతులు అనే డైరెక్టర్లు ఉన్న కంపెనీ, రైతులు కబ్జాలో ఉన్న భూమిని కొనుగోలు చేసినట్లు వివరించారు. భూమి వివాదంలో భాగంగా స్థానిక ఎస్త్ర ఆధ్వర్యంలో తప్పుడు కేసులు నమోదు చేసిన పోలీసులు, అలాగే కబ్జా ప్రయత్నంలో ఉన్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితులు మహబూబ్నగర్ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్కు ఫిర్యాదు చేశారు. బాధితులు తమకు రక్షణ కల్పించాలని, న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కేంద్ర మంత్రి వీరేందర్ కుమార్‌ను కలసిన మంత్రి అడ్లూరి

## వికలాంగుల పెన్షన్ 300 రూపాయలు నుండి 3000 వేలకి పెంచి,వికలాంగుల కి పెన్షన్ అర్హత నీ 80% నుండి 40% కి తగ్గించాలి

## బాల్యం నుంచే వికలాంగుల కి పెన్షన్ ఇవ్వాలి,వికలాంగులకి ఇచ్చే ఉచిత పరికరాలు 40% బెంచ్ మార్క్ వైఖల్యం కే ఇవ్వాలి

జగిత్యాల ఆగస్టు 07 (మనం న్యూస్): డిల్లీలో కేంద్ర మంత్రి డాక్టర్ వీరేందర్ కుమార్ ను శాస్త్రి భవన్లోని మంత్రి కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ఎస్.సి. ఎస్.టి. మైనారిటీ, వికలాంగుల,వయో వృద్ధుల, ట్రాన్స్ జెండర్ ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మర్యాద పూర్వకంగా కలిసి వికలాంగుల సంక్షేమం కొరకు పలు అంశాల ను వారికి విన్నవించి వినతి పత్రాన్ని అందజేశారు.

**ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ**

18 సం.నుండి 79 సం. వరకు ఉన్న వికలాంగుల కి 300 రూపాయలు పెన్షన్, 80 సం ఆ పైనా ఉన్న వికలాంగుల కి 500 రూపాయలు పెన్షన్ నీ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నది అని 2014 నుండి బీజేపీ కేంద్రం లో అధికారం లోకి వచ్చాక ఒక్క రూపాయి కూడా పెంచలేదని గుర్తు చేశారు ఇప్పుడు ఈ 300 రుపాయలు వికలాంగుల ప్రాదమిక అవసరాలకి ఏమాత్రం సరిపోదని ఈ పదేండ్లలో నిత్యావసర వస్తువులు ధరలు 500 ల రెట్లు పెరిగాయి అని ఇప్పుడు కేంద్రం ప్రవేశ పెడుతున్న బడ్జెట్ కూడా దాదాపు 20 లక్షల కోట్లు దాటిందని, వికలాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం వికలాంగుల కి 5%బడ్జెట్ అనగా 1 లక్ష కోట్ల రూపాయిలు వస్తుందని ఈ మొత్తం కేటాయించి దేశ వ్యాప్తంగా ఉన్న వికలాంగుల పెన్షన్ కనీసం 3000 రూపాయలుకి పెంచాలి అని కోరారు ప్రస్తుతం 80% వైఖల్యం ఉంటేనే పెన్షన్ ఇస్తున్నారు అని,18 ఏండ్లు నిండితేనే పెన్షన్ ఇస్తున్నారు దఅని ఇది సరియైన విధానం కాదు అని ఇది పార్లమెంట్ యాక్ట్ వికలాంగుల హక్కుల చట్టం -2016 కి విరుద్ధం అని ఈ చట్టం ప్రకారం 40 % బెంచ్ మార్క్ వైఖల్యం కి అన్నీ సంక్షేమ పథకాలు కి అర్హులు అని తెలంగాణ రాష్ట్రంలో మేము 40%కే



పెన్షన్ ఇస్తున్నాము అని,వికలాంగులుగా పుట్టగానే వైఖల్య ధ్రువీకరణ పత్రం ఇచ్చి, 4016 పెన్షన్ ఇస్తున్నాము అని త్వరలో నే ఈ పెన్షన్ 6000 కి పెంచుతాం అని కేంద్రం కూడా తెలంగాణ నీ రోల్ మోడల్ గా తీసుకోని మార్పులు చేయాలి అని కోరారు తెలంగాణలో వికలాంగుల కార్పొరేషన్ ద్వారా అందించే ఉచిత సహాయ ఉపకరణాలు దేశం లో ఎక్కడ లేని విదంగా 40% వైకల్యం కే ఇస్తున్నాము అని కేంద్రం కూడా 40%వైకల్యం కే వికలాంగుల పరికరాలు ఇవ్వాలి అని విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- విధుల పట్ల వైద్యులు నిర్లక్ష్యం వహించరాదు...
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలి...
- నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్...
- వంగూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ...



కల్వకుర్తి రూరల్ ఆగస్టు 07(మనం న్యూస్): ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు.గురువారం కల్వకుర్తి డివిజన్ పరిధి వంగూర్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధుల నిర్వహణ, వైద్య సిబ్బంది హాజరు,సేవల నాణ్యత వంటి అంశాలను సమీక్షించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు సమయానికి విధుల్లో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరగాలంటే, వైద్యులు నిర్లక్ష్యంగా కాకుండా సమయపాలన పాటించి క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆసుపత్రిలో ఔషధ నిల్వలను ఈడిడి రిజిస్టర్ను పరిశీలించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచడానికి సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు.గర్భిణీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పౌష్టికాహారం, వ్యాయామం,వైద్య పరీక్షలపై సిబ్బంది అవగాహన కల్పించడంతో పాటు ఎఎన్ సి పరీక్షలు సకాలంలో నిర్వహించాలని ఆదేశించారు. సాధ్యమైన మేరకు గర్భిణీలకు సాధారణ ప్రసవాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని గ్రామీణ మహిళలకు భద్రతతో కూడిన ఆరోగ్య సంరక్షణను అందించడం మేలైన మార్గమని సూచించారు.

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జ్వరం,జలుబు,దగ్గు వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే రోగులందరికీ వైద్యులు రక్తపరీక్షలు నిర్వహించి డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణకు అవసరమైన పరీక్షలపైనా దృష్టి సారించాలని అన్నారు. రోగులకు పాజిటివ్ రిపోర్టులు వచ్చినపుడు వాటిని నిర్ధారించేందుకు ఎలిజా పరీక్షల కోసం టి హబ్కు రక్త నమూనాలు పంపించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ప్రతి రోగికి సరైన చికిత్స అందించడానికి, అనుమానాస్పద కేసులను వెంటనే పైస్థాయి పరిశోధనలకు పంపడం అవసరమని అత్యవసర పరిస్థితుల్లో రోగులకు చికిత్స అందించేందుకు సంబంధిత ఔషధాలు,వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాము కాటు,కుక్క కాటు వంటి ప్రమాదాలకు సంబంధించి వ్యాక్సిన్లు క్రమంగా నిల్వలో ఉంచాలని ఆదేశించారు.ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల వైద్య సేవలపై విశ్వాసం పెరగాలంటే ప్రతి ఆరోగ్య కేంద్రం బాధ్యతతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఉందన్నారు. విధుల పట్ల వైద్యులు అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆసుపత్రి వైద్యులు సిబ్బంది ఉన్నారు.

## హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

# రూ.10,000/- జరిమానా

### కీలక తీర్పును వెలువరించిన ఒకటవ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి నారాయణ

### నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరు: ఎస్పీ

జగిత్యాల ఆగస్టు 07 (మనం ప్రతినిధి):జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తారకరామ నగర్ కు చెందిన జగన్నాథం సమ్మయ్య వయస్సు 40 సంవత్సరాలు, బల్లని సారయ్య వయస్సు 29 సంవత్సరాలు మరికొందరు కలిసి తాటిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతుండేవారు చాలా రోజుల నుండి జగన్నాథ సమ్మయ్య పేకాటలో డబ్బులు గెలుస్తూ ఉండేవాడు. పేకాటలో జగన్నాథ సమ్మయ్య దగ్గర ఎలాగైనా గెలవాలని సారయ్య మరియు అతని మేనల్లుడు (మైనర్ బాలుడు) తో కలిసి తేదీ 28-8-2021 రోజున మధ్యాహ్నం 2 గంటల సమయంలో సారయ్య అతని బండి మీద సమ్మయ్యను ఎక్కించుకొని టి.అర్.నగర్ నుండి కోరుట్ల కి వెళ్లి అక్కడ పేకాట ఆడటం జరిగింది ఇట్టి పేకాటలో ప్రతిసారి సమ్మయ్య గెలవడం జరిగింది. ప్రతిసారి సమ్మయ్య గెలవడం తో అతనిపై కక్ష పెంచుకొని అతనిని ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో పథకం ప్రకారం మరొక చోట పేకాట ఆడదామని సమ్మయ్యను బండి మీద ఎక్కించుకొని తాటిపల్లి గ్రామ శివారులో గల పెద్దయ్య చెరువు కట్ట వద్ద కు వచ్చాక అనుకున్న పథకం ప్రకారం అక్కడ ఉన్న ఒక బండ రాయితో సమ్మయ్య తలపై కొట్టడం జరిగింది. సమ్మయ్య చనిపోయాడని నిర్ణయించుకున్నాక అతని జేబులో ఉన్న 5000 రూపాయలు తీసుకొని అతని చెరువులో తోసి వేసి అక్కడ నుండి వెళ్లడం జరిగింది. మృతుని యొక్క తమ్ముడు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్లో తన యొక్క అన్న కనబడడం



లేదని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన అప్పటి ఎస్.ఐ చిరంజీవి మరియు ఇన్స్పెక్టర్ కృష్ణ కుమార్ దర్యాప్తు చేసి సమ్మయ్యను చంపింది బాల్మూరి సారయ్య వయస్సు 29 సంవత్సరాలు, అతని మేనల్లుడు (మైనర్ బాలుడు) అని గుర్తించి వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు హాజరు పరచగా సాక్ష్యులను విచారించిన న్యాయమూర్తి అదనపు సెషన్స్ జడ్జి శ్రీ నారాయణ గారు నిందితుడు సారయ్య వయస్సు 29 సంవత్సరాలు పై నేరం రుజువు కావడంతో అతనికి జీవిత ఖైదుతో పాటు, రూ.10000 రూపాయల జరిమాన విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా ఎస్పి అశోక్ మాట్లాడుతూ ... సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించు కోలేరని పోలిసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. పై కేస్ లో నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అడిషనల్ పీ.పీ మల్లేశం గారు, అప్పటి ఇన్వెస్టిగేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణ కుమార్, ఎస్.ఐ చిరంజీవి, ఎస్.ఐ శ్రీకాంత్, కోర్ట్ కానిస్టేబుల్ నరేష్ మరియు కానిస్టేబుల్స్ రాజు లను జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్ ప్రత్యేకంగా అభినందించారు. కేసులో ఎ 2 మైనర్ కావడంతో అతని పై జువెనల్ కోర్టు లో విచారణ జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలి

- **లేనిచో వారం రోజుల్లో సమ్మె తప్పదు**
- **బిఎల్ టీయు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్**

**నిజామాబాద్, ఆగస్టు 07 (మనం బ్యూరో) :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఔట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ (బిఎల్ టీయు) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ హెచ్చరించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ లో బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్ టీయూ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ., ఎస్సీ, ఎస్టీ బిసి, మత మైనారిటీలకు చెందిన ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ, తమ ఆరోగ్యాలు బాగోలేకపోయినా తెల్లవారుజామున నాలుగు గంటలకు నిద్రలేచి నగర వీధులను, డ్రైనేజీలను శుభ్రం చేసే శానిటేషన్ కార్మికులు, జవాన్లు, డ్రైవర్లు మరోవైపు ఉదయం ఐదు గంటలకు నగర ప్రజలకు మంచి నీళ్లు సకాలంలో అందించే వాటర్ సప్లై కార్మికులు, వీధులను కాంతివంతంగా ఉంచే స్ట్రీట్ లైట్స్ కార్మికులు, ఉదయం ప్రజలు తమ ఆరోగ్యం కోసం వాకింగ్ చేసేందుకు పార్కులను పచ్చగా ఉంచే గార్డెన్స్ కార్మికులు ఈ విధంగా మున్సిపల్ కార్పొరేషన్లో వివిధ రకాలుగా సేవలు అందిస్తున్నా మున్సిపల్ కార్మికులు ఉన్నారన్నారు.ఇలాంటి



ఉన్నతమైన శ్రామికులకు చట్టం ప్రకారం ఇవ్వాల్సిన పండగ సెలవులు, జాతీయ సెలవులు, అంబేడ్కర్ జయంతి, గాంధీ జయంతి, అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) నాడు కూడా సెలవులే లేని ఏకైక శ్రామికులు మున్సిపల్ కార్మికులే అన్నారు. ఇలాంటి శ్రామికుల సేవకు లక్ష రూపాయల వేతనం ఇచ్చినా తక్కువేనని అన్నారు. కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పును బుట్టదాఖలు చేసి మున్సిపల్ కార్మికుల శ్రమ దోపిడికి పాల్పడుతున్నాయాని విమర్శించారు. గత సంవత్సరం నుండి మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎల్టీయూ) ఆధ్వర్యంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు అనేక సార్లు వినతులు సమర్పించిన స్పందించడంలేన్నారు.ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడంలో కార్పొరేషన్ వివక్ష చూపుతున్నందుకు నిరసనగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్లో ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ లకు వినతి పత్రం ఇవ్వాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ నిర్ణయంలో భాగంగా గురువారం ధర్నా నిర్వహించామన్నారు.

కార్మికులు ఎదుర్కొంటున్న 15 రకాల ససమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఎల్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ సిద్ది రాములు, బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్ టీయూ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి మేకల రాజేందర్, నగర అధ్యక్ష, కార్యదర్శి వై. అనిల్ కుమార్, గంగా శంకర్, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు లక్ష్మణ్, నాయకులు నవీన్, జవాన్స్ యూనియన్ అధ్యక్షులు కె.వెంకటస్వామి, నాయకులు ప్రవీణ్,రాము, వాటర్ సప్లై యూనియన్ అధ్యక్షులు కొమ్ము రాహుల్, నాయకులు ఆర్. మురళి, శ్రీశైలం రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ కమిషనర్ రవి బాబు ను తక్షణమే సస్పెండ్ చేయాలని మున్సిపల్ కార్మికులు వర్షంలో తడుస్తుంటే ఆయన రెయిన్ కోట్ పైన కార్మికుడితో గొడుగు పట్టించుకోని ఒక పెత్తందారీ లాగా వ్యవహారించిన డిప్యూటీ కమిషనర్ విషయాన్ని బిఎల్ టీయూ నాయకులు ప్రశ్నిస్తే తాను డబ్బులిచ్చి నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు వచ్చానని చెపుతున్న విషయంపై జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ లు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# గర్గుల్ పల్లె దవాఖానను సందర్శించిన జిల్లా కలెక్టర్..



**కామారెడ్డి రూరల్, ఆగస్టు 07 (మనం న్యూస్) :** కామారెడ్డి మండలంలోని గర్గుల్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లోని మౌలిక వసతులను, రోగులకు అందుతున్నటువంటి వైద్య సేవలను గురించి ఆరా తీశారు. రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

ఆయుష్మాన్ ఆరోగ్య భవనానికి విద్యుత్ సరఫరా గురించి వెంటనే చర్యలు చేపట్టాలని, అలాగే నీటి వసతికి కావలసిన ఏర్పాట్లు చేయాలని గ్రామ కార్యదర్శిని, ఎంపీడీవోను ఆదేశించారు. రాత్రి వేళల్లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవన సముదాయ ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు వారిని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి వచ్చే రోగుల ఔట్ పేషంట్ వివరాలు రోజువారీగా నివేదికలు రిజిస్టర్ లో (సంగ్రహము) అబ్స్ట్రాక్ట్ రూపంలో వ్రాసి పెట్టాలని సూచించారు.

కావలసిన మౌలిక సదుపాయాల గురించి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. చంద్రశేఖర్, జిల్లా ఉపవైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి దోమకొండ డాక్టర్ ప్రభు దయా కిరణ్, మండల వైద్యాధికారి డాక్టర్ జోహార్ ఇతర వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్ జిల్లా కలెక్టర్
టి. వినయ్ కృష్ణారెడ్డి

**నిజామాబాద్, ఆగస్టు 07 (మనం బ్యూరో) :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శ్రీరాంసాగర్ పరీవాహక ప్రాంతంతో పాటు నదులు, వాగుల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ప్రజలకు సూచించారు. అవసరం అయితే



తప్ప ఇళ్ల బయటకు ఎవరూ రాకూడదని హితవు పలికారు. చేపల వేట, ఈత సరదా కోసం చెరువులు, కాల్వలు, కుంటలు, ఇతర జలాశయాల వద్దకు వెళ్లకూడదని సూచించారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ఉండేందుకు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, తక్షణ పర్యవేక్షణ చేపట్టాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల వల్ల ఎక్కడైనా ప్రమాదం ఎదురైనా, లేక అత్యవసర పరిస్థితులు ఏర్పడి సహాయక చర్యలు అవసరమైన పక్షంలో కలెక్టరేట్ లో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08462 - 220183 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని సూచించారు.

# సమన్వయంతో పనిచేస్తూ మంచి ఫలితాలను సాధించాలి



రాష్ట్ర ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేక అధికారి
దాసరి ఒడ్డెన్న

**నిజామాబాద్, ఆగస్టు 07 (మనం బ్యూరో) :** అధ్యాపకులు సమన్వయంతో పనిచేస్తూ మంచి ఫలితాలను సాధించాలని రాష్ట్ర ఇంటర్ బోర్డు జిల్లా ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న ఆదేశించారు. గురువారం నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., ప్రభుత్వ కళాశాలలో చేరిన విద్యార్థుల అభ్యున్నతికి అన్ని సబ్జెక్టుల అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కళాశాల ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నందున యూనిట్ టెస్టులను నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శ్రద్ధ వహించాలన్నారు. ఇంటర్ బోర్డు సూచించిన టైం టేబుల్ ప్రకారం తరగతులు నిర్వహించాలని, ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని ఆదేశించారు. కళాశాలకు గైర్హాజరయ్యే విద్యార్థుల సమాచారం తల్లిదండ్రులకు అందజేసే ప్రక్రియను ప్రయోగాత్మకంగా జిల్లా నుంచి ప్రారంభించాలని తెలిపారు. అలాగే మొక్కలను నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, అధ్యాపకులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలి



- **కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

**కామారెడ్డి, ఆగస్టు 07 ( మనం ప్రతినిధి ) :** కామారెడ్డి పట్టణంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కామారెడ్డి పట్టణంలోని రాజా నగర్ కాలనీలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా బెస్ట్ మెట్ వరకు నిర్మాణం పూర్తయినదానికి బిల్లులు మంజూరు అయ్యాయా?ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని లబ్ధిదారును అడిగి ఎలాంటి సమస్య రాకుండా ప్రభుత్వం ఉచితంగా ఇసుక, మొరం అందజేస్తదని రవాణా ఖర్చులు పెట్టుకొని వాటిని తీసుకుని వచ్చి నాణ్యతగా ఇల్లు నిర్మించుకోవాలని అన్నారు. నిర్మాణం పూర్తయిన ఇంటి వివిధ స్టేజీలను బట్టి బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక, మొరం, ఇతర నిర్మాణ సాగుమాగ్రికి ఎలాంటి సమస్య తలెత్తకుండా రెగ్యులర్ గా పర్యవేక్షించాలని హౌసింగ్ పీడీ విజయ్ పాల్ రెడ్డి, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి లను ఆదేశించారు. మార్కౌట్ చేసి నిర్మాణం ప్రారంభమైన అన్ని ఇందిరమ్మ ఇంట్లో వేగంగా నిర్మాణం పూర్తయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

## రుణాల పంపిణీలో ప్రొటోకాల్ పాటించడం లేదని ఫిర్యాదు

**భీంగల్, ఆగస్టు 07 (మనం న్యూస్) :** మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో వడ్డీ రాయితీ రుణాల పంపిణీ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించడం లేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్ కుమార్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారులు అధికార పార్టీకి చెందిన నాయకులను ఆహ్వానించి వారితో కార్యక్రమంలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్నారన్నారు. దినపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారాలను ఫిర్యాదుతో జత చేశామన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఆరే రవీందర్ మాట్లాడుతూ., రాజకీయ నాయకులను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించి ప్రొటోకాల్ విస్మరిస్తూ ఇష్టారాజ్యంగా



వ్యవహరిస్తున్న ఐకేపీ అధికారుల తీరుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు తోట గంగాధర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర నర్సయ్య, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారి లక్ష్మణ్ గౌడ్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు రమావత్ వెంకటేష్, శక్తి కేంద్ర ప్రముఖ్ హరిప్రసాద్, లక్ష్మీ నారాయణ, బీజేవైఎం నాయకులు శెట్టి ప్రేమ్ చంద్, పాల్గొన్నారు.

**జాతీయం- అంతర్జాతీయం**

## చేయని నేరానికి 20 ఏళ్లు జైల్లోనే..

రూ.11 కోట్ల పరిహారం...
ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయం

**సిడ్నీ, ఆగస్టు 7:** తన నలుగురు పిల్లలను పొట్టన పెట్టుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కోవడంతో పాటు క్రూరమైన 'మహిళా సీరియల్ కిల్లర్ 'గా ముద్రపడిన ఓ ఆస్ట్రేలియన్ మహిళకు ఇటీవల విముక్తి లభించింది. శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా తన చిన్నారులను ఆమె హత్య చేయలేదని తేలడంతో కొంతకాలం క్రితం ఆమె విడుదలైంది. ఈ క్రమంలో పరిహారంగా ఆమెకు 2 మిలియన్ డాలర్లు చెల్లించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే, బాధిత మహిళ తరఫు న్యాయవాది మాత్రం ఇంత తక్కువ పరిహారం చెల్లించడం చాలా అన్యాయమన్నారు. న్యూసౌత్ వేల్స్కు చెందిన కాథ్లీన్ ఫోల్బిగ్కు ఇద్దరు




కుమారులు, ఇద్దరు కుమార్తెలు. 1989-99 మధ్య కాలంలో ఈ నలుగురూ ఆకస్మికంగా మృతి చెందారు. అయితే, కన్నతల్లే వారిని హత్య చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఆమె తన డైరీలో పిల్లల పెంపకం, కష్టాలపై రాసిన రాతలు, ఇతరత్రా సాక్ష్యాల ఆధారంగా 2003లో ఆమెకు 30ఏళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, తాను ఏ తప్పు చేయలేదని ఆమె న్యాయ పోరాటం చేశారు. ఈ క్రమంలోనే 2021లో ఓ రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో ఈ కేసును మరోసారి దర్యాప్తు చేశారు. ఆ నలుగురు చిన్నారులు సహజంగానే మరణించి ఉండొచ్చనే అభిప్రాయానికి వచ్చారు. 90 మంది శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు, సంబంధిత నిపుణులు కూడా ఇందుకు మద్దతు పలికారు. దీంతో చివరకు 2023 డిసెంబర్లో న్యూ సౌత్ వేల్స్ కోర్టు ఆమెపై నమోదైన అభియోగాలను రద్దు చేయడంతో ఆమె విడుదలైంది. ఈ నేపథ్యంలోనే 20లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లను ఆమెకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, రెండు దశాబ్దాలు జైల్లో ఉండి, నలుగురు పిల్లలను కోల్పోవడంతోపాటు ఆస్ట్రేలియన్ సీరియల్ కిల్లర్గా అపఖ్యాతి మూటగట్టుకున్న ఆమెకు ఈ పరిహారం చాలా తక్కువేనని బాధిత మహిళ తరఫు న్యాయవాదులు, మద్దతుదారులు వాదిస్తున్నారు. సుమారు కోటి డాలర్లు పరిహారం ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు.

# ఆరు నెలల్లో 529 బాంబింగ్లు.. నోబెల్ ఇవ్వాల్సిందే..!

**వాషింగ్టన్, ఆగస్టు 7 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం నానాతంటాలు పడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడ చిన్న ఘర్షణ జరిగినా.. అక్కడ వాలిపోయి పంచాయితీలు చేస్తున్నారు. ఆయనను ఒక శాంతి దూతగా చిత్రీకరించేందుకు శ్వేత సౌధంలోని కార్యవర్గం కిందామీదా పడుతోంది. అసలు ట్రంప్నకు నోబెల్ బహుమతి వచ్చే అవకాశం ఉందా..? ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయోగించిన బాంబులు ఎన్ని.. ఎంత మంది ప్రాణాలను ఫణంగా పెట్టారో తెలుసా..?

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో నోబెల్ విషయంలో ట్రంప్నకు వైరం కొనసాగుతోంది. ట్రంప్ తొలిసారి అధ్యక్ష పదవి చేపట్టడానికి ప్రయత్నాలు మొదలుపెట్టినప్పటి నుంచి ఒబామాతో విభేదాలు ఉన్నాయి. తన శత్రువు అధ్యక్ష పదవి చేపట్టిన 9 నెలల్లోనే నోబెల్ శాంతి బహుమతి అందుకోగా లేనిది తన విషయంలో ఎందుకు సాధ్యం కాదని ట్రంప్ అనుకొంటున్నారు. ఒబామాకు బహుమతి రావడంపై కూడా బహిరంగంగానే కొన్నేళ్ల నుంచి అక్కసు వెళ్లగక్కుతున్నారు. 2019లో ఓ సందర్భంలో మాట్లాడుతూ బరాక్ ఒబామాకు ఎందుకు వచ్చిందో నాకు తెలియదు.. మీకేమైనా తెలుసా..?'' అని వ్యాఖ్యానించారు.

ట్రంప్ ఆశలకు గండికొట్టే అంశాలు కూడా బలంగానే ఉన్నాయి. జనవరి 20న పగ్గాలు చేపట్టిన నాటి నుంచి జులై 15 నాటికి కేవలం ఆరు నెలల వ్యవధిలో ఆఫ్రికా, పశ్చిమాసియా, మధ్య ఆసియాలోని 240 ప్రదేశాల్లో 529 బాంబింగ్లను




ట్రంప్ చేయించారు. ఈ విషయాన్ని 'ఆర్మ్డ్ కాన్ఫ్లిక్ట్ లొకేషన్ అండ్ ఈవెంట్ డేటా' గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అదే ఆయన కంటే ముందు అధికారంలో ఉన్న జోబైడెన్ నాలుగేళ్లలో 555 బాంబింగ్లను చేయించారు. ఇరాన్పై అతిపెద్ద బంకర్ బస్టర్ల వర్షం కురిపించారు.

పేద దేశాల్లో అన్నార్తులకు ఆహారం అందించే యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్ నిధులకు భారీగా కత్తెరేశారు. దీంతో 2030 నాటికి 14 మిలియన్ల (1.4 కోట్లు)మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయే ముప్పు పొంచి ఉందని ప్రముఖ మెడికల్ జర్నల్ 'లాన్సెట్' ఇటీవల తన అధ్యయనంలో అంచనావేసింది. వాస్తవానికి అమెరికాలో ఒక్కో వ్యక్తి సగటున రోజుకు 18 సెంట్లు యూఎస్ఎయిడ్కు ఇస్తారు. (100 సెంట్లు ఒక డాలర్) ట్రంప్ దానిని ఆదా చేసేందుకు 1.4 కోట్ల మంది ప్రాణాల మీదకు తెచ్చారు.

మూడు సార్లు తిరస్కరణలకు గురైనా నామినేషన్లు..

ఇదంతా ఒక ఎత్తైతే.. ట్రంప్ పట్టు వదలని విక్రమార్కుడిలా నోబెల్కు నామినేషన్లు పంపిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఆయనవి మూడుసార్లు తిరస్కరణకు గురయ్యాయి. 2018లో అణు నిరాయుధీకరణ యత్నాలకు ఇద్దరు నార్వే ప్రజాప్రతినిధులు, 18 మంది రిపబ్లికన్ సభ్యులు ఆయన పేరును ప్రతిపాదించారు. నాడు ఉత్తర కొరియా, అమెరికా మధ్య చర్చలను దీనికి కారణంగా చూపారు. కానీ, బహుమతి రాలేదు. 2020లో మరోసారి ట్రంప్ బృందం నోబెల్ యత్నాలు చేసింది. పశ్చిమాసియాలో అబ్రహం ఒప్పందాలు చేయించినందుకు ఓ స్వీడిష్ చట్టసభ సభ్యుడు, కొందరు ఆస్ట్రేలియా లా ప్రొఫెసర్లు, ఫిన్లాండ్ చట్టసభ సభ్యుడు, ఐరోపా పార్లమెంట్ సభ్యుడు ఆయన పేరును ప్రతిపాదించారు. అప్పుడు కూడా నోబెల్ మొహం చాటేసింది. ఇక 2024లో ఆయన అధ్యక్ష పదవి చేపట్టేందుకు సిద్ధమైన వేళ కూడా ఆయన పేరును కాంగ్రెస్ ఉమెన్ క్లాడియా టెన్ని నోబెల్కు నామినేట్ చేశారు. అయినప్పటికీ ఈ సారికూడాట్రంప్ను నోబుల్ వరించలేదు.

## బీహార్లో ట్రంప్!

సమస్తిపూర్లో నివాస ధ్రువీకరణ పత్రం

**సమస్తిపూర్, ఆగస్టు 7:** బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ పేరుతో నివాస ధ్రువీకరణ పత్రం కోసం వచ్చిన దరఖాస్తు సోషల్ మీడియాలో హాట్టాపిక్గా


फॉर्म/Form - XII
निवास प्रमाण पत्र हेतु आवेदन पत्र
मोहिउद्दीन नगर, अनुमंडल - पटोरी, जिला - समस्तीपुर, बिहार
5 आवेदन की तिथि : 29/07/2025
: ऑनलाइन / Online
: डोनाल्ड जॉन ट्रम्प (Donald John Trump)
: पुरुष / Male
: फ्रेडरिक क्राइस्ट ट्रम्प (Frederick Christ Trump)

మారింది. జిల్లాలోని మొహియుద్దీన్ నగర్ బ్లాకు ప్రభుత్వ పోర్టల్లో ట్రంప్ పేరు, ఫొటోతో ఈ దరఖాస్తు ప్రత్యక్షమైంది. అధికారులు అప్రమత్తమై అభ్యర్థనను వెంటనే తిరస్కరించారు. ఐటీ చట్టం కింద కేసు నమోదుచేసి, సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బీహార్లో గత కొన్నిరోజులుగా ఇటువంటి 'అపహాస్య' దరఖాస్తులతో అధికారుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. మొదట కుక్క పేరుతో దరఖాస్తు రాగా, ఆ తర్వాత ట్రాక్టరు.. ఇప్పుడు ట్రంప్ దొరికారు.

## సువేందు అధికారి కన్వాయ్పై దాడి

- **బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం**

**ఢిల్లీ, ఆగస్టు 7 :** పశ్చిమ బెంగాల్లో ప్రతిపక్ష నేత, బీజేపీ కీలక నేత సువేందు అధికారి కన్వాయ్పై ఇటీవల జరిగిన దాడి ఘటనపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూచ్ బెహర్లో ఆయన కన్వాయ్పై టీఎంసీ గూండాలు దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ దాడి పోలీసుల సమక్షంలోనే జరగడం ఇంకా ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ ఘటన మమతా బెనర్జీ ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనడానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం ఒక ప్రజాప్రతినిధిపై జరిగిన దాడి కాదు.. ప్రజాస్వామ్యంపైనే జరిగిన దాడిగా అభివర్ణించారు. తాను సువేందు అధికారికతో మాట్లాడి ఆయన పరిస్థితి గురించి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. బెంగాల్లో ఒక ప్రతిపక్ష నేతకే రక్షణ లేకపోతే.. ఇంకా సామాన్య ప్రజల దుస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక, రాజకీయ హింసాత్మక ఘటనలకు మమతా బెనర్జీ జవాబుదారీగా ఉండాలన్నారు. మరోవైపు, ఇటీవల బీజేపీ ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా మంగళవారం సువేందు అధికారి జిల్లా ఎస్పీకి మెమోరాండం ఇచ్చేందుకు వెళ్తుండగా అనుమానిత తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఆయనకన్వాయ్పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయన వాహనం ధ్వంసమైంది. ఈ ఘటనలో మంత్రి ఉదయాన్ గుహాతో పాటు మొత్తం 41 మంది వ్యక్తులపై బీజేపీ ఫిర్యాదు చేసింది. ఇప్పటివరకు పోలీసులు కూచ్ బెహర్లో పలుచోట్ల ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

## అమెరికాపైనా ప్రతీకార సుంకాలు విధించాలి

కాంగ్రెస్ నేత శశిథరూర్

**ఢిల్లీ, ఆగస్టు 7 :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా దిగుమతులపై కూడా భారత ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా విధించిన సుంకాలు మనపై కచ్చితంగా ప్రభావం చూపిస్తాయన్నారు. దాదాపు 90 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. సుంకం ఎక్కువగా ఉన్నప్పుడు భారత్ వస్తువులు ఎందుకు కొనాలి అని కొనుగోలుదారులు కూడా ఆలోచిస్తారన్నారు. రష్యా నుంచి భారత్ కంటే చైనా ఎక్కువ చమురు కొనుగోలు చేస్తోందని.. కానీ, ఆ దేశానికి ట్రంప్ సుంకాల నుంచి 90 రోజుల ఉపశమనం కల్పించారన్నారు. మనకు మాత్రం మూడు వారాలే ఉపశమనం కల్పించడం సమంజసం కాదన్నారు. కేంద్రం కూడా యూఎస్ దిగుమతులపై 50శాతం సుంకం విధించాలని కోరారు. మరే దేశం కూడా మనపై ఇలా బెదిరింపులకు దిగకూడదన్నారు.

# ఉద్యమాలకే ఊపిరైన గద్దర్ త్యాగం మరువలేనిది



- ఘనంగా ప్రజా గాయకుడు గద్దర్ వర్ధంతి

**గరిడేపల్లి,ఆగస్ట్ 7,(మనం న్యూస్):** భూ తల్లి బిడ్డలు చిగురించు కొమ్మలు చిదివేసిన పువ్వులు త్యాగాల గొంతులు మా భూములు మాకే నంటూ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊదిన గద్దర్ త్యాగం మరువలేనిదని ప్రజా కళాకారుడు బాదే నరసయ్య అన్నారు.ప్రజా గాయకుడు స్వర్గీయ గద్దర్ రెండవ వర్ధంతిని గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.ప్రజల సమస్యల పరిష్కారం కోసం,తన పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతులు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.ఆయన ఆలపించిన ప్రతి పాటలో ప్రజా చైతన్యం కళ్ళకు కట్టినట్టు కనిపించేదని తెలిపారు.ఎంతోమంది ప్రజా గాయకులకు కళాకారులకు ఆయన ఆదర్శంగా నిలిచారని తెలిపారు.తుదిశ్వాస విడిచే వరకు తాను నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగిన వీరుడని ఆయన కొనియాడారు.ప్రజా చైతన్యం కోసం ఆయన నడిచే బాటలో ఎన్నో ఇబ్బందులు వడుదుడుకులు ఆటుపోట్లు ఆర్థిక ఇబ్బందులు తలెత్తినప్పటికీ వాటన్నింటినీ ఎదుర్కొంటూ ప్రజల్లో చైతన్యం నింపిన కళాకారుడని ఆయన పేర్కొన్నారు.నేడు ఎంతోమంది ప్రజా గాయకులు కళాకారులు తయారయ్యారు అంటే దానికి గద్దర్ స్ఫూర్తి దాయకమని తెలిపారు.పాలకుల తీరును ఎండ గట్టడంలో,ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకు రావడం కోసం తాను పాడిన పాటనే ఆయుధంగా తయారు చేసుకున్నారని తెలిపారు. గద్దర్ ఆలపించిన పాట లో ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలు పాలకుల అనుసరిస్తున్న తీరు కళ్ళకు కట్టినట్లు ఉండేదని తెలిపారు. కళారూపాలను ప్రదర్శించడంలో, చైతన్యవంతమైన పాటలను ఆలపించడంలో ఆయనకు ఆయనే సాటి అని,అలాంటి గాయకులు అరుదుగా ఉంటారని ఆయన తెలిపారు.గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాకారులు మైబు, తదితరులు పాల్గొన్నారు.

# ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి




**సూర్యాపేట, ఆగస్టు 07 (మనం ప్రతినిధి):** పేట జిల్లాలో ఆహార భద్రత చట్టాన్ని ఇంకా పటిష్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లాలో ఫుడ్ కమిషన్ పర్యటన సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ పి. రాంబాబు తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...సూర్యాపేట జిల్లాలో ఆరోగ్యం, స్కూల్స్, హాస్టల్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ఇక్కడ ఆహార భద్రత చట్టాన్ని బాగా అమలు చేస్తున్నారని, ఇలాగే ఇతర జిల్లాల్లో అమలు చేస్తే తెలంగాణ ఆహార భద్రత చట్టం పూర్తిగా అమలు చేసిన వారం అవుతామని పేర్కొన్నారు. పేదరికం పోవాలంటే చదువు ముఖ్యమని అన్నారు. రేషన్ దుకాణాలలో డీలర్లు వేయింగ్ విషయంలో ఇబ్బందులు వస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అంగన్వాడి కేంద్రాలలో ఎగ్స్, పాలు, బాలామృతం అట వస్తువులు, సక్రమంగా సరఫరా చేయాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ....హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో, రెసిడెన్షియల్ స్కూళ్లలో పూర్తి స్థాయిలో ఆహార భద్రత చట్టాన్ని అమలు చేస్తున్నామని, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం అందించడం జరుగుతున్నదని, తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో గుడ్లు, పాలు, బాలామృతం సక్రమ సరఫరా అమలు చేస్తామని, స్కూల్స్, రెసిడెన్షియల్ హాస్టల్స్ లో హిమోగ్లోబిన్ పర్సంటేజ్, తదితర పరీక్షలు చేయించడం జరుగుతున్నదని అన్నారు. ఫుడ్ కమిషన్ సభ్యులకు సన్మానం ఫుడ్ కమిషన్ చైర్మన్ ను, కమిటీ సభ్యులను గురువారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో కమిటీ సభ్యులకు శాలువాలతో సన్మానించారు.ఈ సమీక్షా సమావేశానికి ఫుడ్ కమిషన్ సభ్యులు ఆనంద్, శారద, భారతి, జ్యోతి, డి ఆర్ డి ఏ పి డి వి. వి. అప్పారావు, సంక్షేమ శాఖల అధికారులు దయానంద రాణి, శంకర్ నాయక్, శ్రీనివాస్ నాయక్, ఎంఈఓ లు, హెడ్మాస్టర్లు, హాస్టల్ సంక్షేమ అధికారులు, తదితరులు హాజరయ్యారు.

# ఘనంగా ముత్యాలమ్మ బోనాలు

## బోనాలెత్తిన మహిళలు - ఊరేగింపుగా తరలింపు



**పెన్ పహాడ్ ఆగస్టు 07 (మనం న్యూస్):** మండల కేంద్రంలో గురువారం ముత్యాలమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో వండిన బోనాలను ఎత్తుకొని డప్పు వాయిద్యాలతో ఊరేగింపుతో బొడ్రాయి వద్దకు చేరుకుని పసుపు కుంకుమలతో పూజలు చేసిన అనంతరం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ప్రదర్శనగా వెళ్లి బోనాలు సమర్పించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు తదనంతరం అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి ముత్యాలమ్మ తల్లికి పసుపు కుంకుమలతో చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సస్యశ్యామలంగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు పండించే పంటలకు అధిక దిగుబడి రావాలని అమ్మవారిని వేడుకున్నట్లుగా తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు మహిళలు, యువతులు, చిన్నారులు,తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరిలో చేనేత జాతీయ దినోత్సవం



**తిరుమలగిరి, ఆగస్టు 7 (మనం న్యూస్):** తిరుమలగిరి మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో చేనేత జాతీయ దినోత్సవ కార్యక్రమాన్ని చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మిక సంగం నాయకులు బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వంగరి బ్రహ్మం మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్యం కొరకు పోరాడుతున్న రోజులలో జాతీయ నాయకులు ఇచ్చిన విదేశీ వస్త్ర బహిష్కరణ స్వదేశీ వస్త్ర స్వీకరణ అనే నినాదం ఇచ్చిన రోజు 1905 ఆగస్టు నెల 7 తేదీన పురస్కరించుకుని సమస్త మానవాళికి వస్త్రాన్ని అందించి ప్రజల పరువును కాపాడి వారికి సంఘం లో గౌరవ ప్రతిష్ఠలు పెంచిన చేనేత రంగానికి ఒక రోజు ఉండాలని మన పెద్దలు భారత ప్రభుత్వాన్ని ఒప్పించి సగర్వం గా నిర్వహించుకుంటున్న జాతీయ చేనేత దినోత్సవంఅన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగాన్ని కాపాడి వారి అభివృద్ధికి అవసరమైన పథకాలు రూపొందించి అమలు చేయాలని కోరారు.చేనేత సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.చేనేత వృత్తి పై ఆధారపడిన వారందరికీ చేనేత సహకార సంఘం లో సభ్యత్వం ఇవ్వాలని కోరారు.చేనేత సహకార సంఘాలలో పేరుకు పోయిన బకాయిలు,క్యాష్ కట్ నిధులు వెంటనే జమ చేయాలని కోరారు. ఇండ్లులేని నిరుపేద చేనేత కార్మికులకు పక్క భవనాలు నిర్మించి ఇవ్వాలని కోరారు.గుంట మగ్గాల స్థానం లో స్టాండ్ మగ్గాలు అందచేయాలని కోరారు.మగ్గాలు ఏర్పాటు చేసుకోడానికి వర్క్ షెడ్లు మంజూరు చేయాలని కోరారు .చేనేత కార్మికుల నేసిన ఉత్పత్తులతో పాటు మాస్టర్ వీవర్స్ ద్వారా లభ్యమయ్యే చేనేత ఉత్పత్తులను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు.చేనేత రుణ మాఫీ కేవలం లక్ష రూపాయల కే పరిమితం చేయకుండా ఆంక్షలు లేకుండా అమలు చేయాలని కోరారు.పలువురు సంఘ నాయకులు చేనేత సమస్యలపై ప్రసంగించారు.మండలం లోని వివిధ గ్రామాల నుంచి చేనేత కార్మికులు,మహిళ చేనేత కార్మికులు,పద్మశాలి సంఘ నాయకులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో సంఘ నాయకులు మద్దూరి శంకరయ్య, దుస్సా రామ్మూర్తి,పొన్నం కృష్ణమూర్తి, వంగరి సోమయ్య, నోముల సత్యనారాయణ, అమృతం రాజు,వంగరి ఉపేందర్, వంగరి సోమకృష్ణ, వీరబత్తిని మల్లయ్య,వెంగళి మధు,చింతకింది యాదగిరి, ఏనగందుల రవి, అక్కల ఉప్పలయ్య, రాపోలు కొండయ్య, వంగరి రమేష్, పెండెం గణేష్, గర్దాస్ శ్రీనివాస్, మూడ నాగరాజు,విడెం శ్రీనివాస్,మద్దూరి కృష్ణమూర్తి, దుస్స సత్యనారాయణ,మద్దూరి శేఖర్, మంచే అంబదాస్, వంగరి కిషన్,వంగరి పెద్ద సోమయ్య,వంగరి వెంకన్న, దుస్స వేణుగోపాల్,మద్దూరి రాములు,వంగరి రాములు,చింతకింది శ్రీనివాస్, వెంగలి పాండయ్య,వీరబత్తిని మురళీ, వంగరీ సిద్దయ్య,వంగరి రమేష్, వంగరి కోటయ్య,మద్దూరి ఉమేశ్, అక్కల లక్ష్మయ్య, బేతు శ్రీహరి మహిళ చేనేత నాయకులు అమృతం ధనలక్ష్మి, పెండం యాదమ్మ, వెంగలి కళ్యాణి, మద్దూరి జ్యోతి, వంగరి సరిత, మంచి దీపిక,బేతు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూరి బా గాంధీ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

- కస్తూరిభా పాఠశాలలో ఉపాధ్యాయుడైన కలెక్టర్
- విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి
- సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్




**తుంగతుర్తి, ఆగస్టు 7( మనం న్యూస్ ):** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని, కేజీబీవీ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. మొదటగా ప్రభుత్వ ఆస్పత్రిలో సందర్శించి రోగులతో వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలోని రికార్డులను, ఎక్స్రే మిషన్, డెంటల్, ల్యాబ్ లను పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆస్పత్రిని పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేసి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు బోధన అందించాలన్నారు. వంటగదిని, వాటర్ ప్లాంట్, సరుకుల గదిని అధికారులతో కలియ తిరుగుతూ పరిశీలించారు. విద్యార్థినుల తరగతి గదిలోకి వెళ్లి తెలుగు, హిందీ సబ్జెక్టులపై పదవ తరగతి విద్యార్థులచే చదివించి వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్ లోకి వెళ్లి విద్యార్థులు కంప్యూటర్ ఏ విధంగా నేర్చుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో భూభారతిలో దరఖాస్తు చేసుకున్న రైతుల దరఖాస్తులను పరిశీలించి గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలోకి అధికారులు వెళ్లి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం పలు పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి రైతులకు నాణ్యమైన ఎరువులను, విత్తనాలు అందించాలని. రికార్డులు, స్టాక్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషు కుమార్, డీసీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, ఏడీఏ రమేష్ బాబు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్ కుమార్, డాక్టర్లు వీణ, రాజు, ఆరోగ్య సిబ్బంది, ఎస్ఓ కల్పన, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా రోడ్లను తొవ్వద్దు




- దమ్ము చక్రాలతో ట్రాక్టర్ రోడ్లపైకి రావద్దు
- ఇలాంటి చర్యల వల్ల ప్రజలు ప్రమాదాల పడే అవకాశం
- జిల్లా ఎస్పీ నరసింహా

**సూర్యాపేట, ఆగస్టు 7 (మనం ప్రతినిధి):** ప్రజల అవసరాలు, రవాణా నిమిత్తం ప్రభుత్వం ఎంతో ఖర్చుతో ఏర్పాటు చేసిన రోడ్లను కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ అక్రమంగా తోవ్వుతూ వదిలేస్తున్నారు, ఎవరు కూడా అనుమతులు లేకుండా రోడ్లను ఎక్కడపడితే అక్కడ తవ్వకూడదని జిల్లా ఎస్పీ కే నరసింహ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ట్రాక్టర్ దమ్ము చక్రాలతో రోడ్లపై రావొద్దు అని దీనిపై ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయి అన్నారు. రోడ్లను తవ్వి వదిలేయడం వల్ల వాహనదారులు గమనించగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని గుర్తు చేశారు. వ్యవసాయ పనులు ఇతర అవసరాల దృష్ట్యా ఎవరైనా రోడ్లను తవ్వితే సంబంధిత శాఖ వారికి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. కాంట్రాక్టర్లు ఎవరైనా రోడ్లను తోవ్వినట్లయితే అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి, వెంటనే వాటిని మరమ్మతులు చేయాలని స్పష్టం చేశారు.దమ్ముచక్రాల లతో ట్రాక్టర్లు రోడ్లపైకి వస్తే రోడ్లు ధ్వంసం అవుతాయని, ప్రమాదాల జరుగుతాయని అన్నారు. రైతులు, ట్రాక్టర్ యజమానులు దీనిని గమనించాలని దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను రోడ్లపై తొలవద్దు అని ఎస్పీ గారు కోరారు. ఎక్కడపడితే అక్కడ రోడ్లు తొవ్వి వదిలేయడం, దమ్ము చక్రాల ట్రాక్టర్ రోడ్డు పైకి రావడం ప్రమాదం అన్నారు, నిభందనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఎస్పి గహెచ్చరించారు.

# అధిక ఫీజుల వసూల్‌తో విద్యార్థులను వేధించొద్దు



**సూర్యాపేట, ఆగస్టు 07 (మనం ప్రతినిధి):** సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఫీజులు కట్టాలని విద్యార్థులను ఎస్ వి కళాశాల యాజమాన్యం వేధింపులు గురి చేయడం సరైన పద్ధతి కాదని డిగ్రీ పూర్తయిన విద్యార్థులకు ఎలాంటి ఫీజులు లేకుండా సర్టిఫికెట్లు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ వి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ...కళాశాలలో జాయిన్ అయ్యేటప్పుడు ఎలాంటి రుసుములు చెల్లించేది లేదని ప్రభుత్వం ఇచ్చే రియంబర్స్మెంట్తో విద్యను అందిస్తామని మాయమాటలు చెప్పి జాయిన్ అయ్యాక, ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలు నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నాయని ఖచ్చితంగా మూడు సంవత్సరాలకు గాను 54000 రూపాయలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను యాజమాన్యం ఒత్తిడి తెస్తుందన్నారు. దీని ద్వారా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పై చదువుల కోసం ఎంట్రెన్స్ పరీక్షలు రాయటం కోసం సర్టిఫికెట్స్ కోసం వెళితే రోజుల తరబడి కళాశాల చుట్టూ తిప్పుకుంటున్నారన్నారు. దీని ద్వారా విద్యార్థులు పై చదువులకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ తో ఉత్తీర్ణత సాధించిన సర్టిఫికెట్స్ లేకపోవడంతో ఇతర కోర్సులల్లో అడ్మిషన్స్ వేయలేని దుస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం స్పందించి విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవాలని పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమా డుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్కినపల్లి వినయ్ , కొడాలి నాగరాజు,తీగుళ్ల శ్రవణ్, సంపంగి గణేష్, లింగంపల్లి సంధ్య,మిర్యాల దివ్య, బొడ్డు శ్రావ్య,వగ్గు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# రసాయన పరిశ్రమలలో నిరంతరం తనిఖీలు అవసరం



**సూర్యాపేట ఆగస్టు 07 (మనం ప్రతినిధి):** రసాయన ,ఔషధ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించకుండా తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయంలో తన చాంబర్లో ఫ్యాక్టరీలు, రసాయన పరిశ్రమల్లో భద్రతపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...గత జూన్ 30 న సంగారెడ్డి జిల్లా, పాశమైలారం లో సంభవించిన అతిపెద్ద విస్ఫోటనాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాక్టరీలు, ప్రత్యేకించి రసాయన పరిశ్రమలు, ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో భాగంగా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలు ఏర్పాటు చేసి, ఆ కమిటీల ద్వారా ఆయా పరిశ్రమలలో భద్రతను తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే.ఈ అంశం పై సూర్యాపేట జిల్లాలో జిల్లా కలెక్టర్ ఇదివరకే పరిశ్రమలు, కార్మిక ,కాలుష్య నియంత్రణ మండలి, తదితర సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కమిటీ ఆయా రసాయనిక పరిశ్రమలు, ఔషధ యూనిట్లను తనిఖీ చేసి ఆగస్టు 14 లోగా నిర్దేశించిన ప్రొఫార్మా లో నివేదిక సమర్పించాలని , ఇదే అంశంపై నివేదిక అందిన తర్వాత తిరిగి సమీక్షిస్తానని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అన్ని పరిశ్రమలు ,రసాయనిక, ఔషధ యూనిట్లలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ఉందని కలెక్టర్ అన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, జిల్లా పరిశ్రమల మేనేజర్ టి. సీతారాం, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక శాఖ అధికారులు,ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని సైతం అందించాలి

- రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరావు
- ప్రభుత్వ వైద్యాన్ని చులకనగా చూడొద్దని ప్రజలకు హితవు...!
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యనందించాలి



**పెన్ పహాడ్ ఆగస్ట్ 07 (మనం న్యూస్):** అంగన్వాడి కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలని ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి అన్నారు గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,అంగన్వాడి సెంటర్ వన్,త్రి అనంతారం గ్రామంలో ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో తనిఖీలు నిర్వహించిన సందర్భంగా ప్రజలకు ఉన్నతమైన సేవలు అందించాలని ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలని సిబ్బందికి తెలిపారు జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ లు ఆసుపత్రి సేవల వివరాలు క్షుణ్ణంగా వివరించారు మండల స్థాయిలో ప్రాథమికంగా వైద్యాన్ని అందిస్తామని పూర్తిస్థాయిలో రోగికి అవసరమైన పరీక్షలు అదనపు సేవలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి 108 వాహనంలో తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించి వైద్యం అందజెస్తున్నామని తెలిపారు ఆపరేషన్ గది రక్త పరీక్షల విభాగం,ఫార్మసీ,ఓ పి సేవలను క్షుణ్ణంగా పరిశీలించారుఫార్మసీలో ఉన్న మందులను పరిశీలించారు సేవలు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు అనంతరం ప్రాథమిక పాఠశాలలోని అంగన్వాడి సెంటర్ వన్ సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు అంగన్వాడి సెంటర్లో విద్యార్థులకు అందించే కోడిగుడ్లను పరిశీలించి కోడిగుడ్ల సైజు చిన్నగా ఉన్నదని ఎందుకు వాపస్ పంపించలేదని సుప్రవైజర్ను ప్రశ్నించారు చిన్న సైజుగుడ్లలో పోషకాలు ఉండవని ఇలాంటి వాటిని అంగన్వాడి కేంద్రానికి వచ్చిన వెంటనే తిరిగి పంపించి లావుగా ఉండే పోషకాలు కలిగినటువంటి గుడ్లను తెప్పించి మాత్రమే అందించాలని సూచించారు పిల్లలను అంగన్వాడి సెంటర్ పిల్లలను బొమ్మలు చూపించి వారి పరిజ్ఞానాన్ని ఆసక్తిగా విన్నారు ప్రభుత్వం అందించిన ప్రతి వస్తువులచే పిల్లలను ఆడించి పాడించి ప్రతి వస్తువును వారికి అందేలా చూడాలని తెలిపారు అనంతరం గ్రామంలోని ప్రాథమిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు వంట పనివారాలను వంట వివరాలు ఆసక్తిగా అడిగి మెనూ ప్రకారం వండి పెట్టాలని ఆదేశించారు అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి వాటికి నీటిని అందించారుఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషనర్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ , గోవర్ధన్ రెడ్డి, రంగినేని శారద, భారతి, జ్యోతి జిల్లా అధికారులు, మండలాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం కింద సమాధానమివ్వాలి

## తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి. చంద్రశేఖర్ రెడ్డి




**జనగామ, ఆగస్టు 7(మనం ప్రతినిధి):** ప్రజలు కోరిన విదంగా సమాచార హక్కు చట్టం క్రింద సమాచారం అందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డా. చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ల ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం ను రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అంతకుముందుజిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ డాక్టర్ జి చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, మొహిసిన పర్వీన్, బోరెడ్డి అయోధ్య రెడ్డి, వైష్ణవి మేర్ల కు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ డి.సి.పి.రాజమహేంద్ర నాయక్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ లు పూల బోకేలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వన మహోత్సవం ను పురస్కరించుకొని మొక్కలు నాటారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు కోరిన విధంగా సమాచారం అందించాల్సి ఉంటుందన్నారు. ఆర్టిఐ క్రింద ప్రజలు కోరిన సమాచారం అందించుటలో ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన పరిచారు.సిబ్బంది ధైర్యం గా ఉండాలని ఆర్టిఐ కి భయపడరాదన్నారు. జాప్యం చేస్తేనే ఇబ్బందులు ఎదురవుతాయని 30 రోజు గడువు ఉంటున్నందున ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు.తక్కువ సమాచారం ఉంటే త్వరగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమాజం లో జవాబుదారీ తనం పెంచేందుకు పారదర్శకత తో పనిచేసే విధంగా సమాచార హక్కు చట్టం రూపొందించడం జరిగిందన్నారు.జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మాట్లాడుతూ ప్రతి కార్యాలయం లో సమాచార హక్కు చట్టం రిజిస్టర్ లను నిర్వహించాలన్నారు అదే విధంగా మూడు నెలలకు ఆరు నెలలకు ఇచ్చే నివేదికలను నిర్ణీత సమయానికి అందజేయాలన్నారు. ప్రజలు అందించిన దరఖాస్తులు సమగ్రంగా చదివి అర్థం చేసుకోవాలని, తెలియని విషయాలను తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించిన విద్యుత్ అధికారులు




**రాయపర్తి, ఆగస్టు 7(మనం న్యూస్):** విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే పొలంబాట కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని టెక్నికల్ డిఇ ఆనందం, ఆపరేషన్ డి బిక్షపతి అన్నారు. గురువారం మండలంలోని పెరికేడు గ్రామంలో రైతులతో కలిసి పొలంబాట కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నాణ్యమైన సర్వీస్ వైర్ వాడాలని,విద్యుత్ మోటార్ల వద్ద కెపాసిటర్లు నాణ్యమైన విద్యుత్ అందడంతో పాటు మోటర్లు, ట్రాన్స్ఫార్మర్లు కాలిపోకుండా ఉంటుందని అన్నారు.

రైతులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు.లూజ్ లైన్లో 3 మిడిల్ పోల్స్, సిఐ ఎర్త్ పైపులు ఏర్పాటు జరిగిందని అన్నారు.ఈ ఈ కార్యక్రమంలో ఏడిఈ నటరాజ్, ఏఈ రవళి, సబ్ ఇంజనీర్ విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు పోలీస్ శాఖ సన్మానం



**తొర్రూర్, ఆగస్టు 7(మనం న్యూస్ ):** మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు పట్టణంలో బుధవారం జరిగిన బోనాల పండుగ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం నుండి ముత్యాలమ్మ గుడి వరకు రక్షణ లోకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో 10 ఆటోలను ఏర్పాటు చేసి భక్తులకు ఉచిత సేవలను అందించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో భక్తులకు ఉచిత సేవలు అందించిన ఆటో డ్రైవర్లను సర్కిల్ ఇన్స్పెక్టర్ గణేష్, సబ్ ఇన్స్పెక్టర్ ఉపేందర్, సెకండ్ సబ్ ఇన్స్పెక్టర్ లు కలిసి శాలువాతో సన్మానించారు.

# వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: కలెక్టర్ సత్య శారద



**సంగెం, ఆగస్టు 7 (మనం న్యూస్):** వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపి , రిజిస్ట్రేషన్, ల్యాబ్, ఇన్ పేషెంట్, వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ పలు రికార్డులను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరం మందుల నిల్వలు సరిగా మైంటైన్ చేయాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కట్టిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆరోగ్య కేంద్రానికి జ్వరంతో వచ్చిన ప్రతి వ్యక్తికి మలేరియా, డెంగ్యూ, రక్త పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్యాధికారి వంశీకృష్ణను ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆస్పత్రిలోని అన్ని రూములోని ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి జబ్బు నయమైఎందుకు మందులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల మందులు, వ్యాక్సిన్ అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఆసుపత్రికి ప్రతిరోజు రోగులు ఎంతమంది ఇన్ పేషంట్స్ వారి గురించి వాకబు చేశారు.ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గడువు దాటిన మందులు ఉంచరాదని తెలిపారు. చిన్నపిల్లలకు అవసరమైన వ్యాధి నిరోధక మందిరం ముందుగానే నిల్వ ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట డిఎంహెచ్ఓ సాంబశివరావు, వైద్య అధికారులు వంశీకృష్ణ, దేవేందర్, సిహెచ్ఓ చిన్నబాయి, పి.హెచ్.ఎన్ ఉపేంద్రమ్మ, హెచ్ఈఓ సత్యరాజ్, సూపర్వైజర్ లు ట్రాన్సిస్ అమ్మ, మేరీ, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం లు, ఆశ కార్యకర్తలు ఝాన్సీ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇల్లుతోనే పేదవాడి సొంతింటి కల సాకారం



**పరకాల, ఆగస్టు 7 మనం న్యూస్:** పరకాల ప్రభాకర్ సంఘం ఒకటో వార్డు పరిధి లో స్థానిక శాసనసభ్యులు రేవూరి. ప్రకాష్ రెడ్డి సహకారంతో ఎస్సీ కాలనీలో కోడెపాక. లావణ్య నాగరాజు లకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమంలో పరకాల బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ మడికొండ. సంపత్ కుమార్. పాల్గొన్నారు ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇల్లు లేని నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేరుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి కాంగ్రెస్ నాయకులు బొచ్చు కోమల, బొచ్చు జెమిని, , వార్డు పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

# చేనేత కార్మికునికి కలెక్టర్ సన్మానం



**మహాదేవపూర్, ఆగస్టు 7 (మనం న్యూస్):** చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహాదేవపూర్ కు చెందిన ఎడపల్లి చేనేత సొసైటి కార్మికుడు గోరంట్ల మొగిలిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సన్మానించారు. ఈ సందర్భంగా సొసైటి సమస్యలపై సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టి కి తీసుకుపోగా సొసైటీ ఎదురుకొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని కలెక్టర్ సొసైటీ వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# సేవా తరుణి ఆధ్వర్యంలో గర్భిణులకు శ్రీమంతం



**తొర్రూరు ఆగస్టు 7 (మనం న్యూస్):** లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి క్లబ్ అధ్యక్షురాలు లయన్ తుమ్మూరు శ్రీదేవి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు భాగంగా గురువారం 30 మంది గర్భిణీలకు శ్రీమంతం చేశారు. అనంతరం చిన్న పిల్లలకు అక్షరభ్యాసం చేయించి, 50 జూట్ బ్యాగులను పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా సిడబ్ల్యూసి చైర్ పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి సిడిపిఓ కమలాదేవి తో కలిసి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలు బిడ్డ ఆరోగ్యం బారిన పడకుండా కాపాడుతుందన్నారు బిడ్డకు ఆరు నెలలు వచ్చేవరకు తల్లిపాలు తాపించాలన్నారు. తల్లి పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. డాక్టర్ ప్రియాంక డాక్టర్ మీరాజ్ లు మాట్లాడుతూ పిల్లలు పుట్టిన వెంటనే వారికి గంటలోపు మురుగుపాలు అందించాలని, ప్రతి బాలింతరాలు బిడ్డకు కనీసం సంవత్సరం వరకు తల్లిపాలు ఇవ్వాలని దీనివల్ల తల్లి బిడ్డలు ఇద్దరు ఆరోగ్యంగా ఉంటారని, తల్లి జాగ్రత్తలు పాటించాలన్నారు. డిస్టిక్ జి ఎల్ టి కోఆర్డినేటర్ శారదన్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడం వల్ల పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఏసిడిపిఓ విజయలక్ష్మి, అంగన్వాడి సూపర్వైజర్ సునీత, సేవా తరుణి కార్యదర్శి కూన పద్మావతి, కోశాధికారి వేమూరి మంజుల, లయన్ రాజ సుకన్య,ఎఫ్ డబ్ల్యూసి చైర్ పర్సన్ లయన్ ఉమా రెడ్డి, గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

# పంద్రాగస్ట్ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

## సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట, ఆగస్టు 07, మనం ప్రతినిధి:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు శాఖల వారీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, అబ్దుల్ హమీద్ లతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయ ఆవరణలో గల పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పూర్తిగా స్వాతంత్ర దినోత్సవ స్ఫూర్తి కనపడేలా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై శకటాల ప్రదర్శన, స్టాళ్ళ ఏర్పాటు చేయాలని, ముఖ్య అతిథి ప్రసంగం సిద్ధం చేయాలని, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, నిర్వహించాలని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వచ్చే అతిథులకు, విద్యార్థులకు, మీడియా, జిల్లా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సీటింగ్, త్రాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో ఉన్న పోలీస్ పెరేడ్ గ్రౌండ్ పరిశీలించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం గ్రౌండ్ ను సిద్ధం చేయాలని, వేడుకల సందర్భంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చెయ్యాలని అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిద్దిపేట డిఎస్పి రవీందర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, ఆగస్టు 7(మనం ప్రతినిధి):** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు.పట్టణంలోని మినీ స్టేడియం ధర్మ కంచలో జావిలిడే, కిడ్స్ అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ పోటీలకు జనగామ జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు వచ్చే ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నాయని, 2శాతం పొజిషన్ కూడా ఉపయోగపడుతుందని , ప్రతి ఒక్కరు విధిగా ఆటల్లో పాల్గొని శారీరక ఆరోగ్యం పెంపొందించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు పెద్ది వెంకటనారాయణ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా యంత్రాంగం సహకరించిందని ఇలాంటి కార్యక్రమాలు ముందు ముందు చేయడానికి మాకు ఇది ఒక ఉత్సాహం లాంటిదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి బైరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, తెలంగాణ క్రీడల నిర్వహణ కార్యదర్శి పగడాల వెంకటేశ్వర్ రెడ్డి , జనగామ జిల్లా అదర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ , కోశాధికారి ఆవుల అశోక్, నిర్వహణ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, కిరణ్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు సుగుణాకర్, హనుమంతరావు గజ్జెల్లి రాజు, కిష్టయ్య, గౌర్సింగ్ ఆడెపు శ్రీనివాసు, పాండ్యా, నాగరాజు, కొద్దూస్, దిలీప్, ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆశీర్వాదం



**రాయపర్తి, ఆగస్టు 7(మనం న్యూస్):** మండల కేంద్రానికి చెందిన రాయపర్తి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కోతి కళ్యాణ్ కుమారుడి 21వ రోజు వేడుకలలో పిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి, రాజా రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారిని ఆశీర్వదించి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలలో మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మాజీ టి పిసిసి కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, కృష్ణమాచార్యులు,ఆకులసురేందర్ రావు, రాయపర్తి గ్రామ పార్టీ అధ్యక్షులు మచ్చ రమేష్, ఉల్లెంగుల యాదగిరి, చెవ్వు కాశీనాథం, కాంచనపల్లి వనజారాణి,ఎండి అఫ్రోజ్ ఖాన్, కృష్ణ, తౌడుశెట్టి రామారావు, కసరబోయిన శ్రీను, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా కోరల్లో గాండ్ల వారి కుంట

- **ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**
- **చెరువు కట్టను పునర్నిర్మించాలి**
- **హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్**



**కోహెడ,ఆగస్టు 7, (మనం న్యూస్):**గాండ్ల వారి కుంట పై కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా ఆక్రమణకు పాల్పడుతున్నారని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ విమర్శించారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని సముద్రాల గ్రామంలో ఉన్న గాండ్ల వారి కుంటను స్వయంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక అఖిలపక్ష నాయకులు, గ్రామ ప్రజలు, ముదిరాజ్ సంఘం ప్రతినిధులతో కలిసి పరిస్థితిని సమీక్షించారు. పాత చెరువు ప్రాముఖ్యత వివరంగా తెలుసుకుని, అధికారులను టెలిఫోన్ ద్వారా సంప్రదించారు.మిషన్ కాకతీయ లో భాగంగా మాజీ సీఎం కేసీఆర్ పూర్వ ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ కు విశేష కృషి చేసింది అన్నారు. చెరువు పూడిక తొలగించి సాగునీటి కోసం రైతులకు ఉపశమనం కలిగించారు అని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ నాయకులు వాటినే పూడ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.అత్యవసరంగా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువు కట్టను పునర్నిర్మించాలి అని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కట్టపై హరితహారం కార్యక్రమంలో నాటిన ఈత చెట్లు తిరిగి నాటించడం వంటివి అధికారుల ముందు ఆయన డిమాండ్ చేశారు.గ్రామస్తులు, స్థానిక నాయకులు ఈ చర్యలను స్వాగతిస్తూ, అధికార యంత్రాంగం వెంటనే స్పందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు కొక్కుల సురేష్, పొన్నాల లక్ష్మణ్, తోట ఆంజనేయులు, భీంరెడ్డి రాజిరెడ్డి, ఆవుల మహేందర్, గ్రామస్థులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

# ఆ కప్‌తో పాటు ఆ సిరీస్‌కూ రిషబ్ పంత్ దూరం?



ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్ ను 2-2తో ముగించిన టీమ్ఇండియా స్వదేశానికి చేరుకుంది. ఈ నెలలో భారత జట్టుకు అంతర్జాతీయ క్రికెట్ లో ఎలాంటి సిరీస్ లు లేవు. సెప్టెంబరు 9న మొదలుకానున్న ఆసియా కప్ తో టీమ్ఇండియా మళ్లీ వరుస మ్యాచ్ లతో బిజిబిజీగా మారనుంది. టీ20 ఫార్మాట్ లో జరగనున్న ఆసియా కప్ కు మరో రెండు, మూడు వారాల్లో జట్టును ప్రకటించే అవకాశముంది. అయితే, ఇంగ్లాండ్ తో నాలుగో టెస్టులో బ్యాటింగ్ చేస్తూ గాయపడ్డ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ ఈ టోర్నీకి దూరమవడం ఖాయంగా కనిపిస్తోంది. అతనికి సర్జరీ అవసరం లేదని వైద్యులు చెప్పినట్లు సమాచారం. కానీ, పూర్తిస్థాయిలో కోలుకోవడానికి ఆరు వారాలు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. సెప్టెంబరు 28న జరిగే ఫైనల్ తో ఆసియా కప్ ముగియనుంది. అక్టోబర్ 2-14 మధ్య స్వదేశంలో వెస్టిండీస్ తో భారత్ రెండు టెస్టులు (అహ్మదాబాద్, దిల్లీలో) ఆడనుంది. ఈ సిరీస్ లో కూడా పంత్ బరిలోకి దిగేది అనుమానంగా కనిపిస్తోంది. పంత్ ఆడకపోతే ధ్రువ్ జురెల్ ప్రధాన వికెట్ కీపర్ గా ఉంటాడు. అక్టోబర్లోనే భారత జట్టు వన్డే, టీ20 సిరీస్ కోసం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఆసీస్ తో జరిగే మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్ తో పంత్ రీ ఎంట్రీ ఇచ్చే అవకాశముంది. ఇటీవల ఇంగ్లాండ్ తో టెస్టు సిరీస్ లో రిషబ్ అదరగొట్టాడు. నాలుగు మ్యాచ్ లు ఆడి రెండు సెంచరీలు, మూడు అర్ధ శతకాలతో 479 పరుగులు చేశాడు.

**ఆసియా కప్ లో భారత్ లీగ్ దశ మ్యాచ్ లు**

సెప్టెంబరు 10- యూఏఈతో (దుబాయ్)
సెప్టెంబరు 14- పాకిస్థాన్ తో (దుబాయ్)
సెప్టెంబరు 19- ఒమన్ తో (దుబాయ్)

## 750+ పరుగులు చేసినా 'టాప్ -10' నుంచి గిల్ ఔట్.. కారణమిదేనా?

ఇంగ్లాండ్ - భారత్ ఐదో టెస్టు ముగిసిన రెండు రోజులకే ఐసీసీ ర్యాంకులు వెలువడ్డాయి. బౌలింగ్, బ్యాటింగ్ లో ఇంగ్లాండ్ కంటే టీమ్ఇండియా ఆటగాళ్లే ఎక్కువ ఆధిపత్యం ప్రదర్శించారు. దీంతో ఐసీసీ ర్యాంకుల్లో ఆ ప్రభావం కనిపించినా.. ఒకేఒక్క ఆటగాడి విషయంలో ఇది తిరగబడటం గమనార్హం. అతడేమన్నా సరిగ్గా ఆడకుండా ఉన్నాడా? అంటే అదేం కాదు. ఈ సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ అతడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ నెగ్గిన ప్లేయర్. ఇప్పటికే అర్థమై ఉంటుందిగా అతడే కెప్టెన్ శుభ్ మన్ గిల్ . ఐసీసీ ర్యాంకుల్లో నాలుగు స్థానాలు దిగువకు పడిపోయాడు. సాధారణంగా బాగా ఆడితే ఆటోమేటిక్ గా ర్యాంక్ పెరగాలి కానీ.. ఇలా జరిగిందేంటా? అని అభిమానుల్లో సందేహం మొదలైంది. అయితే, దీనికి కారణం ఉందని తాజా కథనాలను బట్టి తెలుస్తోంది.

ఒకే సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన రెండో కెప్టెన్ గా శుభ మన్ గిల్ నిలిచాడు. ఇంగ్లాండ్ పై ఐదు టెస్టుల్లో 754 పరుగులు చేశాడు. క్రికెట్ దిగ్గజం డాన్ బ్రాడ్ మన్ (801) తర్వాత గిల్ దే రికార్డు. అయితే, ఐదో టెస్టుకు ముందు గిల్ ఐసీసీ ర్యాంకుల్లో 9వ స్థానంలో ఉన్నాడు. కానీ, చివరి మ్యాచులో అతడు కేవలం 32 పరుగులు మాత్రమే చేశాడు. ఇదే గిల్ ర్యాంక్ పై గట్టి దెబ్బ కొట్టింది. ఇందులో కనీసం హాఫ్ సెంచరీ చేసి ఉన్నా అతడి రేటింగ్ లో బాగా తేడా వచ్చేదే. మరోవైపు చివరి టెస్టులో సెంచరీ చేసిన యశస్వి జైస్వాల్ మూడు స్థానాలను మెరుగుపర్చుకోవడం గమనార్హం. గాయం కారణంగా దూరమైన రిషభ్ పంత్ ఒక స్థానం కిందికి పడిపోయాడు.

**అట్కిన్సన్, టంగ్ విషయంలో ఇలా..**

ఇంగ్లాండ్ - భారత్ మధ్య చివరి టెస్టులో ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన ప్రతి బౌలరూ ఐసీసీ ర్యాంకుల్లో



దూసుకురావడం విశేషం. ఇంగ్లాండ్ ఆటగాడు గస్ అట్కిన్సన్ కేవలం చివరి మ్యాచ్ లోనే ఆడాడు. అయితే, ఐదు వికెట్ల ప్రదర్శన చేయడంతోపాటు మొత్తం 8 వికెట్స్ తీశాడు. దీంతో రెండు స్థానాలు మెరుగై కెరీర్ లో తొలిసారి టాప్-10లోకి దూసుకొచ్చాడు. సిరీస్ ఆసాంతం అద్భుతంగా రాణించిన సిరాజ్ ఏకంగా 12 స్థానాలు దూసుకొచ్చి 15వ ర్యాంకులో నిలిచాడు. సిరాజ్ కూడా ఫైఫర్ తీశాడు. జోష్ టంగ్ కూడా చివరి మ్యాచ్ లో 8 వికెట్లు తీశాడు. ఇందులో '5' వికెట్ల ప్రదర్శనా ఉంది. దీంతో 14 స్థానాలు మెరుగుపర్చుకొని 46వ ర్యాంకులోకి వచ్చాడు. అతడు మూడు మ్యాచుల్లో 19 వికెట్లు తీసి ఇంగ్లాండ్ తరపున టాప్ వికెట్ టేకర్ గా నిలిచాడు.

## చరిత్ర సృష్టించిన మాట్ హెన్రీ.. ఆల్ టైమ్ రికార్డు సమం

బులవాయో వేదికగా జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ స్టార్ పేసర్ మాట్ హెన్రీ నిప్పులు చెరిగాడు. అతడు బౌలింగ్ దాటికి పసికూన జింబాబ్వే విల్లవిల్లాడింది. తొలి ఇన్నింగ్స్ లో హెన్రీ 5 వికెట్లతో సత్తాచాటాడు. దీంతో మొదటి ఇన్నింగ్స్ లో ఆతిథ్య జింబాబ్వే కేవలం 125 పరుగులకే కుప్పకూలింది. కివీస్ బౌలర్లలో హెన్రీతో పాటు జకారీ ఫౌలక్స్ 4 వికెట్లతో అదరగొట్టాడు. ఇక జింబాబ్వే బ్యాటర్లలో మూడేళ్ల తర్వాత జట్టులో ఎంట్రీ ఇచ్చిన బ్రెండన్ టేలర్(44) టాప్ స్కోరర్ గా నిలవగా.. తిసాగా(33) రాణించారు. ఈ క్రమంలో మాట్ హెన్రీ ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు.

జింబాబ్వేపై టెస్టుల్లో అత్యధిక సార్లు ఫైవ్ వికెట్ల హాల్ సాధించిన న్యూజిలాండ్ బౌలర్ గా క్రిస్ కెయిరన్స్ రికార్డును హెన్రీ సమం చేశాడు. కెయిరన్స్ తన కెరీర్ లో జింబాబ్వేపై 8 టెస్టులు ఆడి 39 వికెట్లు సాధించాడు. అందులో రెండు ఫైవ్ వికెట్ హాల్స్ ఉన్నాయి. మాట్ హెన్రీ కెరీర్ లో ఇప్పటివరకు కేవలం రెండు టెస్టులు మాత్రమే ఆడి 14 వికెట్లు పడగొట్టాడు. అందులో రెండు ఫైవ్ వికెట్ హాల్స్ ఉన్నాయి. కాగా తమ తొలి ఇన్నింగ్స్ ను ప్రారంభించిన న్యూజిలాండ్ నిలకడగా ఆడుతోంది. 32 ఓవర్లు ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 150 పరుగులు చేసింది. క్రీజులో విల్ యంగ్(69), కాన్వే(71) ఉన్నారు.



## మహేశ్‌కు నచ్చని కథ.. తీరా సినిమా సూపర్ హిట్టు!

మహేశ్బాబు కెరీర్ లో సూపర్ హిట్ చిత్రాల్లో మురారి ఒకటి. ఈ చిత్రంతోనే బాలీవుడ్ హీరోయిన్ సోనాలి బింద్రె తెలుగు తెరకు పరిచయమైంది. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందించాడు. 2001లో రిలీజైన ఈ చిత్రం గతేడాది మహేశ్ పుట్టినరోజు సందర్భంగా మరోసారి థియేటర్లలో విడుదలై సందడి చేసింది. రీరిలీజ్ సినిమా అయినప్పటికీ ఏకంగా రూ.9 కోట్లపైనే వసూళ్లు రాబట్టి రికార్డు సృష్టించింది.



ఈ మూవీలో మహేశ్ నటన, పాటలు అన్నీ అద్భుతంగా కుదిరాయి. తాజాగా ఓ వ్యక్తి మురారి సినిమాలోని 'చందమామ చందమామ కిందికి చూడమ్మా..' సాంగ్ క్లిప్ ను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఈ సినిమా కథ చెప్పినప్పుడు మహేశ్ రియాక్షన్ ఏంటి సర్? అని కృష్ణవంశీని అడిగాడు. అందుకు దర్శకుడు స్పందిస్తూ.. ఆయనకు నచ్చలేదు అని నవ్వుతున్న ఎమోజీలతో ఎక్స్ (ట్విటర్)లో రిప్లై ఇచ్చాడు.

ఇది చూసిన నెటిజన్లు.. తర్వాత ఏం జరిగింది సర్? ఆయన్ను ఎలా ఒప్పించారు? అసలేం జరిగిందో పూర్తిగా చెప్పొచ్చుగా అని ఆరా తీస్తున్నారు. మరికొందరేమో.. ఏముంది? మహేశ్ తండ్రి కృష్ణగారి దగ్గరకు వెళ్తే ఆయన కృష్ణవంశీకి కథపై ఉన్న నమ్మకం చూసి సినిమా చేయమని ఆదేశించినట్లున్నారు. మహేశ్ సరేనని తలాడించడంతో మురారి సినిమా పట్టాలెక్కింది అని ఊహిస్తూ కామెంట్లు చేస్తున్నారు.

## స్టైలిష్ మూమెంట్స్‌తో అదరగొట్టిన హృతిక్, తారక్

ప్రస్తుతం రాబోతున్న పలు అవైటెడ్ పాన్ ఇండియా చిత్రాల్లో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ అలాగే మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కలయికలో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన భారీ యాక్షన్ చిత్రం వార్ 2 కూడా ఒకటి. మరి ఈ సినిమాలో అవైటెడ్ సాంగ్ హృతిక్ వర్సెస్, ఎన్టీఆర్ నడుమ సాంగ్ కోసం ఎంతోమంది వెయిట్ చేశారు. మరి ఈ సాంగ్ తాలూకా ప్రోమో మేకర్స్ ఎట్టకేలకి వదిలారు. ఇక ఈ సాంగ్ లో మాత్రం ఇద్దరు హీరోలు మంచి స్మూత్ మూమెంట్స్ తో ఆకట్టుకున్నారని చెప్పాలి. స్టైలిష్ లుక్స్ లో మంచి గ్రేస్ తో చేసిన డాన్స్ మూమెంట్స్ బాగున్నాయి. ఇక సాంగ్ కూడా తెలుగు వెర్షన్ లో బాగుంది. మరి ఈ సాంగ్ ని మొత్తం థియేటర్స్ లోనే చూడాలని మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. ఇక ఈ చిత్రానికి ప్రీతమ్ సంగీతం అందించగా యష్ రాజ్ ఫిలమ్స్ వారు నిర్మాణం వహించారు.





## పెద్ద సౌత్ స్టార్ నాకు క్షమాపణలు చెప్పాడు

అన్ని భాషల్లో స్టార్ హీరోల సరసన నటిస్తూ సినిమాలు, వెబ్ సిరీస్ లతో అలరిస్తున్నారు నటి తమన్నా. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. చిన్న వయసులోనే ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు. ఆ సమయంలో ఎన్నో ఇబ్బందులు పడినట్లు చెప్పారు. అసౌకర్యంగా ఉందని చెప్పినందుకు తన స్థానంలో మరో నటిని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ''నేను చిన్న వయసులో ఇండస్ట్రీకి వచ్చాను కాబట్టి నాకేం తెలియదని అనుకునేవారు. నా విశ్వాసాన్ని దెబ్బతీయాలని చూశారు. ఇలా చాలాసార్లు జరిగింది. అవమానించడానికి ప్రయత్నించారు. పరిశ్రమకు వచ్చిన కొద్దికాలంలోనే ఓ పెద్ద సౌత్ స్టార్ సరసన నటించే అవకాశం వచ్చింది. ఆయనతో కొన్ని సన్నివేశాల్లో నటించేటప్పుడు అసౌకర్యంగా అనిపించింది. దర్శకనిర్మాతలకు నాకు ఇబ్బందిగా ఉందని, చేయలేనని చెప్పా. అప్పుడు ఆ అగ్రహీరో 'హీరోయిన్ ను మార్చండి' అని నాపై కేకలు వేశాడు. ఎవరైనా మనల్ని అవమానించారని బాధపడుతూ మనం కూడా తిరిగి వాళ్లతో అలా ప్రవర్తించకూడదని మౌనంగా ఉన్నాను. ఆయన మాత్రం ఆరోజు సెట్ లోనే అందరి ముందు పెద్దగా కేకలు వేశాడు. మరుసటిరోజు తనంతటతానే నా వద్దకువచ్చి క్షమాపణలు చెప్పాడు. తనకు కోపం వచ్చిందని అందుకే అరిచినట్లు తెలిపాడు. నాతో అలా ప్రవర్తించి ఉండకూడదని పశ్చాత్తాపపడ్డాడు'' అని తమన్నా తెలిపారు. అయితే, ఆ బిగ్ సౌత్ స్టార్ పేరు మాత్రం ఆమె చెప్పలేదు. 2005లో 'చాంద్ సా రోష్ చెహ్రా' అనే సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు తమన్నా. ఆ తర్వాత 'శ్రీ' సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించారు. 'హ్యాపీడేస్'తో మంచి గుర్తింపు రావడంతో వరుస అవకాశాలు వచ్చాయి. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో అగ్రహీరోల సరసన నటించారు. తాజాగా 'రైడ్ 2'తో ఓ ప్రత్యేక పాటలో అలరించిన ఆమె ప్రస్తుతం నాలుగు హిందీ సినిమాల్లో నటిస్తున్నారు. ఇవన్నీ సెట్స్ పై ఉన్నాయి. తెలుగులో ఇటీవల 'ఓదెల 2'తో శివశక్తిగా మెప్పించారు. మరోవైపు తమన్నా తాజాగా చెప్పిన బ్యూటీ సీక్రెట్ నెట్టింట చర్చకు దారితీసింది. మొటిమలు తగ్గాలంటే సలైవా రాసుకోవాలని ఆమె సూచించారు. అందులో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయని తెలిపారు. అవి మొటిమలతో పోరాడతాయని అయితే ఇది తన వ్యక్తిగత పర్సనల్ చిట్కా అని వెల్లడించారు. ఈ చిట్కాను పాటించొద్దంటూ పలువురు చర్మ వైద్యనిపుణులు సోషల్ మీడియాలో వీడియోలు చేయడంతో ఈ బ్యూటీ చిట్కా టాపిక్ గా మారింది.

## అకీరా కోసం వీరమల్లుకు సాయం!.. నిర్మాత ఏమన్నారంటే

పవన్ కల్యాణ్ కుమారుడు అకీరాను ఇండస్ట్రీకి పరిచయం చేయాలని అందరికీ ఉంటుందన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. ప్రస్తుతం ఆయన నిర్మిస్తున్న 'ది రాజాసాబ్' శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన 'హరిహర వీరమల్లు'కు సాయం చేయడంపై మాట్లాడారు. అకీరా సినిమా కోసమే సాయం చేయలేదని.. తనకు చేయాలని అనిపించింది కాబట్టి చేసినట్లు తెలిపారు.

''అకీరాను ఇండస్ట్రీకి పరిచయం చేయాలని నిర్మాతలందరికీ ఉంటుంది. నాకు కూడా అవకాశం వస్తే కచ్చితంగా తనతో సినిమా చేస్తాను. అయినా.. అకీరా ఎవరితో సినిమా చేయాలనేది సమయం తీసుకొని అతడే నిర్ణయించుకుంటాడు. ఈ విషయంలో ఎన్నో వార్తలు వస్తున్నాయి. దానికోసమే నేను 'హరిహర వీరమల్లు'కు సాయం చేయలేదు. నిర్మాత ఏఎం రత్నంకు అప్పుడు నా అవసరం ఉందనిపించి చేశానంతే. ఆ సమయంలో పవన్ నన్ను చూశారు. 'వీరమల్లు' ప్రీ రిలీజ్ వేడుకలో అందుకే థాంక్స్ చెప్పారు. అంతేకానీ, అకీరా సినిమా కోసమే పవన్ చిత్రానికి సాయం చేశాననేది అవాస్తవం'' అని స్పష్టతనిచ్చారు. తనకైతే పవన్, చిరంజీవి, అకీరా అందరి సినిమాలను నిర్మించాలని ఉందన్నారు.



ఇక 'ది రాజాసాబ్' గురించి మాట్లాడుతూ.. సెప్టెంబర్ లో ఈ సినిమా నుంచి ఎక్కువ అప్డేట్స్ వస్తాయని చెప్పారు. అక్టోబర్ నాటికి సినిమా అంతా పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుగుతోందన్నారు. డిసెంబర్ 5న విడుదల చేయాలని అనుకుంటున్నట్లు తెలిపారు. కానీ, జనవరిలో రిలీజ్ చేయాలని చాలామంది కోరుతున్నారని.. త్వరలోనే దీనిపై తుదినిర్ణయం తెలుపుతామని చెప్పారు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో హారర్ కామెడీ నేపథ్యంలో ఇది రానున్న విషయం తెలిసిందే.



## ది రాజాసాబ్... రెండో భాగం ఉంది

ప్రభాస్ చిత్రమంటే రెండు భాగాలు పక్కా అనేది పరిపాటిగా మారిపోయింది. ఇప్పటికే ఆయన 'కల్కి 2', 'సలార్ 2' సినిమాలు చేయాల్సి ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'ది రాజాసాబ్'కి కూడా రెండో భాగమున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. తాజాగా దీనిపై చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ స్పష్టత ఇచ్చారు. 'రాజాసాబ్ 2' ఉంటుందని.. కాకపోతే ఇది తొలి భాగానికి కొనసాగింపులా ఉండదని.. థీమ్, సెటప్ ఒకే తరహాలో ఉంటాయని విశ్వప్రసాద్ చెప్పారు. అనంతరం విడుదల తేదీ విషయమై స్పందిస్తూ.. ప్రభాస్ అభిమానులు, తెలుగు మార్కెట్ వర్గాలు ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 9న తీసుకు రావాలని కోరుతున్నారని.. హిందీ ప్రేక్షకులు మాత్రం డిసెంబరు 5న విడుదల చేయాలని కోరుతున్నారని చెప్పారు. ఏదేమైనా తాము అనుకున్న తేదీకే సినిమాని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. అక్టోబరు నాటికి మొత్తం చిత్రీకరణ పూర్తి కానుందని విశ్వప్రసాద్ తెలియజేశారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా.. సంజయ్ దత్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. తమన్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.